# మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీఐ),

# భాకపా(మాలె) [పీపుల్స్‌వార్]

# సంక్షిప్త చరిత్ర

# మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీఐ)

# సంక్షిప్త చరిత్ర

**ఉపోద్ఘాతం**

ఇరవయ్యో శతాబ్దంలో అరవయ్యవ దశకం యావత్తు ప్రపంచాన్నీ కుదిపివేసిన వెల్లువల దశకం అన్నది అందరికీ తెలిసిన విషయమే. ఆ నేపథ్యంలో, మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానం (ఇప్పుడు మావోయిజం)తో ఉత్తేజితులయిన నిజమైన విప్లవకారులు రివినిజానికి వ్యతిరేకంగా తిరగబడమంటూ గొప్ప పిలుపిచ్చారు. ఆ సమయంలో మావో నేతృత్వంలో సీపీసీ కృశ్చేవైటు రివిజనిజానికి వ్యతిరేకంగా బృహత్తర వాదోపవాదాలు నిర్వహించింది. దీని బలమైన ప్రభావం కిందనే భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమం రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తూ సరికొత్తగా ప్రారంభమయింది.

ఈ పరిస్థితిలో అనేక అసాధారణ, అగ్రశ్రేణి నాయకత్వ కామ్రేడ్స్ రివిజనిజానికి వ్యతిరేక పోరాట క్రమంలో ముందుకు వచ్చారు. కామ్రేడ్ సీఎం, కామ్రేడ్ కేసీలు ఇలా ఆవిర్భవించిన వారే. 1964లో సీపీఎం ఏడో కాంగ్రెస్ జరిగినప్పుడు, నిజానికి, రివిజనిజానికి వ్యతిరేక పోరాటం స్పష్టంగా పార్లమెంటరిజానికీ దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికీ మధ్య పోరాటంగా ముందుకు వచ్చింది. ఆ తరువాత కాలంలో భారతదేశంలో తీవ్రమవుతున్న ఈ కమ్యూనిస్టు ఉద్యమం మీద ప్రపంచాన్ని కుదిపివేసిన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవం గొప్ప ప్రభావం వేసింది. 1967లో కామ్రేడ్ సీఎం నాయకత్వంలో మహత్తర నక్సల్బరీ తిరుగుబాటు భారతదేశమంతటా వసంత మేఘగర్జనలా సాగింది. భారతదేశమంతటా రివిజనిజానికి వ్యతిరేకంగా ఒక నూతన వెల్లువ ముందుకు వచ్చింది. రాజకీయంగా ఉత్సాహ పరిస్థితి ఏర్పడింది.

ఈ స్థితిలో ఒక పక్క 1969 ఏప్రిల్ 22వ తేదీ కామ్రేడ్ సీఎం నేతృత్వంలో భాకపా(మాలె) పార్టీ ఏర్పడింది. అదే సంవత్సరం అక్టోబరు 20వ తేదీన కామ్రేడ్ కేసీ నేతృత్వంలో మావోయిస్టు కమ్యూనిస్టు సెంటర్ (ఎంసీసీ) ఏర్పడింది. ఈ రెండు విప్లవ స్రవంతులూ విడివిడిగా ఉన్నప్పటికీ అనేక అడ్డంకులను అధిగమిస్తూ ముందుకు సాగాయి. అంతిమంగా 2004 సెప్టెంబరు 21వ తేదీన వీటి విలీనం ఒక మహా స్రవంతికి దారి తీసింది. భాకపా(మాలె)(పీపుల్స్‌వార్), ఎంసీసీఐ కలిసి భాకపా(మావోయిస్టు)కు జన్మనిచ్చాయి.

ఈ రెండు పార్టీల ఆశయాలూ లక్ష్యం ఒకటే అయినప్పటికీ వాటి చరిత్రలో పోలికా ఉంది, కొంత తేడాలూ ఉన్నాయి.

విశాల శ్రేణులకు ఈ రెండింటి చరిత్రనూ పరిచయం చేయాలన్న నిర్ణయం మేరకు ఇక్కడ ఎంసీసీఐ చరిత్రను సంక్షిప్తంగా ఇస్తున్నాం.

**ఎంసీసీఐ చరిత్ర ప్రారంభం**

రివిజనిస్టు అభిప్రాయాలూ పంథాలతో రాజకీయ నిర్మాణపర అంశాలలో స్పష్టమైన విభజన రేఖ గీస్తూ విప్లవ సిద్ధాంతం పునాదిగా, విప్లవ పోరాట క్రమంలో ఒక నిజమైన విప్లవ పార్టీని నిర్మించడానికి గట్టి నిశ్చయంతో, 1964లో రివిజనిస్టు సీపీఎం ఏడో కాంగ్రెస్ జరిగిన తరువాత ఒక విప్లవ కేంద్రం ఏర్పాటయింది. ఇది 1969 అక్టోబరు 20వ తేదీన ఎంసీసీగా ఆవిర్భవించింది.

ముందుగా, కామ్రేడ్ కేసీ, కామ్రేడ్ అమూల్యా సేన్ కామ్రేడ్ చంద్రశేఖర్ దాస్‌ల చొరవతో ఏర్పడిన ఈ సంస్థ విప్లవ కేంద్రం స్వభావం కలిగి ఉంది. ఈ సంస్థకు ఆనాడు చాలా పరిమిత బలం ఉంది. ఒంటరిగా ఉంది. అటువంటి స్థితిలో కామ్రేడ్ కేసీ మన ముఖ్యమైన కర్తవ్యాన్ని వివరించాడు. దాని గురించి క్లుప్తంగా ఇలా చెప్పవచ్చు - భారత విప్లవానికి మార్గదర్శక పంథాగా, వ్యూహం ఎత్తుగడలకు సంబంధించి నిర్దిష్ట పంథాకు పునాదిగా ప్రజాభిప్రాయాన్ని సృష్టించండి, వృత్తి విప్లవ కేడర్‌లను నిర్మించండి. గ్రామీణ ప్రాంతంలో పని చేయడానికి ఒక పంథాను రూపొందించండి. నగరాలలో పని చేయడానికి ఒక పంథాను అవలంబించండి. కార్మికులు, విద్యార్థులు, యువజనులూ మొదలయిన వారిలో పని చేయడానికి ఒక పంథాను అవలంబించండి. ప్రధాన, కేంద్ర కర్తవ్యంగా మన బలాన్ని బట్టీ శక్తిని బట్టీ సైన్యాన్నీ బేస్ ఏరియాలనూ నిర్మించడానికి ఒక నిర్దిష్ట పథకాన్ని అవలంబించండి. ఒక్క మాటలో, పూర్తిగా ఆచరణలో నిమగ్నం కావడం కోసం ఒక పంథాను అవలంబించండి...

రివిజనిజం నిర్దిష్ట ప్రతిబింబాలుగా కామ్రేడ్ కేసీ సమర్థవంతమైన నాయకత్వం కింద ఈ అంశాల మీద పోరాటం చేయాలని నిర్ణయమయింది - 1. ఆర్థికవాదం 2. స్పాంటేనిటీ 3.లీగలిజం 4. కేంద్రీకృత నిరంకుశత్వం 5. బూర్జువా పార్లమెంటరీ వ్యవస్థ మొదలయినవి.

రివిజనిజానికి వ్యతిరేకంగా మన పోరాట క్రమంలో మనం గట్టిగా పోరాటం చేయవలసిన వివిధ అవకాశవాద సూత్రాలు ఇవీ - 1. నయా వలసవాదాన్ని నూతన వలసవాద రూపంగా ఆమోదించని అభిప్రాయం. అంటే, సామ్రాజ్యవాదుల ప్రత్యక్ష దోపిడీ పాలనలకు బదులు పరోక్ష దోపిడీ. 2. భారత రాజ్యానికి ఉన్న నయా వలస రకపు అర్ధ వలస, అర్ధ భూస్వామ్య స్వభావాన్ని ఆమోదించకపోవడం, భారత విప్లవ జాతీయ, ప్రజాస్వామిక స్వభావాన్ని గుర్తించకపోవడం.

1964లో అవిభజిత కమ్యూనిస్టు పార్టీతో విడిపోయే క్రమంలో సీపీఎం ఏడో కాంగ్రెస్ నాటి నుంచీ సీపీఎం రివిజనిస్టు పంథాతో సంబంధాలు తెంచుకునేందుకు తిరుగుబాటు చేసినప్పుడు భారత విప్లవానికి సరైన పంథా ఏదన్న ప్రశ్న, భారత విప్లవ దశ, పంథాల గురించిన ప్రశ్నా ముందుకు వచ్చాయి.

ఇటువంటి ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించడానికి 1965లో చింతా అనే డాక్యుమెంటుల ద్వారా ఒక ప్రయత్నం జరిగింది (ఆనాటి సీపీఐ(ఎం) పార్టీలో రివిజనిజానికి వ్యతిరేకంగా గట్టి పోరాటాన్ని రహస్యంగా చేయడం కోసం 6 డాక్యుమెంటులు తీసుకువచ్చారు). ఆ తరువాత 1966లో దక్షిణ్‌దేశ్ పత్రిక ద్వారా రివిజనిజానికి వ్యతిరేకంగా తీవ్ర రాజకీయ సైద్ధాంతిక చర్చ కొనసాగింది. అయితే ఒక మౌలిక డాక్యుమెంటు ద్వారా నిరంతర పంథా అవసరం ఉందని నాడు భావించారు. ఈ క్రమంలో ఈ ప్రశ్నలకు జవాబులు వెతికే కృషిలో కామ్రేడ్ కేసీ భారత విప్లవానికి వ్యూహాత్మక, ఎత్తుగడల పంథా అనే డాక్యుమెంటును చర్చ కోసం సమర్పించాడు. కామ్రేడ్ లెనిన్ వలసవాద సిద్ధాంతం, జాతి సమస్య గురించిన వ్యాసం, కామ్రేడ్ స్టాలిన్, జాతి సమస్య గురించి రాసినదీ, బోల్షివిక్ పార్టీ చరిత్ర, లెనినిజం సమస్యలు, మావో నాయకత్వంలో సీపీసీ నడిపించిన బృహత్తర వాదోపవాదాలకు సంబంధించిన ముఖ్యమైన డాక్యుమెంటులు, ముఖ్యంగా అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ సాధారణ పంథా (జూన్ 14 లేక), నయావలసవాదం సమర్థకులు, మావో రాసిన నూతన ప్రజాస్వామ్యం, చైనా సమాజంలో వర్గాల విశ్లేషణ, చైనా విప్లవం, చైనా కమ్యూనిస్టు పార్టీ, సైనిక వ్యవహారాల గురించి ముఖ్యమైన వ్యాసాలూ మొదలయిన వాటి పునాదిగా కామ్రేడ్ కేసీ ఈ డాక్యుమెంటును తయారుచేసాడు.

కామ్రేడ్ కేసీ సమర్పించిన ఈ డాక్యుమెంటు ద్వారా సీపీఐ, సీపీఎం రివిజనిజంతో రాజకీయంగా ఒక స్పష్టమైన విభజన రేఖ ఏర్పాటయింది. వ్యూహం గురించిన డాక్యుమెంటు తీవ్రంగా విభజన రేఖ గీసిన రాజకీయ అంశాలు ఇవీ -

1. భారత విప్లవం ప్రపంచ విప్లవంతో విడదీయలేని భాగం

2. నేడు భారత సమాజంలో (అ) సామ్రాజ్యవాదం నిర్మూలనమయిందా లేదా. సామ్రాజ్యవాదానికీ విశాల ప్రజానీకానికీ మధ్య వైరుధ్యం (ఆ) భారత రాజకీయాలు (ఇ) భూస్వామ్యం నిర్మూలనమయిందా లేదా. భూస్వామ్యానికీ విశాల ప్రజానీకానికీ మధ్య వైరుధ్యం (ఈ) నేటి భారతీయ సంస్కృతి.

3. ప్రస్తుత భారతీయ జాతీయ ఆర్థిక వ్యవస్థ స్వభావం

4. భారతీయ సామాజిక వ్యవస్థ, సామాజిక సంక్షోభం

5. భారత విప్లవ స్వభావం, భారత విప్లవంలో రెండు దశలు.

6. జాతీయ విప్లవం, ప్రజాస్వామిక విప్లవాల మధ్య అంతర్గత సంబంధాలు, నాయకత్వం గురించి

7. ప్రజాస్వామ్యం మౌలిక కర్తవ్యం - 1. ప్రజాస్వామిక రాజ్యం, రాజకీయాలు - రాజ్య

వ్యవస్థ నిర్దిష్టతలు 2. ప్రజాస్వామిక ఆర్థికాలు 3. ప్రజాస్వామిక సంస్కృతి.

8. జాతుల ఐక్యతకు పునాది.

9. విప్లవ పంథా -ప్రజాయుద్ధం ద్వారా రాజకీయాధికారాన్ని స్వాధీనం చేసుకోవడం విప్లవ కేంద్ర కర్తవ్యం, ఛైర్మన్ మావో చూపించిన దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పంథాయే భారత విముక్తి పంథా.

10. భారతదేశంలో వాస్తవ పరిస్థితుల నిర్దిష్టతలు నిర్ణయించిన ప్రజా యుద్ధ దీర్ఘకాలిక స్వభావం.

11. ఎన్నికల మోసపూరిత ముసుగును బహిర్గతం చేయండి, దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా చేపట్టండి.

12. విప్లవంలో మూడు అద్భుత ఆయుధాలు.

13. మహత్తర భారత విప్లవ అంతర్జాతీయ ప్రాముఖ్యత.

ఆ తరువాత, డాక్యుమెంటులో ఎత్తుగడలకు సంబంధించి రివిజనిజంతో విభజన రేఖ గీసిన అంశాలు ఇవీ -

1. సాయుధ బలం ద్వారా రాజకీయాధికారం స్వాధీనం చేసుకోవడం విప్లవ కేంద్ర కర్తవ్యం.

2. రష్యా విప్లవ పంథానా చైనా విప్లవ పంథానా. మహత్తర చైనా విప్లవ పంథానే భారత నూతన ప్రజాస్వామిక విప్లవ పంథా.

3. విశాల గ్రామీణ ప్రాంతం శత్రువుకు అతి బలహీనమైన ప్రాంతం - విప్లవ తుఫాను కేంద్రం. రైతాంగ ప్రజలు విప్లవానికి అతి స్థిరమైన మిత్రులు. వ్యవసాయ విప్లవ యుద్ధం రైతాంగ ప్రజలు ప్రజాయుద్ధంలో చేరేందుకు మౌలిక అంశం.

4. సమస్త పనికీ దీర్ఘకాలిక ప్రజాయుద్ధాన్ని నెలకొల్పడమే ప్రధాన కేంద్రంగా ఉంటుంది. గ్రామీణ ప్రాంతంలో ప్రజా సైన్యాన్నీ బేస్ ఏరియాలనూ ఏర్పరచడం ప్రస్తుతం ప్రాథమిక, ప్రధాన, కేంద్ర కర్తవ్యంగా ఉంటుంది.

5. గ్రామీణ ప్రాంతాలలో పని ప్రధానంగా ఉండాలి. గ్రామాలు, నగరాలలో పని మధ్య సరైన సంబంధం, నగరాలలో పనికి పంథా గురించి.

6. ప్రజాయుద్ధం ప్రధాన పోరాట రూపం కాగా ప్రజా సైన్యం ప్రధాన నిర్మాణ రూపం. ప్రధాన, ద్వితీయ పోరాట, నిర్మాణ రూపాల మధ్య సంబంధం.

7. వర్గ పంథా, ప్రజా పంథాల మీద స్థిరమైన పట్టు ఉంచుకోండి. కార్మికవర్గం, పేద,

భూమి లేని రైతాంగంలో పని మీద కేంద్రీకరించండి.

వ్యూహం ఎత్తుగడల గురించి కామ్రేడ్ కేసీ సమర్పించిన ఈ డాక్యుమెంటు నిజానికి ఎంసీసీఐ రాజకీయ అభిప్రాయాలకూ ఆచరణలో పనికీ నిర్దిష్ట వ్యక్తీకరణ.

**సోనార్‌పూర్ పోరాటం, మన ప్రాథమిక అనుభవం**

సైద్ధాంతిక పోరాటాన్ని ఆచరణాత్మక పనితో ముడిపెట్టకపోతే ఒక పక్క సిద్ధాంతం ఎంతో కొంత అర్థం లేనిదవుతుంది. మరో పక్క సిద్ధాంతం గురించి సరైన అవగాహనను పెంపొందించుకోలేం. అంతేకాక, వాస్తవ పోరాటాన్ని వెనక్కి నెట్టడం వల్ల సైద్ధాంతిక పోరాటం పురోగమించదు. లేదా ఎక్కువ దూరం సాగదు. లేదా రివిజనిస్టులను స్పష్టంగా ఒంటరులను చేయడం సాధ్యం కాదు. అందుకని సైద్ధాంతిక పోరాటం ద్వారా మన శక్తులను పరిమిత మేరకు ఒక చోటకు చేర్చుకున్న తరువాత మనం గెరిల్లా యుద్ధం కోసం రైతాంగాన్ని చైతన్యవంతులను చేసి, సంఘటితం చేసే కర్తవ్యం కోసం ఒక చిన్న బలగాన్ని గ్రామీణ ప్రాంతానికి తీసుకువెళ్లాం. మొదటగా సోనార్‌పూర్‌లో పరిచయం ఏర్పడింది. అందుకని అక్కడ పని ప్రారంభించాం.

సోనార్‌పూర్‌లో మనం ఇంకా నిర్మాణం ప్రారంభించి, ఒక మేరకు నిర్దిష్టంగా ఆచరణలోకి తీసుకువచ్చే లోపుగానే శత్రువు దాడి మొదలుపెట్టాడు. అటువంటి పరిస్థితిలో ఆత్మరక్షణలో రిట్రీట్ కావడం తప్ప ఎటువంటి ఎత్తుగడలు అవలంబించడం సాధ్యం కాదు. దీని ఫలితంగా సోనార్‌పూర్ పోరాటం గుణాత్మకంగా పురోగమన దశకు చేరుకోలేకపోయింది.

అయితే సోనార్‌పూర్‌లో ప్రత్యక్ష పని వల్ల మనం వర్గ విశ్లేషణ, రైతాంగ సమస్య వ్యవసాయ విప్లవం సమస్యల గురించి మరింత చక్కగా అర్థం చేసుకోగలిగాం. అంతేకాక, ఈ విషయాలు కూడా అవగాహన చేసుకోగలిగాం - రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవడం కోసం విప్లవ సాయుధ పోరాటాన్ని నిర్మించి అభివృద్ధి చేయాలి. అందుకోసం రివిజనిజానికి నిర్దిష్ట వ్యక్తీకరణనయిన ఆర్థికవాదం, మిలిటెంటు ఆర్థికవాదం, లీగలిజం, సంస్కరణవాదం, పార్లమెంటరిజం మొదలయిన వాటికి వ్యతిరేకంగా నిరంతర సైద్ధాంతిక భావజాల పోరాటం చేయాలి. 2. మన దేశంలో రివిజనిస్టు ధోరణి చాలా కాలంగా ప్రజా సంఘం, ప్రజా పోరాటం పేరుతో ఉన్నది. అందుకని మనం ప్రారంభం నుంచీ పార్టీ మౌలిక పునాదిగా రహస్య ఆక్టివిస్టు గ్రూపులకు ప్రాధాన్యత ఇవ్వాలి. వాటి మీద కేంద్రీకరించాలి. సాయుధ గెరిల్లా యూనిట్‌లు ప్రజా మిలీషియా నిర్మాణం మీద శ్రద్ధ పెట్టాలి. పార్టీని రహస్యంగా ఉంచుతూనే విశాల ప్రజానీకంలో పని చేసే పద్ధతిని అవలంబించాలి. సాయుధ పోరాటానికి మద్దతుగా ప్రజా సంఘాలనూ ప్రజా ఉద్యమాలనూ నిర్మించాలి. ముఖ్యంగా రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకోవడానికి సాయుధ ప్రతిఘటనా పోరాటాన్ని నిర్మించడం మీద శ్రద్ధ పెట్టాలి. అలాగే

ఇటువంటి పోరాటాలు నిర్మించేటప్పుడు ఆత్మ రక్షణా దళాలు, ప్రజా మిలీషియా, గెరిల్లా దళాల వంటి ప్రజా సాయుధ బలగాన్ని నిర్మించడానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఇవ్వాలి. 3. గ్రామీణ ప్రాంతంలో సాయుధ పోరాటాన్ని నిర్మించి అభివృద్ధి చేయడానికి అత్యవసర పరిస్థితిగా పేద, భూమి లేని రైతాంగం నుంచీ కేడర్‌నూ నాయకత్వ గ్రూపులనూ తయారు చేయాలి. అందరి కంటే పేద, భూమి లేని రైతాంగం మీద ఆధారపడాలి. 4. రైతాంగ మహిళలు, కార్మికవర్గ మహిళలను గ్రామీణ ప్రాంతంలో సాయుధ పోరాటంలో చైతన్యవంతులను చేయడం, సంఘటితం చేయడం భాగం చేయడాలకు ఉన్న ప్రాధాన్యతను గుర్తించాలి.

సోనార్‌పూర్ పోరాటం నుంచీ పాఠాలు తీసుకున్న తరువాతనే కాంక్సా-గయ-హజారీబాగ్ విప్లవ పోరాటాన్ని పురోగమింపజేయగలిగాం.

అత్యంత రాజకీయ ఆర్థిక అసమానత ఉండి, శత్రువు ఎంతో శక్తివంతంగా మనం బలహీనంగా ఉన్న భారతదేశం వంటి విశాల దేశంలో, గెరిల్లా యుద్ధం చేయడానికి వీలుగా అనుకూలంగా ఉన్న వ్యూహాత్మక ప్రాంతాలలో పని చేయడం అత్యంత అవసరం అని సోనార్‌పూర్ పోరాటం నుంచీ మనం పాఠం నేర్చుకున్నాం. అందుకని సోనార్‌పూర్‌లో సాయుధ వ్యవసాయ విప్లవ పనిలో కొంత ప్రాథమిక, ఆ పై స్థాయి అనుభవం పొందిన తరువాత, సాయుధ విప్లవ గెరిల్లా పోరాటం, దీర్ఘకాలిక ప్రజా యుద్ధం పునాదిగా మనం కొన్ని ఎంపిక చేసిన, వ్యూహాత్మక ప్రాంతాలలో పని చేయనారంభించాం. భారతదేశ నిర్దిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, సైనిక కార్యకలాపాల ద్వారా ఈ సమయంలో మన రాజకీయ కర్తవ్యంలో ఎలా విజయవంతం అవుతాం అన్నది మనకు ప్రధాన ప్రశ్న అయింది. ఈ సమస్యను పరిష్కరించుకోవడం కోసం మనం కామ్రేడ్ మావో సైనిక రచనల నుంచీ కొన్ని ప్రత్యేక వ్యాసాలు అధ్యయనం చేయడం మీద కేంద్రీకరించాం. సైన్యం, బేస్ ఏరియాల నిర్మాణ క్రమం, పద్ధతుల గురించి స్పష్టమైన అవగాహన ఉన్న వ్యాసాలను ప్రత్యేకంగా అధ్యయనం చేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహించాం.

భారతదేశంలో దీర్ఘ కాలంగా ఉన్న ఆర్థికవాద, సంస్కరణవాద, రివిజనిస్టు ఉద్యమ ధోరణులకు వ్యతిరేక పోరాట రాజకీయ, నిర్మాణపర అంశాలు, లక్ష్యాలు, రూపాలు పద్ధతుల విషయంలో ప్రతీ అంశంలోనూ స్పష్టమైన విభజన రేఖ గీయవలసిన అవసరం ఉందని భావించాం. ఈ దృష్ట్యా మనం రైతాంగ ఉద్యమ ఆశయాలు, లక్ష్యాలు, దృక్పథం, ఎజెండాల విషయంలో పాత రివిజనిస్టులతో స్పష్టమైన విభజన రేఖ గీయాలని నిర్ణయించుకున్నాం. ఈ పని చేసేప్పుడు మనం సోవియట్ రష్యాలో పరిస్థితినీ రష్యా అనుభవాన్నీ, చైనాలో పరిస్థితినీ చైనా అనుభవాన్నీ దృష్టిలోకి తీసుకున్నాం. భారతదేశ నిర్దిష్ట పరిస్థితులలో సాయుధ విప్లవ దృక్పథం, ప్రగతితో రైతాంగ ఉద్యమం ఎలా పురోగమిస్తుందన్న విషయాన్ని నొక్కి చెప్పాం. ఈ అవగాహన ప్రకారం, రైతాంగ ఉద్యమ రాజకీయ సూత్రానికి సంబంధించి రెండు మౌలిక నినాదాలు ఇవ్వడానికి నిర్ణయించుకున్నాం - దున్నేవారికే భూమి, విప్లవ రైతాంగ కమిటీలకే రాజకీయ

పాలనా, అధికారం.

ఈ దృక్పథాన్నీ అందుకు అనుగుణంగా పని పద్ధతీ పని శైలులను ఆచరణలో పెట్టడం ద్వారా కాంక్సా-గయ-హజారీబాగ్ మొదలయిన ప్రాంతాలలో ఒక నూతన పంథానూ విప్లవోద్యమం, ప్రజా ఉద్యమంలో నూతన స్రవంతినీ ప్రారంభించడం సాధ్యమయింది. ఈ ఆశయాలు, లక్ష్యాలూ దృక్పథంతో విప్లవ రైతాంగ ప్రజలూ శ్రామిక ప్రజలూ మరింత తీవ్రంగా వివిధ రకాల పోరాటాలలో పాలు పంచుకోవడం ప్రారంభించారు. ఈ కాలంలో వాళ్లు నూతన రకాల ప్రజా సంఘాలనూ ప్రజా ఉద్యమాలనూ నిర్మించి తన సొంత అనుభవాల పునాదిగా వాటిని పెంపొందించారు. తమ ధర్మబద్ధతనూ విశ్వాసాన్ని ఎన్నో రెట్లు పెంచుకున్నారు. తమ సంఘటిత సాయుధ బలగం ద్వారా, మరో మాటలో చెప్పాలంటే తుపాకీ బలంతో తమ సొంత రాజకీయాధికారాన్ని నెలకొల్పుకోగలమని అర్థం చేసుకోవడానికి ఇది వారికి ఉపయోగపడింది. పాలక వర్గాల చట్టాన్నీ పాలననూ ధ్వంసం చేసి ప్రజల చట్టాన్నీ పాలననూ నెలకొల్పడానికి మార్గం వేసే ఎత్తుగడలూ రూపాలూ పద్ధతులనూ విప్లవ పోరాట భావజాలాన్నీ పెంపొందించి, అన్వయించారు. ఇప్పుడిక వాళ్లు బీడీఓ లేదా ఎస్‌డీఓ దగ్గరకో మరే అధికారి దగ్గరకో చేతులు కట్టుకుని వెళ్లలేదు. ఆహారం కోసం సహాయం కోసం ధర్నాలు చేయలేదు. లేదా బిచ్చపు చిప్ప పట్టుకున్నట్టు డిమాండ్‌లు చేయలేదు. సహాయం కావాలంటూ పాలక వర్గం దగ్గరకో ప్రభుత్వ ఉద్యోగుల దగ్గరకో వెళ్లలేదు. తమ సొంత సమస్యలను పరిష్కరించుకోవడం కోసం ముందుకు సాగుతూ తమ సొంత సంఘటిత బలం మీదనే, అంటే తుపాకీ బలం మీదనే నమ్మకం ఉంచారు. సానుభూతి కోసం, సహాయం కోసం శత్రు గడప ముందు అడుక్కోకుండా న్యాయంగా తమదైనదాన్ని బలవంతంగా గుంజుకోవడాన్ని సమర్థిస్తూ తమ సొంత సాయుధ బలగం మీద ఆధారపడే పద్ధతినీ పంథానూ అవలంబించారు.

తద్వారా పోరాట నిర్మాణ రూపాలలో పద్ధతులలో పెనుమార్పు తీసుకువచ్చారు. గాంధేయ, నిరాయుధ, పూర్తి బహిరంగ, లీగల్ రూపాలూ పద్ధతులకు బదులుగా వారు ప్రధానంగా సాయుధ, రహస్య, లీగలేతర రూపాలూ పద్ధతుల మీద శ్రద్ధ వహించారు.

ఉదాహరణకు, రహస్య, సాయుధ పద్ధతిలో చిన్న గ్రూపులుగా విభజితమవుతూ, వల లాగుతున్నట్టు ఒక ప్రదేశంలో వేగంగా కలుస్తూ, పెద్ద వర్గ శత్రువు ఇళ్ల మీదనో స్థావరాల మీదనో లేక వారి అరువు తెచ్చుకున్న గూండాల మీదనో హఠాత్తుగా దాడి చేసేవారు. వల వేస్తున్నట్టుగా కను మూసి తెరిచేంతలో అటూ ఇటూ వెళ్లిపోయేవారు. శత్రువు కదలికలూ కార్యకలాపాల మీద కచ్చితమైన నిఘా పెట్టారు. తమ యావత్తు పనిలో పార్టీ ఆదేశాలకు కట్టుబడి ఉన్నారు. వర్గ శత్రువుల నుంచీ వారి చెంచాల నుంచీ స్వాధీనం చేసుకున్న, లేదా జరిమానా రూపంలో తిరిగి తీసుకున్న ఆహార పదార్థాలలో చిన్న భాగాన్ని ఉంచి మిగిలినదంతా ప్రజలకు పంచేవారు. శత్రు పొలాల నుంచీ పంట స్వాధీనం చేసుకుంటున్నప్పుడు కూడా

ఇదే పద్ధతిలో పంపిణీ చేసేవారు. ఈ రకంగా ప్రజలు ఆహార సమస్య పరిష్కరించుకోవడానికి సహాయం చేయడానికి ప్రయత్నం చేసేవారు. అవసరానికి తగినంతగా లేకపోయినప్పటికీ ప్రజానీకంలో ఇది విశ్వాసం నింపింది. శత్రువు నుంచీ స్వాధీనం చేసుకున్న తుపాకులనూ నగదునూ బంగారాన్నీ వెండినీ పార్టీకి ఇచ్చి పోరాటాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి సహాయపడేవారు. వర్గ శత్రువులనూ వారి స్థానిక ఏజెంటులనూ శిక్షించే విషయంలో కుక్కకు ఇవ్వవలసినవి ఇవ్వండి అన్న విధానాన్ని అవలంబించేవారు. కొందరిని ఒత్తిడితో గెలుచుకోవడానికి ప్రయత్నిస్తే, మరి కొందరిని తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించేవారు. మరి కొందరిని ప్రజలు విమర్శలకు గురి చేసేవారు. కొందరిని కొట్టేవారు. అలాగే ఒత్తిడి చేసి, బెదిరించి కొందరిని నిర్మూలించేవారు.

సాధారణంగా, గూండాలు, పోలీసులు, ప్రజల మీద అత్యాచారాలకు పాల్పడేవాళ్లు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినవాళ్లు, విప్లవకారులను పోలీసులు అరెస్టు చేయడానికీ హత్యచేయడానికీ కుట్ర పన్నిన వాళ్లకు సాధారణ ప్రజల అనుమతితో మరణశిక్ష విధించేవారు. ఫారెస్టు గార్డులను బెదిరించడం, అవసరాన్ని బట్టి కొట్టడం చేసిన తరువాత అనేక ప్రాంతాలలో ఇప్పుడు వాళ్లు రావడానికి సాహసించడం లేదు. ఇక్కడా ఇతర పొరుగు ప్రాంతాలలోనూ అడ్డూ ఆపూ లేకుండా కొనసాగిన వారి దోపిడీ అత్యాచారాలు ఆ తరువాత కొనసాగలేదు. పోరాట ప్రాంతాలలోనూ ఆ పరిసర ప్రాంతాలలోనూ కూడా రైతాంగాన్ని ఇప్పుడు గౌరవంతో పిలుస్తున్నారు. కొన్ని పోరాట ప్రాంతాలలో అత్యాచారాలు చేసిన పెద్ద వర్గ శత్రువులు భయంతో గ్రామం విడిచి పారిపోయారు. సమీప పట్టణాలలో ఆశ్రయం తీసుకున్నారు. అక్కడి నుంచీ తమ ఏజెంటులూ గూండాలూ పోలీసుల ద్వారా దోపిడీ బలవంతపు పాలనను నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. నిజానికి సమయం గడిచిన కొద్దీ ఈ వర్గ శత్రువులు ఇంకా ఇంకా పోలీసుల మీదనూ సైనిక విభాగాల మీదనూ ఆధారపడుతూ వచ్చారు.

రైతాంగం చేపట్టిన ఇటువంటి నూతన రూపాలలో ప్రజా ఉద్యమాలూ విప్లవ ప్రతిఘటనా పోరాటాలూ పొందిన ప్రాచుర్యం, విశాల ప్రాంతాలకు వ్యాప్తి పాలక వర్గాలనూ పోలీసులనూ ప్రభుత్వ యంత్రాంగాన్ని తీవ్రంగా కుదిపివేసింది. ఒక పక్క, ఈ పోరాటాన్ని బలంతో అణిచివేయడానికి పోలీసు కాంపులు నెలకొల్పారు. చుట్టివేత అణిచివేత క్యాంపెయిన్‌లను నిర్వహించారు. ఒక దాని తరువాత మరో ప్రాంతంలో గ్రామాలలోకి వెళ్లారు. ఇళ్లల్లోకి చొరబడ్డారు. అర్థం పర్థం లేకుండా దూషించారు. వేధించారు. మహిళల పై అత్యాచారం చేసారు. ఆస్తిని నాశనం చేసారు. కోళ్లూ మేకల నుంచీ ఇళ్లల్లో అత్యవసర వస్తువుల వరకూ అన్నింటినీ లూటీ చేసారు. ఆస్తిని స్వాధీనం చేసుకున్నారు. మహిళలనూ పురుషులనూ క్రూరంగా కొట్టారు. పెద్ద ఎత్తున కొట్టడాలూ అరెస్టులూ నిర్వహించారు. పథకం ప్రకారం కుట్రలు పన్నారు. విప్లవ కేడర్‌లను హత్యలు చేసారు. ఇదంతా శాంతి భద్రతలు పరిరక్షించే

పేరు మీద, శాంతిని కాపాడే పేరు మీద చేసారు. మరో పక్క పోరాటాన్ని నాశనం చేయడానికి అనేక రకాల కుట్రలు పన్నారు. భూమి ఇవ్వడం, మెరుగైన చట్టాలు చేయడం, డబ్బులు, ఉద్యోగాలు ఇవ్వడం, పంపులు ప్రారంభించడం, బావులు తవ్వడం, పాఠశాలలు నిర్మించడం వంటి అనేక సంక్షేమ పనులు చేస్తామని ఆశపెట్టి రైతాంగాన్ని పోరాటం నుంచీ దూరం చేయడానికి ప్రయత్నించారు. పాలక వర్గం, వారి చెంచాలూ కులతత్వ, కులపర అసమానతల వంటి మార్గాల ద్వారా సంకుచిత, జాతితత్వ ఒంటెత్తుపోకడనూ రెచ్చగొట్టడానికి ప్రయత్నించారు. జిల్లా తత్వం, రాష్ట్ర తత్వం వంటి వివిధ రకాల ప్రాంతీయ, భౌగోళిక భావజాలాలను ప్రోత్సహించాలని చూసారు. తద్వారా మిలిటెంటు ప్రజానీకం మధ్య విచక్షణ సృష్టించాలనీ అనేక కుటిల పద్ధతులలో పోరాటాన్ని నాశనం చేయాలనీ ప్రయత్నించారు. అంతేకాక, పోలీసు అత్యాచారాలు, వేధింపులూ ఉంటాయని బెదిరించి, మిలిటెంటు, సాధారణ ప్రజల మనో నిబ్బరాన్ని బలహీనపరచాలని చూసారు. శత్రువుకు లొంగిపోవాలని బలవంతం చేసారు. తద్వారా పోరాటాన్ని పాత గాంధేయ సంస్కరణవాద రకపు పద్ధతిలోకి లాగాలని చూసారు. ప్రజలను విప్లవ పంథాకు దూరం చేయాలని ప్రయత్నించారు. పాత శాంతియుత చట్టబద్ధ పోరాటపు ఊబిలో బంధించాలని చూసారు. అయితే ఈ కుటిల పథకాలన్నీ అంతిమంగా విఫలమవుతాయి. ఇప్పుడు కానీ మరెప్పుడన్నా కానీ భారత ప్రజలు ఎత్తి పట్టిన సాయుధ విప్లవ జ్వాలను ఆర్పివేయడం ఎవరి తరమూ కాదు.

మన ప్రజలు ఎక్కువ క్రియాశీలంగా సంఘటితంగా లేకపోవడం మన ప్రధాన బలహీనత. పోరాట ప్రాంతాలు కూడా చాలా చిన్నవి. శత్రువుకు బలంగా సంఘటితం చేసిన పోలీసు, సైనిక విభాగం ఉంది. అసంఘటిత పరిస్థితిలో మనం బలంగా సంఘటితం అయిన పోలీసు, సైనిక విభాగాల మీద పోరాటం చేయలేం. ఆ తరువాత విశాల ప్రాంతాలు లేకుండా శత్రు సాయుధ విభాగాలకు వ్యతిరేకంగా గెరిల్లా యుద్ధం చేయడం సాధ్యం కాదు.

అందుకని మనం సాధ్యమయినంత త్వరగా బలహీనతలను అధిగమించాలి. ప్రచార క్యాంపెయిన్ మరింత సృజనాత్మకంగా మరింత అభివృద్ధి చెంది ఉండాలి. రాజకీయ బోధనా, పోరాట నిబ్బరం, కార్యకలాపాల స్థాయిని అనేక రెట్లు పెంచాలి. గెరిల్లా యుద్ధాన్నీ గెరిల్లా యుద్ధానికి సహాయంగా ప్రజా పోరాటాలనూ విప్లవ ప్రతిఘటనా పోరాటాలనూ నిర్మించడంతో పాటుగా పోరాటం సాధ్యమయినంత విస్తృతంగా కెరటాలుగా వ్యాపించాలి. పోరాటానికి ఉపయోగపడే ప్రజా సంఘాలను నిర్మించాలి. ఎవరినయితే సంఘటితం చేయగలమో వారితో విప్లవ రైతాంగ కమిటీలు ఏర్పరచాలి. విప్లవ రైతాంగ కమిటీలను ఒక క్రమంలో ప్రజా అధికారపు బీజరూపంగా నిర్మించాలి. పార్టీ నిర్మాణం పెంపొందించాలి. ఈ అన్ని సంస్థలనూ క్రమేపీ నిర్మించి అభివృద్ధి చేయాలి. పెరుగుతున్న పోరాట వేగం, సమస్యలు, కార్యకర్తల, సాధారణ ప్రజల మిలిటెంటు ఆలోచనా విధానాల మధ్య సమన్వయం నిలబెట్టుకోవాలి. మన రాజకీయ,

సైనిక పంథాతో సమన్వయంతో మన నిర్మాణపర పంథాను ఆచరించకపోతే అప్పుడు రాజకీయ నిర్మాణ పని తీవ్రంగా దెబ్బ తింటుందన్న విషయం మనం కచ్చితంగా అర్థం చేసుకోవాలి. విప్లవ ప్రచారం, విప్లవ పోరాటం, విప్లవ నిర్మాణం అనే మూడు అంశాల మధ్య పరస్పర సంబంధాన్ని అర్థం చేసుకోకపోతే, ఈ మూడు కర్తవ్యాలనూ కలిపి సృజనాత్మక పద్ధతులలో శక్తివంతంగా నిర్మించలేకపోతే మనం తీవ్రంగా బలహీనపడతాం. ఆత్మరక్షణా, ప్రతిఘటనా రాజకీయాలతో పాటుగా ప్రజలను పూర్తిగా చురుకుగా చొరవతో చైతన్యవంతులను చేయడం, పై మూడు నిర్మాణాలలో సంఘటిత, క్రమశిక్షణా శక్తిగా వారిని సంఘటితం చేయడం, సాయుధ చేయడం మనకు ఉన్న ఒక అతి ముఖ్యమైన కర్తవ్యం.

### కాంక్సా పోరాటంలో మూడు వెల్లువలు

కాంక్సా పోరాట చరిత్ర వరుసగా జరిగిన ఘటనలలో ఒకటి. 1970-71లలో ప్రారంభం అయింది. 1970లో ఇక్కడా అక్కడా కొన్ని రాజకీయ ఆర్థిక పోరాటాలు ప్రారంభం అయాయి. 1971 ఫిబ్రవరి - మార్చి, జూన్ - జూలైల మధ్య కాలంలో కాంక్సా పోలీస్ స్టేషన్ (ఏరియా) కమిటీ నాయకత్వంలో అనేక ఆర్థిక రాజకీయ పోరాటాలు జరిగాయి. ఈ పోరాటాలలో ప్రజల పాత్ర చక్కగా ఉంది. అయితే ఈ దశలో పోరాటాలలో ప్రధాన లోపాలు ఏమిటి.

1. రాజకీయ సమీకరణను మెరుగైన పద్ధతిలో నిర్వహించడంలో లోపాలు 2. నిర్మాణపర సంసిద్ధతలో లోపం, పోరాటాలను కొంత వరకూ స్పాంటేనియస్‌గా చేపట్టడం 3. వివిధ రకాల కార్యక్రమాలలో కొనసాగింపు, సమగ్రతా లోపించడం 4. గెరిల్లా నియమాలు, పద్ధతులూ మొదలయిన వాటిల్లో లోపాలు.

మౌలికంగా 1972 ఫిబ్రవరి నుంచీ పోరాటం ప్రారంభమై ఒక వెల్లువను సృష్టించింది. ఈ పోరాటం ప్రధానంగా కాంక్సా పోలీస్ స్టేషన్ ఏరియాకు పరిమితం అయింది. ఈ ప్రాంతంలో ఈ వెల్లువ 1972 ఫిబ్రవరి నుంచీ 1973 జనవరి మధ్య కాలంలో శిఖర స్థాయిలో ఉంది. 1972-73 నాటి పంటల రక్షణ స్వాధీనం పోరాటం మొట్టమొదట ఆస్‌గ్రాం గ్రామంలో ఒక చిన్న భాగంలో ప్రారంభం అయిందని గుర్తించాలి.

1973లో కాంక్సాలో ఏదో రకమైన పోరాటం జరిగినప్పటికీ పోరాటంలో వెల్లువ మౌలికంగా ఆస్‌గ్రాం-బుడ్‌బుడ్ పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో జరిగింది. ఈ పోరాటం 1973 మార్చి-ఏప్రిల్ మధ్య కాలం నుంచీ అక్టోబరు-నవంబరు మధ్యకాలం వరకూ శిఖర స్థాయిలో ఉంది.

1974 మార్చి నుంచీ 1975 జూన్ మధ్య కాలం వరకూ ఉన్న పోరాట వెల్లువ ఉన్నది. అంటే, ఆ తరువాత భారీ సైనిక చుట్టివేత అణిచివేత ఉన్నది. ఈ కాలంలో కొంత పోరాటం ఉన్నప్పటికీ పోరాట వెల్లువ కేవలం ఆస్‌గ్రాం, బుడ్‌బుడ్‌లలోనే ప్రధానంగా ఉన్నది.

ఇలా ఈ పోరాటంలో వెల్లువకు సంబంధించి మూడు దశలు చూడవచ్చు. వీటిని ఈ పోరాట మూడు వెల్లువలుగా గుర్తించవచ్చు.

**దళ నిర్మాణానికి సంబంధిన అనుభవంలో అనుకూల అంశాలు**

మొదటగా దళ నిర్మాణానికి సంబంధించి ఒక దృష్టి కలిగి ఉండి వాస్తవ అవగాహనను పొందుతున్నాం. క్రమేపీ, మనం సైన్యాన్ని ఎందుకు నిర్మించాలి, ఎవరు ఈ సైన్యం లో ఉండాలి, ఈ సైన్యం ఎందుకు, ఏ క్రమంలో ఏర్పరచవచ్చు, దళాలు ఎందుకు ఏర్పాటు చేయాలి అన్న విషయంలో సరైన అవగాహన పెంపొందింది.

దీని గురించి ప్రజలలోనూ యావత్తు ప్రాంతంలో కార్యకర్తలలోనూ ఒక ఉత్సాహకర వాతావరణం ఏర్పడింది.

దాదాపు ప్రతీ గ్రామం నుంచీ కార్యకర్తలు వచ్చారు. ఇంటిని విడిచిపెట్టి దళంలో చేరడం అన్నది ఒక పండుగగా మారింది. ఇందులో స్పాంటేనిటీ లేదని చెప్పలేం. అయితే ఈ స్పాంటేనిటీ ప్రధాన అంశం కాదు. సాయుధ వ్యవసాయ విప్లవ రాజకీయాల పునాదిగా ఏదన్నా ప్రాంతంలో పని చేస్తున్నప్పుడు, సైన్యం ఏర్పాటుకు పిలుపు ఇస్తే, ఒక బలగాన్ని తప్పకుండా ఏర్పాటు చేయగలమన్న విశ్వాసం పొందడానికి ఆ తరువాత కాలంలో జరిగిన సంఘటనలు దోహదం చేసాయి.

శత్రు భారీ కుట్ర, విప్లవ ప్రతీఘాత దాడి జరుగుతున్నప్పుడు చలన దళాన్ని ఏర్పరచడం చాలా ప్రభావవంతంగా, ఉపయోగకరంగా ఉంటుంది.

సంఘటిత రూపంలో ప్రచార పనిని నిర్వహించడం వీలుగా ఉంటుంది. స్థానిక కార్యకర్తలు దళం రూపంలో గ్రామ గ్రామానికీ వెళుతూ సమావేశాలు నిర్వహించడం క్రమబద్ధ కార్యక్రమంగా ఉంటుంది. ప్రతీ పనిలో దళం, ప్రతీ అంశంలో క్రమశిక్షణ అనే ఉదాహరణ నుంచీ ప్రతీ ఒక్కరూ నేర్చుకుంటారు.

యుద్ధం చేయడంలో కూడా ఈ చలన దళం విశ్వసనీయమైన, శక్తివంతమైన, ముఖ్యమైన పాత్ర నిర్వహిస్తుంది. పోరాటంలో బోల్షివిక్ స్ఫూర్తిని సృష్టిస్తూ, ప్రజలు పోరాటంలో క్రమశిక్షణా పద్ధతిలో ఎలా నిమగ్నులయారు, గ్రామ పునాదిగా ఉన్న మిలీషియా దళాలు ఎలా ధైర్యవంతంగా అనుభవం గడించాలి వంటివన్నీ చలన దళం అద్భుతమైన పాత్రను రుజువు చేసాయి.

మండుతున్న ఎండలో, వానలో చలిలో ప్రతీ రోజూ కఠిన శ్రమతో నడుస్తూ వెళ్లేది. ప్రత్యేక రహస్య మార్గాలు కనిపెట్టేది. ఈ మార్గాలలోనే నడిచేది. మామూలు మార్గాలు వదిలి నూతన మార్గాలు ఉపయోగించేది. అడవులలో కఠిన మార్గాలు ఉపయోగించి దూరాలు నడిచి వెళ్లేది.

రాత్రి పూట లైటు లేకుండా నడిచేది. సభ పూర్తయిన తరువాత అర్ధరాత్రి మరో చోటుకు వెళ్లేది. భారీ వర్షాలలో పోటు మీద ఉన్న నదులు ఈదుతూ దాటేది. శత్రు పోలీసు కాంపులు, చుట్టివేత, భారీ నిఘాల మధ్య పనిని ముందుకు తీసుకువెళ్లేది. ప్రతీ రకమైన పరిస్థితినీ ఎదుర్కొన్నది. ఇటువంటి స్వభావం, అనుభవం పొందడం ఎలా సాధ్యం.

చలన దళాలు ఏర్పడడం ద్వారా మాత్రమే ఈ అనుకూల పరిణామం ఏర్పడింది.

**కాంక్సా పోరాట లోపాలు, పాఠాలు**

**నిర్మాణపర పంథా (పార్టీ, సైన్యం, కమిటీ)కి సంబంధించి 1972 నాటి పోరాటం, నిర్మాణంలో లోపాలు, బలహీనతలు**

1973 ఆగస్టులో జోనల్ కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలలో 1972 పోరాట సమీక్షను అనుసరించి, ఇలా పేర్కొన్నాం - కేవలం పార్టీ ప్రయత్నాలు సరిపోవు. పార్టీ ప్రయత్నాలతో పాటుగా ప్రజలతో సమన్వయం కూడా నెలకొల్పడం అవసరం. విప్లవంలో మూడు ఆయుధాలు - పార్టీ, సైన్యం (రెగులర్ సైన్యం, లోకల్ గెరిల్లా సైన్యం, మిలీషియా), రైతాంగ కమిటీలను ఏర్పరచాలి. గ్రామ గ్రామానా, ప్రాంత ప్రాంతానా రైతాంగ కమిటీలు, మిలీషియా దళాలూ ఏర్పరచి, వాటికి నిర్దిష్ట రూపం ఇవ్వడానికి నిర్ణయించుకున్నాం. ఇలా 1973 సమీక్షలో నిర్మాణపర పంథా గురించి సుదీర్ఘంగా చర్చించి నిర్ణయాలు తీసుకున్నాం.

స్థానిక, లేదా ఏరియా స్థాయిలలో ప్రత్యేక కార్యక్రమాలు తీసుకోకుండా నిర్దిష్ట వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని చేపట్టాలని కూడా నిర్ణయించుకున్నాం. అటువంటి కార్యక్రమం లేకపోవడం వల్ల కూడా ఇలా నిర్ణయించుకున్నాం.

పార్టీ ఒక్కటే ఎజెండా తయారుచేసి ఆమోదించడం కాకుండా గ్రామ స్థాయిలోనో ఏరియా స్థాయిలోనో ఉన్న రైతాంగ కమిటీ తయారు చేస్తుంది (విశాల ప్రజానీకం సహాయంతో వారితో సంప్రతింపుతో). పార్టీ ఈ పనిని కేవలం పై నుంచీ చూస్తుంది. మార్గదర్శకాలు అందిస్తుంది. సహాయం చేస్తుంది. రైతాంగ కమిటీ పార్టీ స్థానంలో పని చేసే నిర్మాణం కాదు. మరో విధంగా పని చేసి ఉంటే, ప్రజల కృషే కాక పోరాట నిర్మాణ అభివృద్ధికి కూడా ఆటంకం ఏర్పడేది. అయితే రైతాంగ కమిటీలో పార్టీ సభ్యులు ఉంటారు. రైతాంగ కమిటీకీ పార్టీకీ మధ్య వీళ్లు నిర్మాణపర వారధిగా ఉంటారు. గ్రామీణ ప్రాంతాలలో రైతాంగ కమిటీ, ఇతర ప్రజా సంఘాలలో చైతన్యవంతులయిన శక్తులకు పార్టీ యూనిట్ సమావేశ కేంద్రంగా ఉంటుంది.

1972లోనే రైతాంగ కమిటీ ఏర్పడడానికీ వాటికి కచ్చితమైన రూపం ఇవ్వడానికీ తగిన కాలం. అయితే ఆ సమయంలో అలా చేయడానికి మార్గాలు ఉన్నప్పటికీ మనం ఏర్పరచడానికి శ్రద్ధ పెట్టలేదు. మనం కేవలం పార్టీ కమిటీల గురించి ఆలోచించాం (1972 నాటి పోరాటానికి కూడా ఇది వర్తిస్తుంది). రైతాంగ కమిటీలు ఏర్పరచాలనీ అయితే ఈ నిర్ణయాన్ని మనం

అమలు చేయలేకపోయామనీ 1972లో సమీక్షలో రాసుకున్నాం (1975 తరువాతనే వీటిని అమలు చేయసాగాం). ఇది రాజకీయ నిర్మాణ పంథాను అర్థం చేసుకోవడంలో మన లోపం. విప్లవంలో మూడు ఆయుధాలైన పార్టీ, సైన్యం, రైతాంగ కమిటీలను మలిచే క్రమాన్ని సరిగా అర్థం చేసుకోకపోవడం. ఈ పోరాటంలో విశాల ప్రజల పాత్ర ఉన్నదన్నది నిజం. అయితే వారి పాత్ర గ్రామ పునాదిగా ఉన్న మిలీషియా రూపంలో లేదు. సంఘటిత యూనిట్‌ల రూపంలో లేదు. గ్రామాల నుంచీ ప్రజలు పెద్ద సంఖ్యలో పోరాటంలోకి వచ్చారు. ఆ తరువాత దళాలు ఏర్పరచవలసింది. ఇది నిర్మాణ పోరాట బలహీనత. ప్రారంభంలో కొంత కాలం పాటు మిలీషియా దళాలను క్రమ, కచ్చిత దళాలుగా నిర్వహించడానికీ వాటికి నిరంతర స్థిర, మరింత క్రమశిక్షణా రూపాన్ని ఇవ్వడానికీ చైతన్యవంతమైన కృషి లేదు. గ్రామ మిలీషియా అసంఘటితంగా బలహీనంగా ఉన్నది. కొన్ని గ్రామాలలో మిలీషియా ఉన్నప్పటికీ వాటికి చైతన్యవంతమైన, స్థిరమైన రాజకీయ నిర్మాణపర రూపం ఇవ్వడానికి కృషి చేయలేదు.

ఆ ప్రాంతాన్ని, ప్రధాన ప్రాంతాన్నీ విస్తరించడానికి రాజకీయ, నిర్మాణపర సన్నాహాలు చేసే కర్తవ్యం పూర్తి కాకపోవడం వల్లనూ లేదా ఈ విషయంలో తీవ్ర లోపాలు ఉండడం వల్లనూ కాంక్సా పోరాటం తాత్కాలికంగా రిట్రీట్ అయింది. ఇది మన చేదు అనుభవం.

**అవిభజిత బీహార్‌లో గయ-హజారీబాగ్ పోరాట పాఠాలు**

కాంక్సా పోరాటంలో పోరాట ప్రాంతాన్ని విస్తరించడంలో ఆ ప్రాంతంలో రాజకీయ నిర్మాణ సన్నాహాలు చేయడంలో, అంటే పార్టీ, సైన్యం, ఐక్య సంఘటనకు సంబంధించిన సన్నాహాలు చేయడంలో సకాలంలో కర్తవ్యం చేపట్టని అనుభవాన్ని దృష్టిలో ఉంచుకుని ఇప్పుడు గత బీహార్‌లో గయ-హజారీబాగ్‌లలో విప్లవ పోరాటాన్ని మరింత పద్ధతి ప్రకారం, పథకం ప్రకారం ముందుకు తీసుకువెళ్లడానికి ఒక ప్రయత్నం జరిగింది.

అప్పటికి సైనిక వ్యవహారాలకు సంబంధించి, ఒక అవగాహన పెంపొందింది. సైనిక కార్యకలాపాలను సరైన పద్ధతిలో నిర్వహించడం కోసం, అడ్వాన్స్ కావడానికీ రిట్రీట్ కావడానికి విశాల ప్రాంతం అవసరం. లేదా ఎప్పటికప్పుడు ఒక పక్కకూ మరో పక్కకూ కదలాలి. బీహార్-బెంగాల్ స్పెషల్ ఏరియా కమిటీ ఏర్పాటుతో ఈ ఆలోచన ఆ తరువాత ఆచరణలోకి వచ్చింది.

అయితే ఆనాటి ధన్‌బాద్ హజారీబాగ్ ప్రాంతం (అప్పట్లో హజారీబాగ్ జిల్లాలో ప్రస్తుత ఛాత్రా, గిరిడి, కొడర్మా జిల్లాలు ఉన్నాయి)లోనూ గయ ప్రాంతం (అప్పట్లో గయలో ఔరంగాబాద్, జహానాబాద్, నవాడా మొదలయిన జిల్లాలు ఉన్నాయి) లోనూ సైన్యం, బేస్ ఏరియాల నిర్మాణం అన్న నిర్దిష్ట దృష్టితో 1969 మధ్య కాలం, 1968లో రెండో సగం కాలంలో పని ప్రారంభమయింది.

హజారీబాగ్‌లో అనేక పర్వతాలూ అడవులూ ఉన్నాయి. ఆదివాసీ జనాభా ఉన్నారు. జాతి ఉద్యమం, అంటే ప్రత్యేక జార్ఖండ్ ఉద్యమ ప్రభావం ఉంది. గయ విశాల మైదాన ప్రాంతం (కొద్ది పాటి అడవులూ పర్వతాలూ కూడా ఉన్నాయి). క్రూరమైన భూస్వామ్య వ్యవస్థ ప్రభావం ఉంది.

సాయుధ వ్యవసాయ విప్లవ గెరిల్లా పోరాట శంఖారావం ధన్‌బాద్, హజారీబాగ్‌లలో పరస్‌నాథ్, జిల్లా పర్వతాలలోనూ బర్కాగావ్‌లో నేరీ మెహుడియా పర్వతాలలోనూ ఆ పరిసర ప్రాంతాలలోనూ 1971 నాటికే ప్రతిధ్వనించింది. అలాగే 1972 రెండో సగంలో జ్వలిస్తున్న వ్యవసాయ విప్లవ పోరాట ఎర్ర కాగడా చల్హో పర్వతాలలోనూ గయ ప్రాంతంలో పరిసర ప్రాంతాలలోనూ ప్రజ్వలింప చేసాం.

హజారీబాగ్ ప్రాంత పోరాటంలో ఆదివాసీ ప్రజలూ ఆదివాసీయేతర ప్రజల విశాల పాత్ర వల్ల ఒక విప్లవ వెల్లువ వంటి పరిస్థితి ఏర్పాటయింది. ఈ వెనుకబడిన, ఆదివాసీ జనాభా ఉన్న ప్రాంతంలో విప్లవ పోరాటం చూసి శత్రువు భీతావహమయాడు. ఇలా క్రూరమైన చుట్టివేత అణిచివేత క్యాంపెయిన్ ప్రారంభం అయింది. ఈ చుట్టివేత అణిచివేత క్యాంపెయిన్‌ను ఓడించడానికి మన వైపు నుంచీ మరింతగా పురోగమించే క్రమం కూడా ప్రారంభమయింది. 1974 నాటి చుట్టివేత అణిచివేత క్యాంపెయిన్ తీవ్రంగా ఉంది. కొందరు కామ్రేడ్‌లు అమరులు కాగా కొందరు నాయకత్వ కామ్రేడ్‌లు అరెస్టయారు. అందుకని ఈ పోరాటం కొంత కాలం వరకూ రిట్రీట్ చేయవలసి వచ్చింది.

అయితే మరో ఒకటి రెండు సంవత్సరాలలో హజారీబాగ్ (హజారీబాగ్, గిరిడి, కొడర్మా, చాత్రా జిల్లాలు కలిపి), ధన్‌బాద్ (ప్రస్తుత బొకారో జిల్లా)లలో నూతన పథకంలో విశాల ప్రాంతంలో సరికొత్తగా పని ప్రారంభం అయింది. ముఖ్యంగా శత్రువు చుట్టివేత అణిచివేత క్యాంపెయిన్ నిర్వహించాడు. దాన్ని ఓడించి, క్రమేపీ పోరాటాన్ని విస్తరించి, ఉన్నత స్థాయికి తీసుకువెళ్లడానికి మనం కృషి చేసాం. రాజకీయ సైనిక అంశాలలోనూ నిర్మాణ అంశాలలోనూ నూతన అనుభవం పొందడానికి ఈ క్రమం మనకు తోడ్పడింది.

ఇదిలా ఉండగా గయ ప్రాంతంలో పోరాటం కూడా చల్హో ప్రాంతం నుంచీ అనేక నూతన ప్రాంతాలకు వ్యాపించింది. భూస్వామ్య భూ యజమానులు, వారి గూండాలు, ప్రైవేటు సైన్యాలకు వ్యతిరేకంగా కుదిపివేసే పోరాటంతో అది శక్తివంతమైన వెల్లువగా మారింది. రైతాంగ ప్రజలూ శ్రామిక ప్రజలూ ఈ విప్లవ పోరాటంలో వేలాదిగా పాలు పంచుకున్నారు. పాత, కుళ్లిన వ్యవస్థను నాశనం చేసి నూతన వ్యవస్థను, అంటే జనతా ప్రజాస్వామిక వ్యవస్థను నిర్మించడానికి స్థిరమైన చర్యలు తీసుకున్నారు.

సైన్యం, బేస్ ఏరియా నిర్మించే కర్తవ్యానికి ఆచరణాత్మక రూపం ఇవ్వడానికి స్పెషల్

ఏరియా ఏర్పరచాలన్న ఆలోచన ముందుకు వచ్చింది.

సైన్యం, బేస్ ఏరియా నిర్మాణం మన ప్రాథమిక, ప్రదాన, కేంద్ర కర్తవ్యం అని చాలా ముందుగానే నిర్ణయించుకున్నప్పటికీ దాన్ని ఆచరణలోకి ఎలా తీసుకువస్తామన్నది మనకు ఎప్పుడూ పెద్ద ప్రశ్నగానే ఉండింది. అలాగే ఒక నిర్దిష్ట పరిస్థితిలో, భారతదేశ నిర్దిష్టతలో మార్క్సిజం లెనినిజం మావోయిజం (అప్పుడు మావో సే టుంగ్ ఆలోచన)ను ఏ ఆచరణాత్మక రూపంలో అమలు చేస్తామన్నది కూడా మనకు పెద్ద ప్రశ్నగా ఉండేది.

ఈ తీవ్రమైన సమస్యకు సరైన జవాబు పొందాలంటే, సైన్యం, బేస్ ఏరియాలకు సంబంధించి సాధారణ పిలుపు ఇస్తే సరిపోదనీ అందుకు నిర్దిష్ట కర్తవ్యాన్ని వాస్తవంగా నిర్ణయించుకోవడం అవసరమనీ గుర్తించాం. ఈ కర్తవ్యాన్ని అమలు చేయడం కోసం ఆర్థికంగా, రాజకీయంగా, సైనిక అంశాలలో స్వయం సమృద్ధంగా ఉన్న బేస్ ఏరియా నిర్మించడానికి వీలైన వ్యూహాత్మక ప్రాంతాన్ని ఎంపిక చేసుకోవడం అవసరం.

అందుకని మన దేశ గడ్డ మీద సైన్యాన్నీ బేస్ ఏరియానీ నిర్మించడానికి బీహార్ (ఇప్పటి బీహార్-జార్ఖండ్)నూ బెంగాల్‌లో కొన్ని ప్రాంతాలు (పశ్చిమ మిడ్నాపూర్-బంకూరా-పురూలియా)నూ స్పెషల్ ఏరియాగా పరిగణించాలన్న ఆలోచన ఆవిర్భవించింది.

ఈ స్పెషల్ ఏరియా ఏర్పాటు చేయడానికి 1975లో కృషి ప్రారంభమయింది. 1976 మధ్యకాలానికి కామ్రేడ్ కనయ్ ఛటర్జీ ప్రత్యక్ష మార్గదర్శకత్వంలో నేతృత్వంలో బీహార్-బెంగాల్ స్పెషల్ ఏరియా కమిటీ ఏర్పడింది. ఈ కమిటీలో బెంగాల్, ధన్‌బాద్, గిరిడి, హజారీబాగ్, గయ, ఔరంగాబాద్, నవడా ఇతర జిల్లాలలో పని చేస్తున్న కొందరు నాయకత్వ కామ్రేడ్‌లు ఉన్నారు.

స్పెషల్ ఏరియా పేరుతో ఒక కమిటీని ఏర్పాటు చేయడం మన మీద చాలా అనుకూల ప్రభావం వేసింది. స్పెషల్ ఏరియా ఎందుకు ఏర్పరిచాం, దాని కర్తవ్యాలు ఎలా ఉంటాయన్న దాని గురించి ఈ పేరు ఎంతో ఆసక్తిని కలిగించింది. ఈ రకంగా సైన్యం, బేస్ ఏరియా ఏర్పాటు చేయడానికీ ఇందుకోసం స్పెషల్ ఏరియా ఏర్పాటు చేయడానికి ఒక స్పష్టమైన అవగాహన ఏర్పడింది. స్పాంటేనియస్ పద్ధతిలో పథకం లేకుండా, వ్యూహాత్మక ప్రాంతం అవగాహన లేకుండా పని చేస్తే సైన్యం, బేస్ ఏరియా ఏర్పాటులో ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేమని మనకు అర్థమయింది.

నిజానికి మనం కామ్రేడ్ కేసీ చౌరవ, సమర్థవంతమైన నాయకత్వాల కింద మొట్టమొదట అస్సాం, అస్సాం త్రిపుర సరిహద్దు ప్రాంతాలను వ్యూహాత్మక ప్రాంతంగా ఎన్నుకుని పని ప్రారంభించాం. రెండో వ్యూహాత్మక ప్రాంతంలో బీహార్ (ఇప్పటి బీహార్ -జార్ఖండ్), బెంగాల్‌లో

కొన్ని ప్రాంతాలను ఎన్నుకుని పని ప్రారంభించాం.

అయితే అస్సాంలో యావత్తు ఎంఎల్ ఉద్యమం భారీగా దెబ్బ తినడంతో అది మొదటి వ్యూహాత్మక ప్రాంతంగా పురోగమించడం సాధ్యం కాదని నిర్ధారించుకున్నాం. అందుకని కామ్రేడ్ కేసీ సలహా ప్రకారం రెండో గెరిల్లా ప్రాంతంగా బీహార్-బెంగాల్ ప్రాంతాన్ని మొదటి దానిగా తీసుకుని అక్కడ అత్యంత కృషి చేయాలనీ మన శక్తి సామర్థ్యాల కొద్దీ సైన్యాన్నీ బేస్ ఏరియానూ ఏర్పరచాలనీ నిర్ణయించుకున్నాం.

**కామ్రేడ్ కేసీ అస్తమయం తరువాత దేశీయ, అంతర్జాతీయ పరిస్థితిలో మార్పుల గురించి ఎంసీసీఐ సీసీ వైఖరి**

1982 జులై 18వ తేదీన మన నాయకుడు, ఉపాధ్యాయుడూ కామ్రేడ్ కేసీ అస్తమించారు. కామ్రేడ్ అస్తమయం మనకూ భారత విప్లవానికి పెద్ద నష్టం. అంతవరకూ కామ్రేడ్ కేసీ మౌలిక రాజకీయ పంథా, నిర్దిష్ట పంథా, ఎత్తుగడల పంథా అంతా సమర్పించారు. పని పద్ధతీ పని శైలులను కూడా రూపొందించారు. ఇప్పుడు కామ్రేడ్ కేసీ అస్తమయం తరువాత ఈ బాధ్యత సీసీలో మిగిలిన వారి మీద పడింది.

ఈ సీసీ ఈ కింది అంశాల గురించి తన వైఖరిని పునరుద్ఘాటించింది -

1. మహా మావో అస్తమయం తరువాత గాంగ్ ఆఫ్ ఫోర్‌గా అరెస్టయిన వాళ్లు వాస్తవానికి నిజమైన కామ్రేడ్స్. ఈ నలుగురు కామ్రేడ్స్‌ను అరెస్టు చేయడం అంటే విప్లవ ప్రతీఘాతుక పద్ధతిలో ప్రభుత్వాన్ని కూల్చడం. మహా మావో అస్తమించిన వెంటనే హువా కువో ఫెంగ్, డెంగ్ గ్జియావో పింగ్ ముఠా ఈ నలుగురు కామ్రేడ్‌లనూ కుట్రతో అరెస్టు చేసారు. సోషలిస్టు చైనా రంగు మార్చి బూర్జువా నియంతృత్వాన్ని నెలకొల్పారు.

2. సూత్రాల విషయంలో రాజీగానూ  వర్గ పోరాటాన్ని విడిచిపెట్టడంగానూ హువోకువో ఫెంగ్ మూడో ప్రపంచ సిద్ధాంతాన్ని ప్రకటించాడు. (ఆ తరువాత కొన్ని విప్లవ గ్రూపులతో చర్చలు జరిగినప్పుడు ఎంసీసీ మూడో ప్రపంచ సిద్ధాంతం గురించి తన అభిప్రాయాలను రాతపూర్వకంగా సమర్పించింది. మూడో ప్రపంచ సిద్ధాంతం, ఒక విప్లవ ప్రతీఘాతుక సిద్ధాంతం అన్న శీర్షికతో ఒక డాక్యుమెంటును ప్రచురించాం. ఇందులో మూడో ప్రపంచ సిద్ధాంతాన్ని నిరాకరించాం).

3. అంతర్జాతీయ స్థాయిలో సామ్రాజ్యవాదానికీ పీడిత జాతులూ ప్రజలకూ మధ్య వైరుధ్యం నిర్ణయాత్మక, ప్రధాన వైరుధ్యంగా ప్రకటించాం.

4. చైనా కమ్యూనిస్టు పార్టీ 9వ, 10వ కాంగ్రెస్ నివేదికలకు సంబంధించి కామ్రేడ్ కేసీ బతికి ఉన్న కాలం నుంచీ మనకు ఉన్న వైఖరిని పునరుద్ఘాటించడం అవసరంగా భావించాం.

కార్మికవర్గ నియంతృత్వం కింద వర్గ పోరాటాన్ని కొనసాగించడం, సోషలిస్టు నిర్మాణాన్ని ముందుకు తీసుకువెళ్లడం విషయంలో 9వ కాంగ్రెస్ నివేదిక మౌలిక నివేదిక అన్నాం. అలాగే 9వ, 10వ కాంగ్రెస్‌ల నివేదికలు పరస్పర విరుద్ధంగా లేవన్నాం.

5. 9వ కాంగ్రెస్‌లో ఒక వ్యూహాత్మక అవగాహనగా ప్రస్తుత యుగం గురించి సమర్పించిన అన్వయం సరైనదిగా తప్పక పరిగణించాలన్నాం. అలాగే 9వ కాంగ్రెస్‌లో మావో ఆలోచనా విధానం (ఇప్పుడు మావోయిజం) చారిత్రాత్మక ప్రాముఖ్యత గురించిన అన్వయాన్ని ఎత్తిపట్టాం.

6. తొంభయ్యవ దశకంలో సోవియట్ రష్యా దిగజారిన తరువాత రష్యా అగ్రశక్తిని బలహీన అగ్రశక్తిగా చిత్రీకరించాం. అయితే బలహీన అంటే ఏంటన్నది సరిగా విశ్లేషించలేదు. ఆ తరువాత 2002 నవంబరు సీసీ సమావేశంలో రష్యాను బలహీన అగ్రశక్తిగా చిత్రీకరించడం సరైనది కాదని అర్థం చేసుకున్నాం. అపారమైన అణ్వాయుధాలు కలిగిన శక్తివంతమైన సామ్రాజ్యవాద దేశంగా భావించాలని నిర్ణయించాం.

**దేశీయ పరిస్థితి రాజకీయ విశ్లేషణా, రాజకీయ పంథాలకు సంబంధించి ఇదీ అవగాహన**

1. రాజ్యం స్వభావానికి సంబంధించిన అంచనా అదే విధంగా ఉంది. అంటే, భారతదేశం నయా వలస రకపు అర్ధవలస అర్ధ భూస్వామ్య దేశం. 2. భారతదేశంలో దళారీ నిరంకుశ బడా బూర్జువా వర్గానికి సాపేక్షికంగా కానీ పాక్షికంగా కానీ స్వాతంత్రం లేదు. అయితే వాళ్లు సామ్రాజ్యవాదానికి దళారులు, విధేయ సేవకులు. బేరసారాలాడడానికి వారి సామర్థ్యం వారి స్వభావంలో మౌలిక మార్పుకు సూచిక కాదు. ఏజెంటులుగా సేవ చేసినందుకు మరి కొంత సంపదను పోగు చేసుకునేందుకు సూచిక. 3. ఎన్నికలలో పాల్గొనడానికి సంబంధించిన అవగాహన కేవలం ఎత్తుగడలకు సంబంధించినది కాదు. కృశ్చేవ్ రివిజనిజం ఆవిర్భావం, ఎన్నికల ద్వారా కానీ శాంతియుత మార్గాల ద్వారా కానీ సోషలిజానికి పరిణామం గురించిన చర్చల వల్ల అది వ్యూహంగా ప్రాముఖ్యత సంతరించుకుంటుంది. 4. రష్యా ఆధిపత్యంలో ఉన్న ఇందిరా పాలన రెండో సగంలోనే, అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచీ పెద్ద ఎత్తున రుణం తీసుకోవడంతో అమెరికా ఆధిపత్యం పెరగసాగింది. రాజీవ్ కాలంలో ఇది మరింతగా పెరిగి ఎన్‌డీఏ పాలనా కాలంలో ప్రధాన రూపం అయింది. 5. సీపీఐ(ఎంఎల్)లిబరేషన్‌ను విప్లవ వర్గ పోరాటంలో ఆధునిక రివిజనిస్టుగా వ్యతిరేకించే శక్తని బహిరంగంగా ప్రకటించాం. 6. సైన్యం, బేస్ ఏరియాల నిర్మాణం పనిలో పాత మార్గాన్నే మళ్లీ మళ్లీ అవలంబించే స్వభావానికీ యాంత్రిక వైఖరికీ ఆలస్యం లేకుండా స్వస్తి చెప్పాలి, సైనిక పంథా మరింత పురోగమనం, వృద్ధీ చేయాలి, సైనిక నిర్మాణం సైనిక యుద్ధం స్థిరంగా సృజనాత్మకంగా చేపట్టాలి.

**రెండు పంథాల మధ్య పోరాటం పార్టీ అభివృద్ధికి మౌలిక అంశం**

సోవియట్ పార్టీ చరిత్ర అంతర్గత పోరాట చరిత్ర అని సీపీఎస్‌యూ చరిత్ర రాసేప్పుడు

కామ్రేడ్ స్టాలిన్ అన్నాడు. పార్టీ విరుద్ధాంశాల ఐక్యత అని మావో అన్నాడు.

మన చరిత్రను చూస్తే కూడా ఈ వాస్తవాలు సరైనవేననిపిస్తాయి. ఉదాహరణకు - 1. సీపీఎంతో సంబంధాలు తెంచుకునే ముందు సీపీఎం రివిజనిజానికి వ్యతిరేకంగా రెండు పంథాల మధ్య తీవ్ర పోరాటం 2. సీపీఎంతో సంబంధాలు తెంచుకున్న తరువాత కమ్యూనిస్టు విప్లవకారుల మధ్య ఏది సరైనదీ ఏది కాదు అన్న చర్చ. 3. పార్టీ నిర్మాణ క్రమానికీ పద్ధతికీ సంబంధించిన చర్చ, వాదం. 4. ఇప్పుడు నగరంలోనూ పరిసర గ్రామీణ ప్రాంతంలోనూ, నిజానికి మారుమూల గ్రామీణ ప్రాంతంలో కూడా సాయుధ పోరాటం చేయడం కచ్చితంగా సరైనది కాదు అంటూ 1970-71 మధ్య తెల్ల భీభత్సాన్ని ఎదుర్కొనే క్రమంలో ఎంసీసీలో ముందుకు వచ్చిన తప్పుడు పంథాకు వ్యతిరేకంగా తీవ్రమైన రెండు పంథాల మధ్య పోరాటం, ఎంసీసీ అతివాద పంథాను అవలంబిస్తున్నది అంటూ 24 పరగణాలు, కాంక్సా, హుగ్లీలలో పోరాట రంగాన్ని విడిచిపెట్టి వెళ్లిపోయిన కొద్ది మంది నాయకత్వ కామ్రేడ్‌లకు వ్యతిరేకంగా రెండు పంథాల మధ్య పోరాటం. 5. 1971-72లలో అస్సాం-త్రిపురలో నాయకత్వ కామ్రేడ్ లేవనెత్తిన ప్రస్తుత పరిస్థితిలో వర్గ శత్రువు మీదనూ రాజ్య అధికారం మీదనూ మనం నిరంతరం దళ దాడులు చేయడం ద్వారా మాత్రమే పురోగమించగలం అన్న విషయం మీద రెండు పంథాల మధ్య చర్చ, దక్షిణ్‌దేశ్ (లేదా లాల్ పతాక) ప్రత్యేక సంచిక నెం.1లో రాసినది అతివాద పంథా మొదలయిన అంశాలతో 1977-78 కాలంలో బాదల్ లేవనెత్తిన విషయంలో వివిధ రూపాలలో జరిగిన రెండు పంథాల మధ్య పోరాటం. ఈ రెండు పంథాల మధ్య పోరాటం 1982లో కామ్రేడ్ కేసీ అస్తమయం నాటి నుంచీ 1994-95 మధ్య కాలం వరకూ కొనసాగింది. ఆ తరువాత 1999-2001 మధ్య కాలంలో రెండు పంథాల మధ్య తీవ్ర పోరాటం జరిగింది (దీని గురించి క్లుప్తంగా చర్చిస్తాం). ఇలా ప్రతీ చర్చా రెండు పంథాల మధ్య పోరాటంతో మన పంథా, ఆచరణా మరింత పటిష్టమయాయి.

**1999-2001మధ్య రెండు పంథాల మధ్య పోరాటం ఎంసీసీఐని కుదిపివేసి గుణాత్మక గెంతు తీసుకోవడంలో ప్రతీ అంశంలోనూ తోడ్పడింది.**

ప్రారంభం నుంచీ మన నిర్మాణంలో మావో సే టుంగ్ ఆలోచనా విధానం, మావోయిజం ఒకటిగానే ఉన్నాయి. ఇది ఒక సాధారణ అవగాహనగా ఉన్నది. మావోయిజం అన్న పదం వాడడానికి చాలా సార్లు బలంగా మాట్లాడారు. 1986-87లలో ఈ విషయంలో కోల్‌కత్తా నగర కమిటీలో కొన్ని వాదనలు ముందుకు వచ్చాయి. అయితే ఈ చర్చ అప్పుడు ముగియలేదు. ఈ సమస్య మీద రెండు పంథాల మధ్య పోరాటం నిర్వహించడానికి పరిస్థితి పరిపక్వం కాకపోవడమే ఇందుకు కారణం.

అయితే, మావో ఆలోచనా విధానాన్నీ మావోయిజాన్నీ ఒకటిగా పరిగణించాలనీ మావోయిజం

అన్న పదం వాడడం మరింత సరైనదన్న ఆలోచన రాజకీయంగా తప్పు అని మన నిర్మాణంలో సీసీలో అప్పటి సీసీఎం బాదల్ గట్టిగా అభిప్రాయపడుతున్నాడన్నది స్పష్టమే. ఈ వాదన ముందుకు వెళ్లడానికి మరి కొన్ని సంవత్సరాలు పట్టింది. అంతిమంగా 1996-97లలో ఇది ఆ రకంగా వ్యక్తం అయింది. 1996లో మన రెండో కేంద్ర మహాసభ తరువాత ఒక్కరు మినహా అందరూ మావో ఆలోచనా విధానం బదులుగా మావోయిజం అన్న పదం వాడడం సరైనదీ, శాస్త్రీయమైనదీ తగినదీ అన్న గట్టి అభిప్రాయంతో ఉన్నారు.

ఆ తరువాత 1999లో సీసీలో ఎంసీసీ వ్యవస్థాపకుల చిత్రపటాలు ఏ వరుసలో పెట్టాలన్న దాని మీద సీసీలో తీవ్ర చర్చ ప్రారంభమయింది - కామ్రేడ్ కేసీ, కామ్రేడ్ అమూల్యా సేన్, కామ్రేడ్ చంద్రశేఖర్ దాస్ వరుసలో పెట్టాలా లేక, కామ్రేడ్ అమూల్యా సేన్, కామ్రేడ్ కేసీ, కామ్రేడ్ చంద్రశేఖర్ దాస్ వరుసలో పెట్టాలా అన్నది చర్చ. 1999 ఆగస్టులో జరగవలసి ఉన్న సీసీ సమావేశంలో చిత్రపటాల ఏర్పాటు గురించి తీర్మానించుకుందామని సీసీ నిర్ణయించింది. 2000 జనవరిలో జరగనున్న సీసీ సమావేశంలో మావోయిజం అన్న పదం వాడడం గురించి తీర్మానించుకుందామనుకున్నాం.

1999 ఆగస్టు సమావేశంలో సుదీర్ఘ చర్చ, వాదనల క్రమంలో ఒక నిర్ణయానికి వచ్చాం. దాని మీద సీసీఎంలందరూ సంతకం చేసారు. దాని ప్రకారంగా కామ్రేడ్ కేసీ, కామ్రేడ్ అమూల్యా సేన్, కామ్రేడ్ చంద్రశేఖర్ దాస్‌ల చిత్రపటాలు ఏర్పాటు చేయాలని అనుకున్నాం.

కానీ సీసీ సమావేశం నుంచీ తిరిగి వెళ్లిన తరువాత బాదల్, భరత్‌లు కుట్రపూరిత పద్ధతిలో ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా పార్టీలో ముఠా ఏర్పాటు చేసేందుకు పాల్పడ్డారు. దీంతో పార్టీ సభ్యులలో కేడర్‌లలో గందరగోళం ప్రారంభమయింది.

ఆ తరువాత 2000 జనవరిలో జరిగిన సీసీ సమావేశంలో ఏడు రోజుల పాటు చర్చ, వాదనలూ జరిగిన తరువాత మావో ఆలోచనా విధానం కాక మావోయిజం అన్న పదం వాడడం తగినదిగా సరైనదిగా ఉంటుందన్న ఏకీభావం ఏర్పడింది.

అయితే ఈ సమావేశం నుంచీ తిరిగి వెళ్లిన తరువాత బాదల్, భరత్‌లు నిర్మాణేతర విధానాలు, కుట్రపూరిత పద్ధతుల ద్వారా దుష్ప్రచారానికీ ముఠాతత్వానికీ పాల్పడ్డారు. ఇప్పుడు మావోయిజం పదం మీద విషయం వాదనలకు కేంద్రం అయింది. దీంతో పాటుగా వాళ్లు మరి కొన్ని అంశాలు కూడా చేర్చారు - 1. కామ్రేడ్ స్టాలిన్‌ను బృహత్తర వాదోపవాదాల ప్రకారం అంచనా వేయకూడదు. సరికొత్తగా అంచనా వేయాలి. 2. రిమ్‌తో ఎటువంటి సంబంధం ఉండరాదు. 3. పీడబ్ల్యూతో ఏకపక్ష కాల్పుల విరమణ తప్పు మొదలయిన అంశాలు.

ఈ అంశాలన్నింటి మీదనూ పార్టీలో రెండు పంథాల మధ్య పోరాటం నిర్వహించి, ప్లీనంలోనో

మహాసభలోనో నిర్ణయంతో ముగించడం అవసరం అయింది. కానీ బాదల్, భరత్‌లు అవలంబించిన తప్పుడు వైఖరి వల్ల ఇది సాధ్యం కాలేదు. అలాగే ఈ అంశాల మీద యావత్తు నిర్మాణమంతటిలోనూ తీవ్ర చర్చ జరిగింది. అంతిమంగా బాదల్, భరత్, పశ్చిమ బెంగాల్ నుంచీ కొద్ది మంది కామ్రేడ్‌లూ తప్ప 98 శాతం సభ్యత్వం సీసీ పంథాకు హృదయపూర్వకంగా మద్దతును అందించాయి. మావోయిజం అన్న పదం వాడాలన్న నిర్ణయానికి ఆర్ధ్రమైన మద్దతు అందింది.

ఇంతకు ముందే చెప్పినట్టుగా ఈ రెండు పంథాల మధ్య పోరాట క్రమంలో మనం ప్రతీ అంశంలోనూ గుణాత్మక మార్పుకు గురయాం. ఈ రెండు పంథాల మధ్య పోరాటం మనలను తీవ్రంగా కుదిపివేసింది. ఎంతగా అంటే మనం మన బలహీనతలనూ చెడునూ విడిచిపెట్టడానికి దారి తీసింది. ఎంసీసీ, పీడబ్ల్యూల మధ్య పరస్పర ఘర్షణల చీకటి అధ్యాయానికి సంబంధించి మన తీవ్ర లోపాలను అర్ధం చేసుకోవడానికీ ఆత్మ విమర్శ చేసుకోవడానికీ ప్రేరేపితులు చేసింది. మనలో పిడివాద, ఒంటెత్తుపోకడ ధోరణులను విడనాడడానికి సహాయం చేసింది. కేంద్ర స్థాయి నుంచీ దాని కింద ఉన్న స్పెషల్ ఏరియాలూ రెండు రీజినల్ స్థాయిల వరకూ, రాష్ట్ర స్థాయిలోనూ మిలిటరీ కమిషన్‌లనూ, ప్రస్తుత పరిస్థితిలో ప్రజా సైన్యం రూపంగా ప్రజల సాయుధ సైనిక బలగాల నుంచీ ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం (పీఎల్‌జీఏ)ను ఏర్పాటు చేయవలసిన అవసరం గురించి అర్ధం చేసుకోవడానికి దోహదం చేసింది. సైన్యం, బేస్ ఏరియాల నిర్మాణ కర్తవ్యాన్ని వేగవంతం చేసింది. అంతిమంగా ఆర్‌సీసీఐ(ఎం), ఆర్‌సీసీ(ఎం), సీపీఐ(ఎంఎల్) సెకండ్ సీసీతో, ఆర్‌సీసీఐ(ఎంఎల్ఎం) మొదలయినటువంటి నిజమైన మావోయిస్టు విప్లవకారులతోనూ ముఖ్యంగా భాకపా(మాలె)(పీపుల్స్‌వార్) తోనూ ఐక్యం కావడానికీ పురోగమించడానికి, అఖిల భారత పార్టీ నిర్మించడానికీ తోడ్పడింది.

**అనేక ఇతర ప్రాంతాలలో పోరాటాన్ని విస్తరించడం, బేస్ ఏరియాల నిర్మాణ పనిని వేగవంతం చేయడం**

కాంక్సా హజారీబాగ్ పోరాటాల నుంచీ పాఠాలు తీసుకుని, అప్పటి హజారీబాగ్-ధన్‌బాద్ జిల్లాలూ గయం-ఔరంగాబాద్ జిల్లాలలో పోరాటం పెంపొందినప్పుడు అది రాంచీ-సింగ్‌భూంలలోనూ ఆనాడు జార్ఖండ్ రీజియన్‌లో ఉన్న కొన్ని ఒరిస్సా జిల్లాలలోనూ బీహార్‌లో దియోఘర్, డుమ్కా, జముయీ ముంగేర్, బంకా, భగల్‌పూర్‌లలోనూ వేగంగా, గెరిల్లా జోన్ స్థాయికి చేరుకునేవరకూ అభివృద్ధి చెందింది. ఈలోగా మునుపటి బీహార్ ప్రాంతంలో గయ-ఔరంగాబాద్‌లలో పోరాటం కూడా అభివృద్ధి చెంది చాలా వేగంగా విస్తరించింది. ప్రస్తుత జార్ఖండ్‌లో ఛాత్రా, పలామూ, లాతేహార్, గుమ్లా, లోహర్‌దాగా, గర్వా జిల్లాలలో, చత్తీస్‌గఢ్‌లో సర్గూజా, జస్పూర్, కొరియా, కోర్బా జిల్లాలో దక్షిణ బీహార్‌లో రోహతాస్, భోజ్‌పూర్, భుభువా జిల్లాలలోనూ ఇంకా ముందుకు ఉత్తర ప్రదేశ్‌లో సోన్‌భద్ర, చందౌలీ, మిర్జాపూర్ జిల్లాలలోనూ ఉత్తర బీహార్‌లో దర్భంగా, ముజాఫర్‌పూర్, వైశాలీ, మధుబని, కగరియా, సీతామర్హి, షియోహర్,

పశ్చిమ చంపారన్, తూర్పు చంపారన్, కాతిహార్, పుర్నియా మొదలయిన జిల్లాలలోనూ నిర్మాణాన్ని వేగంగా విస్తరించడానికి సహాయం చేసింది. తద్వారా అక్కడ పోరాటాలను అభివృద్ధి చేసి, ఈ ప్రాంతంలో పోరాటాన్ని కూడా గెరిల్లా జోన్ స్థాయికి పెంపొందించడానికి దోహదం చేసింది. ఉత్తర బీహార్‌లో పోరాటం త్వరలోనే ఉత్తర ప్రదేశ్‌లో ఉత్తర భాగం మీద ప్రభావం వేసింది. ఆ తరువాత ఉత్తరాంచల్‌లో ఉత్తరాఖండ్ ప్రాంతానికి విస్తరించింది. తద్వారా పోరాటాన్ని నిర్మించి వేగవంతం చేసింది.

ఇలా బీహార్-జార్ఖండ్-బెంగాల్ స్పెషల్ ఏరియా కింద పోరాట వృద్ధీ, విస్తరణలతో చాలా తక్కువ సమయంలో సైన్యాన్ని నిర్మించే పని సహజంగానే వేగం అందుకుంది. గెరిల్లా జోన్‌లో పోరాటం అభివృద్ధి చెందుతున్నప్పుడు సైనిక నిర్మాణాల వృద్ధీ విస్తరణా కూడా వేగం అందుకున్నాయి. ఆత్మ రక్షా దళాలతోనూ ప్రజా మిలీషియా దళాలతోనూ ప్రారంభించి లోకల్ రెగులర్ గెరిల్లా దళాలు ఏర్పాటు చేయడం వరకూ సాగాం. వారికి రాజకీయ సైనిక వ్యవహారాలలో బోధనా శిక్షణా అందించాం. ఆ తరువాత పోరాటాలలో రాటు దేలిన దళ సభ్యులతో ప్లాటూన్‌లూ కంపెనీలూ కూడా ఏర్పాటు చేసాం. ఈ అన్ని సైనిక బలగాలనూ చక్కగా క్రమబద్ధం చేస్తూ 2003 ఏప్రిల్ 22వ తేదీన పీఎల్‌జీఏను ఏర్పరిచాం. ఈ విషయాన్ని ప్రకటించాం. అదే సమయంలో 2003 ఫిబ్రవరిలో జరిగిన ఎస్ఏసీ సమావేశంలో విప్లవ పోరాటాన్ని అంచనా వేసి, బీహార్-జార్ఖండ్-బెంగాల్ స్పెషల్ ఏరియాలో 80-85 శాతం ప్రాంతాన్ని గెరిల్లా జోన్‌గా గుర్తించాం. 8 ప్రాంతాలను గెరిల్లా బేస్‌లుగా గుర్తించాం. వీటిని బేస్ ఏరియాలుగా పెంపొందించడం కోసం కచ్చితమైన పథకంలో భాగంగా కచ్చితమైన సమయంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించే పర్స్‌పెక్టివ్‌తో పోరాటం కొనసాగిస్తున్నాం. పోరాటం స్థిరంగా పురోగ□స్తుంటే, ఒక దాని తరువాత ఎన్నో ముఖ్యమైన విజయాలు సాధించాం. ఇప్పుడు ఒక పెద్ద గెంతు తీసుకోవలసిన అవసరం ఉంది.

**ఎంసీసీఐగా విడి చరిత్రకు ముగింపు, భాకపా(మావోయిస్టు)గా చరిత్ర ప్రారంభం**

**కామ్రేడ్స్,**

2004 సెప్టెంబరు 21వ తేదీన ఎంసీసీఐ, భాకపా(మాలె)(పీపుల్స్‌వార్) లు విలీనమై ఒక నూతన ఐక్య పార్టీగా భాకపా(మావోయిస్టు) ఏర్పడడంతో ఎంసీసీఐ విడి చరిత్ర ముగిసిపోయింది. భాకపా(మాలె)లో నిజమైన విప్లవకారులు ఎంసీసీఐలో నిజమైన విప్లవకారులతో ఎప్పటికైనా ఐక్యం అవుతారని కామ్రేడ్ కేసీ అన్నాడు. ఆయన కల ఇప్పటికి నిజమయింది. ఇవాళ మనం భాకపా(మావోయిస్టు)గా పేరు పొందాం. భాకపా(మావోయిస్టు) పతాకం కింద ముందుకు సాగుదాం. మన ముందున్న వివిధ కర్తవ్యాలను విజయవంతంగా పరిపూర్తి చేద్దాం.

# భాకపా(మాలె) [పీపుల్స్‌వార్] సంక్షిప్త చరిత్ర

మన దేశంలో గడచిన మూడున్నర దశాబ్దాలుగా మావోయిస్టు ఉద్యమం జరుగుతున్నది. ఈ క్రమంలో భాకపా(మాలె) కఠినతర మార్గంలో ప్రయాణించింది. దోపిడీ లేని స్వేచ్ఛా సమాజాన్ని సృష్టించే ఒక గొప్ప ఆశయం కోసం వేలాది మంది అమరవీరులను అందించింది. ఈ కాలంలో ఎగుడు దిగుడు దారిలో ప్రయాణించింది. మహత్తర పురోగమనాలూ తీవ్ర వెనకడుగులూ చవి చూసింది. అయినా ఈ సుదీర్ఘ కాలంలో గణనీయంగా పురోగమించింది. గడచిన ముప్పై ఐదేళ్ల కాలంలో రాజ్య క్రూర నిర్బంధాన్ని తిప్పి కొడుతూ వేలాది మంది ప్రజలను ప్రభావితం చేసింది. 1972లో తీవ్ర వెనకడుగు ఎదుర్కొన్నప్పటికీ, తిరిగి పుంజుకుంది. మితవాద, అతివాదాలను, ముఖ్యంగా, యావత్తు ఉద్యమాన్నీ మళ్లించాలని చూసిన మితవాద అవకాశవాదాలను తిప్పి కొట్టింది. గత కాలపు అతివాద తప్పులను సరిదిద్దింది. ఈ కాలంలోనే దేశంలో, ప్రపంచంలో కమ్యూనిజానికి ప్రధాన సైద్ధాంతిక ప్రమాదంగా ఉన్న అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా ప్రపంచవ్యాప్త పోరాటంలో భాగంగా, అది దేశంలో ఆధునిక రివిజనిజానికి వ్యతిరేకంగా పోరాడడంలో ప్రధాన పాత్ర నిర్వహించింది. అత్యంత అంకిత స్వభావంతో ఆత్మత్యాగం చేసిన భారత సమాజపు అణిముత్యాల వంటి కామ్రేడ్‌ల నెత్తురుతో తడిసిన మావోయిజం ఎర్ర పతాకను భారత గడ్డ మీద నిలిపింది.

దేశంలో విప్లవోద్యమ పురోగమన క్రమంలో అది ప్రజల గెరిల్లా శక్తులను నిర్మించింది. భారత విప్లవ చరిత్రలో మొట్టమొదటిసారిగా ప్రజాసైన్యం క్రమబద్ధంగా నిర్మాణమై 2000 డిసెంబరు 2వ తేదీన పీజీఏ నిర్మాణానికి దారి తీసింది. పార్టీ నేతృత్వంలో రాజ్య సాయుధ బలగం ప్రతీఘాతుక భారత రాజ్య బలగాలకు వ్యతిరేకంగా మనం సుదీర్ఘకాలం నిరంతరం గట్టి సాయుధ పోరాటం చేసి, బేస్ ఏరియాలు నెలకొల్పే లక్ష్యంతో సాయుధ వ్యవసాయ విప్లవాన్ని పురోగమింపజేయడం ద్వారా దేశ చరిత్రలో మహత్తర పాత్ర వహించింది. తద్వారా ఈ దీర్ఘకాలిక ప్రజా యుద్ధ క్రమంలోనే పార్టీ సంఘటితమయింది. సైన్యం పుట్టి వృద్ధి చెందింది.

అంతేకాక భాకపా(మాలె)(పీపుల్స్‌వార్) ఉద్యమం నుంచీ పొందిన లాభాలను సంఘటితం చేసుకుని కమ్యూనిస్టు పార్టీ అంటేనే తెలియని నూతన ప్రాంతాలకు విస్తరించాం. మొట్టమొదటిసారిగా దేశంలో అనేక ప్రాంతాలలో విప్లవ ప్రజా సంఘాలు ఏర్పరిచాం. పటిష్టం చేసాం. తద్వారా పార్టీకి బలమైన ప్రజా పునాదిని నిర్మించాం.

ఎంసీసీ చరిత్ర కూడా ఇటువంటిదే. ఇప్పుడు భారతదేశంలో ఈ రెండు ప్రధాన స్రవంతులూ విలీనమై, శత్రువులందరినీ తుడిచిపెట్టేసే ఒక మహా నదిగా రూపొందడానికి రంగం సిద్ధమయింది. సోషలిజంలోకీ ఆ తరువాత కమ్యూనిజంలోకీ చేయవలసిన ఒక సుదీర్ఘ ప్రయాణంలో ఒక ముందడుగుగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేయడానికి ఇది నడుం కట్టింది.

ఇది ఒక భారీ కర్తవ్యం. అపారమైన బాధ్యతలున్నాయి. మన దేశ పరిమాణం, జనాభా, క్లిష్టత, భూ రాజకీయ పరిస్థితుల దృష్ట్యా భారతదేశంలో ప్రజాస్వామిక విప్లవ విజయం సామ్రాజ్యవాద గొలుసును తీవ్రంగా నాశనం చేస్తుంది. ఆసియాలోనే కాక ప్రపంచవ్యాప్తంగా బలాబలాల సమతూకంలో మార్పు తీసుకువస్తుంది.

ఏర్పడిన నాటి నుంచీ భాకపా(ఎంఎల్) చరిత్రను క్లుప్తంగా ఇస్తున్నాం.

**కల్లోల అరవయ్యవ దశకం, భారత రాజకీయ రంగంలో వాటి ప్రభావం**

బృహత్తర వాదోపవాదాలతో మొదలుకుని మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవంతో ముగిసిన 1960 దశకంలో జరిగిన కుదిపివేసిన సంఘటనలు ప్రపంచవ్యాప్తంగా ఎంఎల్ శక్తులలో ఒక నూతన వర్గీకరణను ముందుకు తీసుకువచ్చాయి. మాలెమాను మార్గదర్శక సిద్ధాంతంగా తీసుకున్న నూతన మాలె పార్టీలు ఆవిర్భవించసాగాయి.

భారత ప్రజాస్వామిక విప్లవ చరిత్రలో 1967 నాటి నక్సల్బరీ సాయుధ రైతాంగ విప్లవం ఒక గొప్ప మూల మలుపు. 1951లో తెలంగాణాలో రివిజనిస్టు నాయకత్వం విద్రోహం చేసిన తరువాత నక్సల్బరీ సాయుధ రైతాంగ విప్లవంలో మూల మలుపుగా ఉంది. తెలంగాణా, పున్నప్రా, వాయలార్, బెంగాల్‌లో తెభాగా ఉద్యమం వంటి వీరోచిత సాయుధ రైతాంగ పోరాటాల వారసత్వం అందుకుని, సాయుధ రైతాంగ విప్లవాన్ని ప్రారంభించి, కొనసాగించడం సీపీఐ(ఎంఎల్)కు గర్వకారణం. తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం నుంచీ నక్సల్బరీ పోరాటం ఒక గెంతు. వేళ్లూనుకున్న రివిజనిస్టు నాయకత్వానికి వ్యతిరేకంగా జరిగిన తీవ్ర సైద్ధాంతిక పోరాటం, తిరుగుబాటుల ఫలితంగా జరిగిన పోరాటం ఇది.

కాన్సర్‌లా వ్యాపించి ఉన్న రివిజనిజం మీద మాలెమా మార్గదర్శకత్వంలో నక్సల్బరీలో ప్రారంభమైన సాయుధ రైతాంగ విప్లవ పోరాటం మొదటి దెబ్బ. అందుకనే రివిజనిస్టులూ కాంగ్రెస్ పాలకులూ సాయుధ రైతాంగ విప్లవాన్ని రక్తపు మడుగులలో ముంచడానికి రంగంలోకి దూకారు. రైతాంగ విప్లవం దేశంలో ఒక యావత్తు తరాన్నీ ఎంతగా ఉత్తేజితులను చేసిందో పాలక వర్గాలను అంతగా భయపెట్టింది. నక్సల్బరీ నిప్పు రవ్వ భారతదేశంలో శ్రీకాకుళం, ముషాహరి, దేబ్రా-గోపీవల్లభపూర్, లక్ష్మింపూర్-ఖేరీ, బీర్‌భూం వంటి పలు మూలలకు వ్యాపించింది. భారతదేశ అత్యుత్తమ కొడుకులూ కూతుళ్లూ అయిన వేలాది అమరులు విప్లవం కోసం తమ ప్రాణాలు అర్పించారు.

ఆ తరువాత విప్లవోద్యమం తాత్కాలికంగా కొంత వెనకడుగు వేసినప్పటికీ మాలెమా ప్రకాశవంతమైన ఎర్ర పతాకా, నక్సల్బరీ జ్వాలలూ దేశంలో వివిధ ప్రాంతాలలో జ్వలించసాగాయి. ఇప్పటికి భారత భూభాగం మీద మాలెమా బీజాలు లోతుగా నాటుకున్నాయి. మితవాద అవకాశవాదం, అతివాద పెడధోరణులకు వ్యతిరేకంగా పోరాడుతూ విప్లవోద్యమం తిరిగి బలం పుంజుకుంది. 1972 నాటి కంటే మరిన్ని స్థాయిలకు పురోగమించసాగింది. శత్రు తూటాలకు

బలైన వారి వీరోచిత త్యాగాలు వృధా పోలేదు. శత్రు దాడి పూర్వక యుద్ధాన్ని తిప్పికొట్టి ఉద్యమం మరింత ఉన్నత స్థాయిలో పెరగసాగింది.

భాకపా(మాలె)(పీపుల్స్‌వార్), భాకపా(మాలె)(పీయూ)ల ఆవిర్భావం, అభివృద్ధీ ఈ తుఫాను కాలంతో విడదీయలేని విధంగా ముడిపడి ఉంది. గడచిన ముప్పై ఐదేళ్ల చరిత్రలో మనం మెరుస్తున్న మాలెమా పతాకాన్ని సమున్నతంగా ఎత్తిపట్టడమే కాకుండా, దాన్ని భారతదేశ నిర్దిష్ట పరిస్థితులలో విప్లవ ఆచరణకు అన్వయించసాగాం. ఈ ఆచరణ క్రమంలో మాలెమా పునాది మీద మన ఉద్యమాలలో అనుకూల, ప్రతికూల అనుభవాలను విశ్లేషించి, సంశ్లేషించి, ఒక విప్లవ పంథాను మనం పెంపొందించాం. ఈ వెలుగులో, రైతాంగ ప్రజల, ముఖ్యంగా పేద భూమి లేని రైతాంగాన్ని సమీకరించి, వారిపై ఆధారపడి గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ విప్లవ గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయడం ద్వారా దీర్ఘకాల ప్రజా యుద్ధాన్ని కొనసాగించడంలోనూ అభివృద్ధి చేయడంలోనూ మనం ఎన్నో చెప్పుకోతగ్గ విజయాలు సాధించాం. సామ్రాజ్యవాద మద్దతుతో ప్రతీఘాతుక పాలక వర్గాలు అమలు చేసిన నిరంతర తీవ్ర నిర్బంధాన్నీ అనేక అణిచివేత క్యాంపెయిన్‌లను ప్రతిఘటించడం ద్వారా మనం ఈ పోరాటం కొనసాగించాం.

ప్రజాయుద్ధాన్ని పురోగమింపజేసే, ప్రజా సైన్యాన్ని నిర్మించే బేస్ ఏరియాలను నెలకొల్పే క్రమంలో నక్సల్బరీ, భాకపా(మాలె)ల వారసత్వాన్ని కొనసాగించిన భాకపా(మాలె)(పీపుల్స్‌వార్), భాకపా(మాలె)(పీయూ)లు 1998 ఆగస్టులో ఐక్య భాకపా(మాలె)(పీపుల్స్‌వార్)గా విలీనమయాయి. ఈ రెండు పార్టీలూ కూడా 1969లో ఏప్రిల్ 22న ఏర్పడిన భాకపా(మాలె)లో భాగంగా ఉన్నాయి. ఐక్య భాకపా(మాలె) 8వ కాంగ్రెస్ లేక పునరుద్ధరించిన విప్లవ కార్మిక వర్గ పార్టీ, అంటే భాకపా(మాలె) ప్రధమ కాంగ్రెస్ అవలంబించిన విప్లవ పంథాను అవి కొనసాగించాయి. ఈ రెండు పార్టీలూ 8వ కాంగ్రెస్ ఆమోదించిన పార్టీ కార్యక్రమం, నిబంధనావళులను అవలంబించాయి. నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటు తరువాత భాకపా(మాలె) అనుభవాలను క్రోడీకరించాయి. గత అనుభవాల సంశ్లేషణ నుంచీ పొందిన పాఠాల పునాదిగా విప్లవ ఆచరణ కొనసాగించాయి.

పూర్తి స్థాయి ప్రజా విముక్తి సైన్యాన్నీ ఆంధ్ర, జార్ఖండ్, బీహార్, దండకారణ్యం, ఒరిస్సా రాష్ట్రాల విశాల గ్రామీణ ప్రాంతాలలో బేస్ ఏరియాలను నెలకొల్పే దిశగా పని చేసే ఒక గెరిల్లా సైన్యం అంటే పీజీఏనూ అలాగే గెరిల్లా జోన్‌లనూ పెంపొందించడంలో ఈ నూతన పార్టీ విజయవంతమయింది. గ్రామీణ ప్రాంతం నుంచీ పట్టణాలను చుట్టుముట్టే వ్యూహం ద్వారా వ్యవసాయ విప్లవం ఇరుసుగా నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపూర్తి చేసే దిశగా మన పార్టీ దీర్ఘకాలిక ప్రజాయుద్ధానికి నాయకత్వం వహిస్తున్నది. ప్రస్తుతం ఈ ముప్పై ఐదేళ్ల మహత్తర విప్లవ చరిత్ర క్రోడీకరణను ఈ నేపథ్యం నుంచీ చూడాలి.

ఈ మూడున్నర దశాబ్దాల కాలంలో మన పార్టీ, ఇతర మావోయిస్టు సంస్థలకు చెందిన వేలాది మంది కామ్రేడ్‌లు దేశంలో విప్లవోద్యమం కోసం తమ ప్రాణాలు అర్పించారు. ఇందులో ఈ పార్టీల అనేక మంది సీనియర్ నాయకులూ మేధావులూ ఉన్నారు. ఈ క్రమంలో వరుస ప్లీనాలూ మహాసభలూ ఇతర సమీక్షా సమావేశాలలో పార్టీ అభివృద్ధి చెందింది. అంతిమంగా 9వ కాంగ్రెస్ జరిగింది. గత కొన్ని పోరాటాలలో ఉద్యమం క్షీణించినప్పటికీ గడచిన మూడున్నర సంవత్సరాలలో భాకపా(మాలె)(పీపుల్స్‌వార్) 9వ కాంగ్రెస్ సుసంపన్నం చేసిన పంథా పునాదిగా ఆచరణ, ఉద్యమాన్ని మొత్తంగా పురోగమింపజేసింది.

**నూతన విప్లవ పంథాకు సైద్ధాంతిక రాజకీయ పునాది**

1965 జనవరి-1967ల మధ్య కాలంలో ప్రచురితమైన కామ్రేడ్ చారు మజుందార్ రాసిన చరిత్రకెక్కిన 8 డాక్యుమెంట్‌లు భారత కమ్యూనిస్టు ఉద్యమంలో ఉన్న విప్లవ వాహిని రివిజనిస్టులతో గుణాత్మకంగా తెగతెంపులు చేసుకోవడానికి సిద్ధాంత రాజకీయ పునాది వేసాయి. మహత్తర నక్సల్‌బరీ తిరుగుబాటు ఆరంభానికి బాట వేసాయి. ఈ డాక్యుమెంట్‌లు భారతదేశంలో నిర్దిష్ట పరిస్థితికి మా-లె-మావో ఆలోచనా విధానపు సృజనాత్మక అన్వయింపే. ఇవి పార్లమెంటరీ క్రెటినిజం నుంచీ పూర్తిగా భిన్న వైఖరి తీసుకున్నాయి. ఆనాటికి భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమంలో వేళ్లూనుకుని ఉన్న రివిజనిజానికి వ్యతిరేకంగా విప్లవ రాజకీయాలను నిశ్చయంగా ముందుకు తీసుకువచ్చాయి.

ఈ డాక్యుమెంటులను సీపీఐ, సీపీఐ(ఎం)ల లోపల సిద్ధాంత, రాజకీయ పోరాట క్రమంలో రాసారు. అవి చారిత్రాత్మక నక్సల్‌బరీ పోరాటానికి సిద్ధాంత పునాదులుగా పని చేసాయి. ఈ డాక్యుమెంటులు కొత్త పార్టీ ఏర్పాటుకు, విప్లవోద్యమ ఇతోధిక పెరుగుదలకు కూడా రాజకీయ సిద్ధాంత పునాదిగా ఉపకరించాయి. అంతేకాదు, కామ్రేడ్ సీఎం కృశ్చేవ్ రివిజనిజానికి వ్యతిరేక పోరాటంలో అంతర్జాతీయ వాదోపవాదాలకు కూడా ఆయన తన సేవలను అందించాడు. సోవియట్ యూనియన్‌ను సోషల్ సామ్రాజ్యవాదంగా వర్గీకరించిన మొట్టమొదటి వారిలో ఆయన ఒకరు. మరి కొందరితో కలిసి ఆయన మహత్తర కార్మికవర్గ సాంస్కృతిక విప్లవానుభవాలను దక్షిణాసియాలో ఇతర దేశాలకు వ్యాపింపజేసే కృషికి పునాది వేసారు.

**నక్సల్బరీ తిరుగుబాటు**

ఈ తిరుగుబాటు స్వల్పకాలంలోనే అణిచివేతకు గురయినప్పటికీ, అది భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో బ్రహ్మాండమైన ప్రాముఖ్యతను సంతరించుకుంది. భారత రాజకీయాలలో ఒక మూల మలుపుగా నిలిచింది. నక్సల్‌బరీ తరువాత భారత రాజకీయాలు మరెన్నడూ పూర్వంలా లేవంటే అది అతిశయోక్తి కాబోదు. ఏమంటే, అది ఏ రంగాన్నీ వదలకుండా అన్నింటి పైనా తన ప్రభావాన్ని చూపింది. నక్సల్‌బరీ నిప్పురవ్వ అనతికాలంలోనే శ్రీకాకుళం, బీర్‌భూం, దేబ్రా-గోపీ వల్లభపూర్, ముషాహరి, లఖింపూర్-ఖేరి మొదలయిన గ్రామీణ భారతంలో

విశాల ప్రాంతాలను ఆవరించిన దావానలమయింది. ఆ తరువాత కొద్ది సంవత్సరాల కాలంలోనే సాయుధ రైతాంగ పోరాటం డజనుకు పైగా రాష్ట్రాలకు వ్యాప్తి చెందింది.

**చైనా కమ్యూనిస్టు పార్టీ నక్సల్‌బరీ తిరుగుబాటును భారత దేశం పై వసంత మేఘ గర్జన అని కీర్తించింది.** *సాహసంతో రైతాంగ ప్రజారాశులను ఉత్తేజపరచండి, విప్లవ సాయుధ బలగాలను నిర్మించి, విస్తరింపజేయండి, ప్రజాయుద్ధపు పట్టువిడుపులతో కూడుకుని ఉండే వ్యూహం-ఎత్తుగడలు మొత్తాన్ని వినియోగిస్తూ తాత్కాలికంగా విప్లవ శక్తుల కంటే బలోపేతంగా ఉన్న సామ్రాజ్యవాదుల, అభివృద్ధి నిరోధకుల సాయుధ అణచివేతను ఎదుర్కోండి* అని భారత విప్లవ కమ్యూనిస్టులకు పిలుపునిచ్చింది.

నక్సల్బరీ తిరుగుబాటు 1960 దశకం మలి భాగంలో ప్రపంచవ్యాప్త విప్లవ పెను వెల్లువలో విడదీయరాని అంతర్భాగమే. కా.మావో నాయకత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో సైద్ధాంతిక, రాజకీయ తీవ్ర పోరాట ఫలితం నక్సల్బరీ తిరుగుబాటు. కా.మావో నాయకత్వంలో విప్లవ చైనా కమ్యూనిస్టు పార్టీ ఒక పక్షాన, రెనగేడ్ కృశ్చేవ్ నాయకత్వంలో రివిజనిస్టు సీపీఎస్‌యూ మరో పక్షానా సాగిస్తున్న బృహత్తర వాదోపవాదాలు ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిస్టు పార్టీలలో ఒక కొత్త కేంద్రీకరణ క్రమాన్ని ఆరంభించాయి.

ప్రపంచంలో ఇతర దేశాలలో వలెనే భారతదేశంలో కూడా ఈ పోరాటం కమ్యూనిస్టు శిబిరంలో తారస్థాయికి చేరింది. ఆ విధంగా నక్సల్బరీ అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమంలో ఎంతగానైతే రివిజనిజానికి విప్లవానికి మధ్య సునిశిత పోరాటానికి ప్రాతినిధ్యం వహించిందో అంతగానూ భారత కమ్యూనిస్టు ఉద్యమంలోనూ ఆ సునిశిత పోరాటానికి ప్రాతినిధ్యం వహించింది. అది సీపీఐ, సీపీఎంలలో విప్లవ శక్తుల సమీకరణ స్థానం అయింది. ఆ శక్తులు కొత్త విప్లవ పార్టీ ఏర్పాటు క్రమానికి చొరవ చేయనారంభించాయి. సీపీఎంలో విప్లవకారులు కలకత్తాలో నక్సల్బరీ రైతాంగ పోరాట సహాయ కమిటీని ఏర్పరిచారు. నూతన పార్టీకి ఇదే కేంద్రకం అయింది. సాయుధ పోరాటాన్ని భారత విప్లవ ఎజెండాలోకి మరోసారి తీసుకురావడం ద్వారా అది ఈ ఉపఖండంలో మావోయిస్టులకు పిలుపునందించే శంఖారావం అయింది.

నక్సల్బరీ, దేశ ప్రజలకు ఆచరణాత్మక పద్ధతులలో కూడా సాయుధ పోరాట బాటను అందించడానికి సాయపడింది. తద్వారా అది భవిష్యత్తులో ప్రజా యుద్ధానికి సాయుధ బలం ద్వారా అధికారాన్ని చేజిక్కించుకునే బాటకు విత్తులు నాటింది. భారతదేశంలోనే కాక దక్షిణాసియా అంతటా నిజమైన విప్లవకారులకు నక్సల్బరీ ఏక్ హీ రాస్తా నినాదమయింది.

**పార్టీ ఏర్పాటు సాయుధ రైతాంగ వెల్లువ (1967 - 72)**

దేశంలో పలు రాష్ట్రాలలో నక్సల్బరీ తరహా పోరాటాలు వ్యాప్తి చెందిన నేపథ్యంలో దేశంలో ఒక సమన్వయ కమిటీ, రహస్య, కేంద్రీకృత విప్లవ పార్టీ, ఒక కొత్త తరహా లెనినిస్టు పార్టీ తక్షణ అవసరంగా ముందుకు వచ్చింది.

కొత్త పార్టీని ఏర్పాటు చేసే ప్రక్రియకు నక్సల్బరీ తిరుగుబాటు చెలరేగిన తరువాత రెండేళ్ల కాలం పట్టింది. అయితే, విప్లవ పార్టీని ఏర్పరచడానికి సిద్ధాంత రాజకీయ పోరాటం మాత్రం 1964లో 7వ కాంగ్రెస్ నుంచే మొదలయింది. పైన చెప్పుకున్న విధంగానే 1964-67 మధ్యకాలంలో కా.సీఎం రాసిన 8 డాక్యుమెంటులు అటువంటి ఒక పార్టీకి సిద్ధాంత రాజకీయ ప్రాతిపదికను ఏర్పరిచాయి. నక్సల్‌బరీ, దాని వెన్నంటి వచ్చిన అదే తరహా ఉద్యమాలు విప్లవ పార్టీ ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేసాయి. 1967 నవంబరులో అఖిల భారత కో ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటుతో, కొత్త పార్టీ ఏర్పాటు దిశగా నిర్మాణపరమైన మొదటి అడుగు పడింది. ఈ కమిటీ ఇచ్చిన ప్రకటనను పెకింగ్ (బీజింగ్) రేడియో ప్రసారం చేసింది కూడా.

ఆరు నెలల తరువాత 1968 మే 14వ తేదీన నక్సల్బరీ రైతాంగ తిరుగుబాటు మొదటి వార్షికోత్సవం సందర్భంగా మారిన పరిస్థితి ప్రకారం నూతన ప్రకటనను జారీ చేయాలని ఏఐసీసీఆర్ నిర్ణయించింది. కమిటీ పేరును *అఖిల భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమన్వయ కమిటీ (ఏఐసీసీసీఆర్)* గా పేరు మార్చింది. ఈ కమిటీకి కామ్రేడ్ సుశీతల్ రాయ్ చౌదరి కన్వీనర్‌గా ఉన్నాడు. విప్లవకారులు ఇంగ్లీషులో *లిబరేషన్* పత్రికను, బెంగాలీలో *దేశబ్రతి* పత్రికనూ ప్రచురించసాగారు.

భారత విప్లవ టార్గెట్‌లనూ మిత్రులనూ విప్లవ పంథానూ ఏఐసీసీసీఆర్ నూతన ప్రకటన సరిగా వివరించింది.

ఒక కొత్త పార్టీని నిర్మించడానికి బలగాలన్నింటినీ ఏకం చేయాలని విప్లవకారులందరికీ అది పిలుపునిచ్చింది. ***భారత విప్లవ విజయం మరింత చేరువయేందుకు వీలుగా తమ బలగాలన్నింటినీ ఏకం చేసి, తమ పోరాటాలను సమన్వయపరచుకోవాలని దేశమంతటా ఉన్న ఛైర్మన్ మావో ఆలోచనా విధానాన్ని ఆమోదించే విప్లవకారులందరికీ ఈ చారిత్రక తరుణంలో మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం. ఛైర్మన్ మావో ఎర్ర బావుటా కింద మనందరం సమీకృతులమవుదాం. భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు ఆయన ఆలోచనా విధానాన్ని అన్వయిద్దాం, నక్సల్బరీ తరహా విప్లవ పోరాటాల క్రమంలో నిజమైన భారత కమ్యూనిస్టు పార్టీని నిర్మిద్దాం. ఏమంటే, ఒక విప్లవ పార్టీ లేకుండా విప్లవం విజయవంతం కాజాలదు.***

ఏఐసీసీసీఆర్ నాయకత్వంలో దాదాపు పదమూడు రాష్ట్రాలలో రాష్ట్ర సమన్వయ కమిటీలు ఏర్పడ్డాయి. ఇవి ఆయా రాష్ట్రాలలో సాయుధ వ్యవసాయ పోరాట వెల్లువలను సమన్వయించి, నాయకత్వం వహించాయి.

ఈ ఉద్యమాలకు మార్గదర్శకత్వాన్ని అందించిన కా.చారు మజుందార్ నాయకత్వం కింద ఒక నూతన తరహా పార్టీని నిర్మించడానికి పార్టీ నిర్మాణం గురించి ఏఐసీసీసీఆర్ ఒక తీర్మానం చేసింది. భాకపా(మాలె) 1969 ఏప్రిల్ 22వ తేదీన ఉదయించింది. ఇది కామ్రేడ్ లెనిన్ నూరో జన్మదిన వార్షికోత్సవం. దేశంలో వివిధ ప్రాంతాలలో పలు పోరాటాలను నిర్వహించి,

అఖిల భారత స్వభావాన్ని సంతరించుకున్న తరువాత 1970 మే నెలలో పార్టీ 8వ కాంగ్రెస్‌ను నిర్వహించింది. కామ్రేడ్ సీఎం కేంద్ర కమిటీ కార్యదర్శి అయాడు.

పార్టీ 8వ కాంగ్రెస్ 1970 మే 15, 16 తేదీలలో కలకత్తాలో జరిగింది. వేళ్లూనుకుని ఉన్న రివిజనిస్టు ధోరణులకు వ్యతిరేకంగా 1965 జనవరిలో కామ్రేడ్ చారు మజుందార్ మొదటి డాక్యుమెంటు ప్రచురణతో ఆరంభమై ఎడతెగకుండా కొనసాగిన సైద్ధాంతిక రాజకీయ పోరాటానికి ఇది ముగింపు. సాయుధ రైతాంగ ఉద్యమాలను నడపడంలోనూ, రివిజనిజానికీ ఆర్థికవాదానికీ వ్యతిరేకంగా వారు సాగించిన పోరాటాల్లో వివిధ రాష్ట్రాల విప్లవకారులు గడించిన అనుభవాన్ని అది సంశ్లేషించింది.

భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు ఎంఎల్ఎం సిద్ధాంతాన్ని నిర్దిష్టంగా అన్వయించడం ద్వారా కాంగ్రెస్ భారత సమాజ స్వభావాన్ని అర్ధవలస, అర్ధ భూస్వామ్య సమాజంగా సరిగానే విశ్లేషించింది. సోషలిస్టు దృక్పథంతో కూడుకుని ఉన్న నూతన ప్రజాస్వామిక విప్లవ సాధారణ పంథాను ప్రతిపాదించింది. భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్ర పుటల్లో ఈ చారిత్రాత్మక కాంగ్రెస్ ఒక గుణాత్మక మూల మలుపు. అది దశాబ్దాల రివిజనిస్టు ఆచరణకు స్వస్తి పలికింది. భారత విప్లవానికి ఒక కొత్త విప్లవ బాటను రూపొందించింది. సీపీఎంలో ఉన్న నయా రివిజనిజాన్ని 1964లో 7వ కాంగ్రెస్ తరువాత సీపీఎస్‌యూ, సీపీసీ రెంటికీ సమాన దూరంలో ఉండడం అనే పేరిట ఆ పార్టీకి ఇది ఒక లక్షణమైంది. ఈ రెంటినీ తిరస్కరించింది. భాకపా(మాలె) ఒక కొత్త తరహా పార్టీ. రహస్య పార్టీ. ఈ పార్టీ పార్లమెంటరీ బాటను తిరస్కరించింది. అన్ని రకాల రివిజనిజాన్నీ తిరస్కరించింది. గ్రామీణ ప్రాంతాల్లో అధికారాన్ని చేజిక్కించుకుని అంతిమంగా నగరాలను చుట్టుముట్టడం, దేశవ్యాప్త విజయం సాధించడం అనే దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాకు దృఢంగా కట్టుబడి ఉంది.

దేశంలో ఒక కొత్త విప్లవ పంథాను గొప్ప స్పష్టతతో నెలకొల్పిన చారిత్రక కాంగ్రెస్‌గా, పునర్నిర్మించిన భారతదేశ కమ్యూనిస్టు పార్టీ మొదటి కాంగ్రెస్‌గా, అన్ని రకాల రివిజనిజాలతోనూ శాశ్వతంగా పూర్తిగా తెగతెంపులు చేసుకున్న కాంగ్రెస్‌గా, భారత విప్లవానికి కొత్త విప్లవ పంథాను నెలకొల్పిన కాంగ్రెస్‌గా ఈ 8వ కాంగ్రెస్ అనుపమానమైనదిగా నిలుస్తుంది. భారత విప్లవ చరిత్రలో శాశ్వత స్థానాన్ని పొందుతుంది.

**ఉద్యమ వ్యాప్తి - రాజుకున్న నిప్పురవ్వ**

అనతికాలంలోనే నక్సల్బరీ బాటను అనుసరిస్తూ శ్రీకాకుళం, బీర్‌భూం, ముషాహరి, దేబ్రా-గోపీవల్లభపూర్, తెరాయ్‌ల్లోనూ, పంజాబ్, ఆంధ్ర, పశ్చిమ బెంగాల్‌లో ఇతర ప్రాంతాలలో తమిళనాడు, కేరళ, ఉత్తరప్రదేశ్ మొదలయిన ఇతర ప్రాంతాలలోనూ అనతికాలంలోనే రైతాంగ సాయుధ పోరాటాలు చెలరేగాయి. ఆ విధంగా సాయుధ విప్లవ రైతాంగ పోరాటాలు నక్సల్బరీ నుంచీ దేశంలో పలు ప్రాంతాలకు వ్యాపించాయి. ఈ ఉద్యమానికి బొడ్డురాయి వంటి

పశ్చిమ బెంగాల్‌లోనే కాక, ఆంధ్ర, బీహార్ రాష్ట్రాలలో గట్టి పునాది ఏర్పరిచాయి.

ఈ ఉద్యమాల ఫలితంగా విప్లవ రైతాంగ కమిటీల ఏర్పాటుతో ప్రజల విప్లవాధికారం బీజరూపంలోనే అయినా దేశంలో మొట్టమొదటిసారిగా నెలకొల్పబడింది. ఇది ప్రత్యేకంగా శ్రీకాకుళం, బీర్‌భూంలలో మాత్రమే కాక ఇతర ప్రాంతాలలో సైతం కొట్టొచ్చినట్టు కనపడింది. అంతేకాదు, మొట్టమొదటి సారిగా శత్రు బలగాల నుంచీ భూస్వాముల నుంచీ ఆయుధాలు గుంజుకున్నా, ప్రజా సైన్యపు పిండ రూపంగా గెరిల్లా నిర్మాణాలు ఏర్పరిచారు. ఈ కారణం వల్లనే దీర్ఘకాల ప్రజాయుద్ధ మార్గం సిద్ధాంత రూపంలోనే కాక, పై పోరాటాల నిర్దిష్ట ఆచరణ ద్వారా కూడా ఉనికిలోకి వచ్చింది.

**కా.సీఎం అమరత్వం**

క్రూర చిత్రహింస ద్వారా ఒక కొరియర్ నుంచీ రాబట్టి, కా.సీఎంను 1972 జులై 16న కలకత్తాలో ఒక షెల్టర్‌లో అరెస్టు చేసారు. అరెస్టయిన సమయంలో ఆయన కార్డియాక్ ఆస్త్మా (గుండె ఉబ్బసం) జబ్బుతో బాధపడుతున్నాడు. పన్నెండు రోజుల పాటు పోలీసు కస్టడీలో ఉన్నప్పుడు ఆయనను చూడడానికి ఎవ్వరినీ అనుమతించలేదు. అదే నెల 28 తెల్లవారి ఆయన పోలీసు కస్టడీలో అమరుడయాడు. ఆయన చనిపోయిన తరువాత కూడా పోలీసులు ఎంతో భయపడ్డారు. ఆ ప్రాంతమంతా చుట్టుముట్టేసారు. సన్నిహిత కుటుంబ సభ్యులను మినహా ఎవ్వరినీ ఆయన మృతదేహం దగ్గరకు రానివ్వలేదు.

ఆయన మరణం భారత విప్లవానికి, ప్రపంచ విప్లవానికి గొప్ప నష్టం. ఆయన అమరత్వం దశాబ్దాల తరబడి రివిజనిస్టు విద్రోహం తరువాత గట్టి సిద్ధాంత రాజకీయ పునాది మీద ఆరంభించిన విప్లవోద్యమానికి, పునర్నిర్మాణమయిన భాకపా(మాలె) చరిత్రలో మొట్టమొదటి మహత్తర అధ్యాయానికి ముగింపు పలికింది.

**72 తరువాత వెనుకంజ - కొత్త వెల్లువకు సన్నాహాలు (1972 - 77)**

ఈ కీలక కాలాన్ని నాలుగు ప్రధాన అంశాల పునాదిగా విశ్లేషించవచ్చు.

మొదటిది, అది భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో కమ్యూనిస్టు విప్లవకారులు ఎదుర్కొన్న అతి గడ్డుకాలం. మార్క్సిస్టు లెనినిస్టు మావోయిస్టు శిబిరంలో ఉన్న ప్రతి కమ్యూనిస్టూ ఒక పరీక్షను ఎదుర్కోవలసి వచ్చింది. శత్రు దాడిని తట్టుకుని నిలబడగలిగే వారెవరు, లొంగిపోయేవరెవరు, పీడిత ప్రజారాశులతో దృఢంగా నిలబడేది ఎవరూ, శత్రు శిబిరానికి లొంగిపోయేది ఎవరు, వారు ఎటువంటి గుణపాఠాలు నేర్చుకుంటారు, మార్క్సిస్టు-లెనినిస్టు గుణపాఠాలా, రివిజనిస్టు పాఠాలా, ప్రజాయుద్ధం కోసం ప్రజలను పునర్సంఘటితం చేయడానికి ఎవరు నిజంగా చొరవ చేస్తారు, ఎవరు శుష్క వాదోపవాదాలకు పరిమితమవుతారు, ఎవరు నిజమైన, సమర్థులైన నాయకులుగా నిలబడతారు, ఎవరు బూటకపు నాయకులుగా తేలిపోతారు

అన్నదే ఆ పరీక్ష.

రెండోది, అది రాజ్య బలగాల భారీ దమనకాండ నడుమ రాజకీయ, సిద్ధాంత గందరగోళం నెలకొన్న కాలం. వెన్ను చూపడాలు విద్రోహాలు, చీలికలు, క్రియాశూన్యత్వం దీనికి తోడయాయి.

మూడోది, గొప్ప వీరోచిత త్యాగాలను, ఏటికి ఎదురీదడంలో అపార సాహసాలను, గొప్ప విప్లవ స్ఫూర్తితో సాయుధ పోరాటాన్ని కొన్ని పాకెట్‌లలో కొనసాగించడాన్ని కూడా చవి చూసిన కాలం అది.

చివరిది, గతాన్ని విశ్లేషించి, గుణపాఠాలు రాబట్టడానికి, కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యతకు, పునరేకీకరణ కృషికి ప్రయత్నాలు ఆరంభించడానికి, ఒక వైపున కొత్త వెల్లువకు, సన్నాహాలకు, మరో వైపున అవకాశవాద శక్తులను ఎండగట్టడానికీ చాలా ముఖ్యమైన కాలం అది.

**ఉద్యమ వెనుకంజ, పార్టీ చీలిక**

ఎత్తుగడల పూర్వకమైన తప్పులతో సహా ఇతర రాజకీయ, నిర్మాణ బలహీనతలు, తీవ్ర దమనకాండ, భారీ నష్టాలు, అనుభవరాహిత్యం అంతర్గతంగా మితవాద అవకాశవాదుల విచ్ఛిన్నకర చర్యలు, వీటి ఫలితంగా వెనుకంజ, రాజకీయ సిద్ధాంత గందరగోళం మొదలయిన వాటన్నింటి కారణంగా పార్టీ చీలిపోసాగింది. ఎస్ఎన్ఎస్ విద్రోహంతో పార్టీలో మొదటి చీలిక 1971 నవంబర్‌లో చోటు చేసుకుంది. కామ్రేడ్ సీఎం అమరులైన ఏడాదిలోనే పార్టీ చీలికలు, పేలికలయింది. 8వ కాంగ్రెస్ తరువాత కేవలం రెండేళ్ల వ్యవధిలోనే పెద్ద సంఖ్యలో కేంద్ర కమిటీ సభ్యులు అమరులయారు. కొందరు అరెస్టు కాగా ఇతరులు ద్రోహం చేసారు. మిగిలిన ఇద్దరు కేంద్ర కమిటీ సభ్యులు కా.శర్మ, కా.సునీతి కుమార్ ఘోష్‌లకు రాష్ట్ర కమిటీలతో సజీవ సంబంధాలు లేవు.

భారతదేశ విప్లవోద్యమంలో 72 తరువాత ఘట్టం ఈ విధంగా పార్టీ అనేక చిన్న గ్రూపులుగా చీలిపోవడాన్ని చవి చూసింది. ఈ గ్రూపులలో కొన్ని క్రమంగా తమ సొంత పంథాలు, ఆచరణలతో స్వతంత్ర పార్టీలుగా పటిష్టమయాయి. వాటిలో కొన్ని 1967-72 కాలపు గొప్ప పోరాటాల విప్లవ వారసత్వానికి నిజ వారసులమని చెప్పుకుంటూ కొత్త కేంద్ర కమిటీలను ఏర్పరచుకోగా, మరి కొన్ని గ్రూపులు విప్లవ శక్తులన్నింటినీ ఏకం చేయాలని భాకపా(మాలె) పునస్సంఘటితం చేయాలనే తమ ఆకాంక్షను వ్యక్తం చేసాయి.

1972 వెనుకంజ, పార్టీ అనేక చీలిక గ్రూపులుగా ఛిద్రమవడం మన పార్టీ చరిత్రలో అతి చీకటి అధ్యాయం. కేంద్ర కమిటీ విచ్ఛిన్నమయిన కారణంగా భారత విప్లవానికి కేంద్రం లేకపోవడంతో ఒంటరి గ్రూపులూ పార్టీలూ ఏర్పడడానికి దారి తీసింది. ఇవి కొన్ని ప్రాంతాలకూ రాష్ట్రాలకూ పరిమితమై పని చేసేవి. 1980 వరకూ ఈ పరిస్థితి కొనసాగింది.

ఒక వంక, మునుపటి భాకపా(మాలె)(పీపుల్స్‌వార్), భాకపా(మాలె)పార్టీ యూనిటీల కొత్త

కేంద్రాల నాయకత్వంలోనూ, మరో వంక ఎంసీసీ నాయకత్వంలోనూ దేశంలో కొన్ని ప్రాంతాలలో ఉద్యమ పునరుద్ధరణతో విప్లవ ప్రజారాశులలో కొత్త ఆశలు చిగురించాయి. 1980 నాటికి భాకపా(మాలె)కు చెందిన కొన్ని ఫ్యాక్షన్‌లు అంతరించాయి. కొన్ని ఇంకా చీలికలకు గురయాయి. మరి కొన్ని రివిజనిస్టుగా మారాయి.

**ఎంఎల్ శిబిరంలో మూడు ధోరణులు**

ఈ కాలంలో భాకపా(మాలె)కు చెందిన శక్తులు, ఇతర కమ్యూనిస్టు విప్లవ గ్రూపులూ 1970ల ఆఖరులో స్థూలంగా మూడు ధోరణులుగా వర్గీకృతమయాయి -

మొదటిది, రెనగేడ్‌లు ఎస్ఎన్ఎస్, కాను సన్యాల్, అసిం ఛటర్జీల ధోరణి. టీఎన్ - డీవీ, సీపీ రెడ్డీ మొదలయిన వారి మితవాద ధోరణి. వీరందరూ నక్సల్బరీ ఉద్యమం మీదనూ కామ్రేడ్ చారు మజుందార్ మీదనూ విషపూరిత దాడులు చేసారు. పార్టీ మౌలిక పంథా నుంచీ కార్యక్రమం నుంచీ పక్కకు మళ్లారు. ఈ అన్ని పార్టీలూ 1970 చివరి నాటికి పార్లమెంటరీ ఎన్నికలలో పాల్గొననారంభించాయి. వీటిలో కొన్నింటికి సాయుధ దళాలు ఉన్నప్పటికీ సంస్కరణవాద ఆచరణలో మెడ లోతు దిగబడిపోయి ఉన్నాయి. రాజకీయ అధికారాన్ని స్వాధీనం చేసుకునే లక్ష్యంతో నిర్దిష్ట కార్యక్రమం అంటూ లేదు (గడచిన రెండు దశాబ్దాలుగా ఈ ధోరణిలో నిరంతరం చీలికలు వచ్చాయి. దీంతో దిగజారుడు, దివాళాకోరుతనం, నిర్లిప్తత, చివరకు విద్రోహాలు కూడా జరిగాయి. క్రమేపీ నిజమైన విప్లవ సెక్షన్‌లు, శక్తులూ మూడో ధోరణిలో చేరారు).

రెండో ధోరణి మహదేవ్ ముఖర్జీ, ఇతర లిన్ పియావో గ్రూపుల వంటి అతివాద దుస్సాహసిక గ్రూపులది. కామ్రేడ్ జౌహార్ అమరత్వం తరువాత కొద్ది సంవత్సరాల పాటు వినోద్ మిశ్రా గ్రూపు వంటి కొన్ని లిన్ పియావో వ్యతిరేక గ్రూపులు కూడా ఉన్నాయి. ఈ సంస్థ క్రమేపీ అందుకు భిన్నంగా తయారై, 1980ల ప్రారంభంలో పార్లమెంటరీ పంథాను చేపట్టింది. ఈ అతివాద దుస్సాహసిక గ్రూపులు పిడివాదంతో నిర్మూలనా ఎత్తుగడలను ఎత్తిపట్టాయి. సాయుధ పోరాటం తప్ప మరే ఇతర పోరాట, నిర్మాణ రూపాలనూ చేపట్ట నిరాకరించాయి. గత పొరపాటుల నుంచీ ఎటువంటి పాఠాలూ తీసుకో నిరాకరించాయి.

ఈ ధోరణిలో ఉన్న వారిలో చాలా మందిని శత్రువు చంపేసాడు. లేదా వారు నిర్లిప్తంగా అయిపోయారు. ఇక మిగిలిన వారు మొదటి, లేదా మూడో ధోరణిలో చేరారు.

మూడో ధోరణి, గతాన్ని మౌలికంగా మార్క్సిస్టు లెనినిస్టు దృష్టి నుంచీ క్రోడీకరించిన ఎంఎల్ శక్తులది. ఇది నక్సల్బరీ ఉద్యమంలోనూ భాకపా(మాలె) పంథాలోనూ ఉన్న అన్ని అనుకూల అంశాలనూ ఇముడ్చుకున్నది. అతివాద ఒంటెత్తుపోకడ ఎత్తుగడలను ఖండించింది. ప్రజా పంథాతో తీవ్ర విప్లవ ఆచరణలో నిమగ్నులయారు. కామ్రేడ్ కేఎస్ నేతృత్వంలో భాకపా(మాలె) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ, పంజాబ్ నుంచీ కా.శర్మ, పశ్చిమ బెంగాల్ నుంచీ

కా.సునీతీ కుమార్ ఘోష్, ఆ తరువాత భాకపా(మాలె)(పీయూ), మరి కొన్ని గ్రూపులూ ఈ ధోరణికి చెందుతాయి. ఇవన్నీ మూల భాకపా(మాలె)కు చెందినవి.

1972 తరువాత కాలంలో భారత విప్లవ రాజకీయాలలో చీలికలు, గ్రూపుల మధ్యనూ వ్యక్తుల మధ్యనూ ఐక్యతా ఒక ప్రత్యేక లక్షణంగా మారింది. మాలెమా సిద్ధాంతానికి సంబంధించి పిడివాదం, నిర్మాణపర వ్యవహారాలలో సంకుచిత ఒంటెత్తుపోకడ, నాయకత్వంలో అతివాద, లేదా మితవాద, పెటీ బూర్జువా అహంకారాల వల్ల ఏ రెండు గ్రూపులూ విప్లవ ఐక్యతను నిలబెట్టుకోలేకపోయాయి.

**వెనుకంజ, దాని గుణపాఠాల మదింపు**

1980ల తరువాత మన ఉద్యమాన్ని సమీక్షించి సముచితమైన గుణపాఠాలను రాబట్టే ముందు మనం తప్పనిసరిగా నక్సల్బరీ తిరుగుబాటు విజయాలు, లోపాలు, గుణపాఠాల గురించి, నక్సల్బరీ తరువాత దేశవ్యాప్తంగా వచ్చిన వెల్లువ గురించి, అటు తరువాత వచ్చిన వెనుకంజ గురించి మరోసారి గుర్తు చేసుకోవలసి ఉంటుంది. దీనిని మన *ఆత్మ విమర్శ నివేదిక (గతాన్ని సమీక్షించుకుందాం, సాయుధ పోరాట బాటలో విజయవంతంగా ముందుకు సాగుదాం)*లో సమీక్షించుకున్నాం. ఇది పార్టీ ఏర్పడిన నాటి నుంచీ1972 వరకూ పార్టీ చరిత్రకు సంబంధించిన ముఖ్య డాక్యుమెంటు. దీన్ని ఆంధ్ర రాష్ట్ర కమిటీ, అది సీఓసీలో ఉన్న కాలంలో 1974లో రాసింది. దీన్ని భాకపా(మాలె)(పీపుల్స్‌వార్) ఏర్పడిన సమయంలో 1980లో మరింత సుసంపన్నం చేసాం.

మహా వెల్లువకు ఉన్న అనుకూల విప్లవ సారాన్ని, కామ్రేడ్ సీఎం వహించిన గొప్ప నూతన పంథా పాత్రనూ, 8వ కాంగ్రెస్‌నూ *ఆత్మ విమర్శనా నివేదిక* సమర్థించింది. ఎత్తుగడలు, వ్యూహాన్ని అమలు చేయడంలో పని పద్ధతీ శైలిలను ఆత్మవిమర్శనాత్మకంగా అంచనా వేసింది.

మొత్తం మీద భారతదేశంలో విప్లవోద్యమాన్ని పునరుద్ధరించి, నిజమైన కమ్యూనిస్టు విప్లవకారుల పునరేకీకరణ చేయడంలో ఎస్‌సీఆర్ ముఖ్య పాత్ర వహించింది. మొట్టమొదటగా, పార్టీ గత అతివాద దుస్సాహసిక ధోరణి నుంచీ బయటకు రావడానికి సహాయపడింది. ఉద్యమాన్ని పునర్నిర్మించడానికి నూతన శక్తులను తయారు చేసుకుంది. పార్టీని సరైన పునాది మీద పునర్నిర్మించడానికి దోహదం చేసింది. రెండోది, ముఖ్యంగా మితవాద అవకాశవాదానికీ (వెనుకంజ కాలంలో ప్రబలంగా ఉన్నది), అలాగే అతివాద ఒంటెత్తువాదానికీ, వ్యతిరేకంగా జరిగిన చర్చకు దోహదం చేసింది. మూడోది, ఉద్యమ పునరుజ్జీవానికి సైద్ధాంతిక పునాదిని ఏర్పరచింది. నాలుగోది, గత కాలపు విజయాలను బలంగా ఎత్తిపట్టడం ద్వారా, విమర్శనాత్మకంగానే అయినా కమ్యూనిస్టు విప్లవకారుల పునరేకీకరణ క్రమాన్ని సుగమం చేసింది. చివరిగా, కామ్రేడ్ సీఎం పాత్ర గురించి సమతుల్యమైన వైఖరి తీసుకోవడంతో అది కమ్యూనిస్టు ఉద్యమంలో నాయకత్వ పాత్ర గురించిన హేతుబద్ధ అవగాహనకు దోహదం చేసింది.

### పార్టీని పునర్నిర్మించడానికి ప్రయత్నాలు

1972 మార్చి ప్రారంభానికి రాష్ట్ర కమిటీలో మిగిలి ఉన్న ముగ్గురు సభ్యులు (వీరిలో ఇద్దరు నవంబరులో అరెస్టయారు) నక్సల్బరీ కాలంలో జరిగిన పొరపాటులను దాని విప్లవ సారం నిలబెట్టడం ద్వారా సరిదిద్దాలని ప్రయత్నించారు. ప్రజా సంఘాలను నిర్మించాలనీ ప్రజల వర్గ పోరాటాలు చేపట్టాలనీ సాధ్యమయిన చోటనల్లా ప్రజా సంఘాల నిర్మాణం ద్వారా నూతన ప్రాంతాలకు విస్తరించాలనీ ఈ కమిటీ నిర్ణయించింది. వర్గ పోరాటంలో భాగంగా మాత్రమే వర్గ శత్రువుల నిర్మూలన చేయాలని కూడా ఇది నిర్ణయించింది.

1973 ఆగస్టులో పార్టీ విప్లవ శక్తులను సమీకరించడానికి పిలుపు పేరుతో రాజకీయ పత్రిక ప్రారంభించింది. జాతీయ అంతర్జాతీయ అంశాల మీద తన వైఖరిని తెలియజేయడమే కాకుండా ఈ పత్రిక భాకపా(మాలె) లోనూ ఏఐసీసీసీఆర్ బయటనూ మితవాద అవకాశవాదుల దాడులను తిప్పికొట్టడానికి సైద్ధాంతిక రాజకీయ పోరాటం నిర్వహించింది. సీఎం పంథాకు మద్దతు ఇవ్వడంలోనూ ఆనాడు ఉద్యమంలో ప్రబలంగా ఉన్న మితవాద అతివాద పెడధోరణులను తిప్పికొట్టడంలోనూ పిలుపు ముఖ్య పాత్ర వహించింది. ఉద్యమం సరైన పంథాలో ప్రయాణించడానికి దోహదం చేసింది. 1974 ఆగస్టులో కామ్రేడ్ కేఎస్ నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కమిటీని తిరిగి ఏర్పరిచారు. కేఎస్ నేతృత్వంలో ఉన్న ఏపీ పీసీ ఇతర రాష్ట్రాలలో ఉన్న కేంద్ర కమిటీ సభ్యులను కలవడానికి ప్రయత్నించింది. పంజాబ్‌కు చెందిన కా. శర్మ, బెంగాల్‌కు చెందిన కా.సునీతీ కుమార్ ఘోష్, బీహార్‌కు చెందిన కా.రామ్‌నాథ్‌లతో కూడిన కేంద్ర ఆర్గనైజింగు కమిటీలో చేరారు. గతాన్ని క్షుణ్ణంగా ఆత్మవిమర్శనాత్మకంగా అంచనా వేయడానికి, సాధ్యమయినంత వరకూ అన్ని చీలిక గ్రూపులనూ ఒకే ఏక పార్టీగా ఐక్యం చేయడానికీ ఆ తరువాత కాంగ్రెస్ నిర్వహించి కేంద్ర కమిటీని ఎన్నుకోవడానికీ సీఓసీ తీర్మానించింది. అయితే రాజకీయ విభేదాల వల్ల సీఓసీ ఒకే సంస్థగా ముందుకు రాలేకపోయింది. కేంద్రాన్ని పునర్సంఘటితం చేయడంలో ఈ మొదటి ప్రయత్నం విఫలం కావడంతో ఏపీ కామ్రేడ్స్ రాష్ట్రంలో బలమైన వ్యవసాయ విప్లవోద్యమాన్ని నిర్మించడం మీద కేంద్రీకరించారు.

### ప్రజాయుద్ధ పునరుజ్జీవనం, వ్యాప్తి (1977-2004)

1977 నుంచీ ఇరవై ఐదు సంవత్సరాల కాలంలో సాయుధ వ్యవసాయ విప్లవం ఆంధ్రప్రదేశ్, దండకారణ్యం, ఒరిస్సా, బీహార్-జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర మొదలయిన ప్రాంతాలకు వ్యాపించింది. ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమ కేంద్రం శ్రీకాకుళం నుంచీ ఉత్తర తెలంగాణాకు మారింది. ఈ కాలంలోనే భాకపా(మాలె)(పీపుల్స్‌వార్), భాకపా(మాలె)(పీయూ) ఏర్పాటయాయి. వాటి నాయకత్వంలో విప్లవోద్యమం పెరిగింది. భాకపా(మాలె) గ్రూపులు చాలా వరకూ సంస్కరణవాదంలోకో, పార్లమెంటరీ పార్టీలుగానో మితవాద అవకాశవాదంలోకో దిగజారిపోయాయి.

1972లో వెనుకంజను ఎదుర్కొని, సమగ్రంగా సమీక్షించి, గతం నుంచీ గుణపాఠాలు తీసుకున్న తరువాత, మాలెమా వెలుగులో, పార్టీ, ప్రధానంగా మునుపటి భాకపా(మాలె), భాకపా(మాలె)(పీయూ)ల నాయకత్వం కింద క్రమంగా తిరిగి బలాన్ని పుంజుకుంది. మొత్తం పార్టీ కొత్త అవగాహనతో ఎడ్యుకేట్ చేయబడి క్రమపద్ధతిలో పటిష్టపరచబడి విస్తరించింది. ఆ క్రమంలో అది మరి కొన్ని నిజమైన శక్తులతో ఐక్యతను పెంపొందించుకుని ఇంకా బలమైన కేంద్రాలను నెలకొల్పింది. పార్టీ ప్రభావం మెల్లమెల్లగా దేశంలో అనేక ప్రాంతాలలో పెరగసాగింది. అంతర్గతంగా కూడా, అది తల ఎత్తిన మితవాద అవకాశవాద పంథాలను ఓడించి సంక్షోభాలను అధిగమించగలిగింది. తద్వారా రాజకీయపరంగా, సిద్ధాంతపరంగా మరింత బలపడింది. విదేశాలలో సోదర పార్టీలతో సంబంధాలు పెంపొందించుకుని బాగా దృఢతరమయింది. అంతిమంగా భాకపా(మాలె)కు చెందిన రెండు ప్రధాన స్రవంతులు ఒక కేంద్ర కమిటీ ఉన్న ఒక ఉమ్మడి పార్టీని ఏర్పాటు చేస్తూ విలీనమయాయి. ఈ విలీనం సందర్భంలో ఇతర అనేక నిజమైన విప్లవకారులు కూడా ఈ క్రమంలో చేరారు.

ఈ రెండు దశాబ్దాల కాలంలో భూస్వామ్య వ్యతిరేక రైతాంగ సాయుధ పోరాటంలో కొత్త మలుపును తీసుకువస్తూ పార్టీ ప్రజా పునాది చెప్పుకోతగ్గంత అభివృద్ధి చెందింది. పార్టీ, విద్యార్థులు, యువజనులు, మహిళలు, దళితులు, మేధావులపై కూడా తన పలుకుబడిని విస్తరింపజేసుకుంది. అది ప్రచారం, ఆందోళన, పోరాటాల ద్వారా దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాన్ని కూడా ఇంకా పెంపు చేయగలిగింది. మొత్తం మీద పార్టీ ప్రజా పునాదిని పటిష్టం చేసుకుని కొత్త ప్రాంతాలకు విస్తరించింది.

**ఈ రెండు దశాబ్దాలలో విప్లవోద్యమం అనేకానేక మెలికలు, మలుపుల గుండా పురోగమించింది. దేశంలోనూ అంతర్జాతీయంగానూ ఉద్యమంలోనూ చోటు చేసుకున్న మార్పులను విశ్లేషిస్తూ పార్టీ తదనుగుణంగా ఎత్తుగడలను సవరించుకుంది. అంతర్జాతీయ కార్మిక వర్గ ఉద్యమంలో భాగంగా దేశంలో విప్లవోద్యమాన్ని పురోగమింపజేసింది.**

అన్నింటికంటే ముఖ్యంగా ఈ రెండు దశాబ్దాల కాలంలో, శత్రువు నుంచీ ఆయుధాలను గుంజుకుని తన్ను తాను సాయుధం చేసుకుంటూ సాయుధ గెరిల్లా దళాలను అభివృద్ధి చేసింది. సాయుధ నిర్మాణాలు క్రమంగా బలం పుంజుకున్నాయి. శత్రు దాడిని ఎదుర్కోగలిగాయి. తద్వారా ఈ మొత్తం కాలంలోనూ సాయుధ పోరాటాన్ని కొనసాగించగలిగాయి. దీని ద్వారా అది దేశంలో కొన్ని వ్యూహాత్మక ప్రాంతాలలో పీజీఏనూ ప్రజల అధికార అంగాల బీజ రూపాలనూ ఏర్పాటు చేయగలిగింది.

చివరగా, అది రివిజనిజం, నయా రివిజనిజాలకు వ్యతిరేకంగా సోవియట్ రకం, డెంగ్ రకం రెంటికీ వ్యతిరేకంగా పోరాడుతూ నిరంతరంగా సిద్ధాంత రాజకీయ పోరాటాన్ని నడిపింది. దేశంలో అన్ని రూపాలలో మితవాద అవకాశవాదానికీ ఎదురు నిలిచింది. మార్క్సిజం లెనినిజం

మావోయిజాన్ని, దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథానూ బహుళ ప్రాచుర్యంలోకి తెచ్చింది.

**మునుపటి పీపుల్స్‌వార్ పునస్సంఘటితీకరణ, అభివృద్ధి**

1970వ దశకంలో ఆంధ్ర రాష్ట్ర కమిటీలో పలు మార్పులు జరిగినప్పటికీ అది ఆత్మవిమర్శనా నివేదిక పై ఆధారపడుతూ పార్టీ కేడర్‌లను అతివాద దుస్సాహసిక వాదం నుంచీ బయటకు తీసుకురావడానికి తీవ్ర ప్రయత్నాలు చేసింది.

1977లో సీఓసీ పని చేయకుండా పోయిన తరువాత, ఆంధ్ర రాష్ట్ర కమిటీ ఇతర విప్లవ గ్రూపులతో ఏకం కావడానికి వెంటనే ప్రయత్నాలు చేయలేదు. చెప్పుకోతగ్గ ఉద్యమాన్ని నిర్మించకుండా కేవలం గత సమీక్ష పైనే ఆధారపడి ఏకీకరణకు ప్రయత్నాలు చేయడం నిష్ప్రయోజనమని గత అనుభవం రుజువు చేసింది. అందుకని, ఆత్మవిమర్శనా నివేదిక పునాదిగా, ఆంధ్రలో ఒక విస్తృత విప్లవోద్యమాన్ని నిర్మించడం పైననే ఆంధ్ర రాష్ట్ర కమిటీ కేంద్రీకరించింది. దీని ఫలితంగా అది విద్యార్థి యువజనులలోనూ, సాహిత్య, సాంస్కృతిక రంగాలలోనూ శక్తివంతమైన రాష్ట్ర వ్యాప్త ఉద్యమాలను నిర్మించగలిగింది. అంతేకాదు, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలలో రైతాంగ ఉద్యమాలను కూడా అభివృద్ధి చేసింది. వీటిని కేవలం ఆంధ్ర రాష్ట్రంలోనే కాక, దేశమంతటా కూడా శక్తివంతమైన భూస్వామ్య పోరాటాలుగా గుర్తించారు. ఆ తరువాత మాత్రమే ఆంధ్ర రాష్ట్ర కమిటీ విజయవంతంగా జరిగిన ఉద్యమ అభివృద్ధిని ఆధారం చేసుకుని ఐక్యతా చర్చలకు ప్రయత్నాలు చేసింది. ఉద్యమంలో వచ్చిన అభివృద్ధి, ఆత్మవిమర్శనా నివేదిక సవ్యతను రుజువు చేసింది. ఇక ఇది ఐక్యతా ప్రయత్నాలకు ప్రాతిపదికగా ఉంటుంది. అందుకని ఆత్మవిమర్శనా నివేదిక పైనా, రాబట్టిన గుణపాఠాల పైనా నిర్మించిన ఉద్యమం పైనా ఆధారపడుతూ పార్టీ యూనిటీ, భాకపా(మాలె), తమిళనాడు రాష్ట్ర కమిటీ వంటి ఇతర ఎంఎల్ గ్రూపులతో వారు కా.కే.ఎస్ నాయకత్వంలో ఆంధ్ర రాష్ట్ర కమిటీని సంప్రతించినప్పుడు ఐక్యతా ప్రయత్నాలు మొదలయాయి.

అందుకని, ఈ చారిత్రక తరుణంలో, ఒక వైపు నక్సల్బరీ తదితర ఉద్యమాల చారిత్రక ప్రాధాన్యతను, భాకపా(మాలె) ప్రాతినిధ్యం వహిస్తున్న పంథానూ తోసిపుచ్చుతూ అదే సమయంలో విప్లవకారులమని చెప్పుకుంటున్న రివిజనిస్టులు, మితవాద అవకాశవాదులను ఎండగట్టడం అన్నది సరైన విప్లవకారుల ప్రప్రథమ కర్తవ్యం అయింది. ఈ కాలమంతటా, సాయుధ పోరాటం మీదనూ పార్టీ పంథా మీదనూ కామ్రేడ్ సీఎం మీదనూ దాడిని కేంద్రీకరించిన ఎస్ఎన్ఎస్, కాను సన్యాల్, అసిం ఛటర్జీ, నాగభూషణ పట్నాయక్ మొదలయిన వారితో పార్టీ తీవ్ర రాజకీయ వివాదాలు నడిపింది.

**అతివాద, మితవాద ధోరణులు రెండింటితోనూ, ముఖ్యంగా మితవాద అవకాశవాద ధోరణితో పోరాడుతూ మనం మన పంథాను సుసంపన్నం చేసుకున్నాం. పార్టీ పంథాలో అనుకూల, ప్రతికూల అంశాల గురించి క్షుణ్ణంగా అంచనా వేసుకుని, మన ఆత్మ విమర్శనా**

**నివేదికలో క్రోడీకరించిన విధంగా తగిన పాఠాలు తీసుకున్న తరువాత మన ఎత్తుగడల పంథాలో సరైన ఎత్తుగడలను అభివృద్ధి చేసుకున్నాం.**

**తెలంగాణా ప్రాంతీయ మహాసభ**

1977 ఫిబ్రవరిలో, పార్టీ పంథా మీద చర్చను ముగించడానికీ విప్లవ మార్గాన్నీ ఆత్మవిమర్శనా డాక్యుమెంటులనూ రూపొందించుకోవడానికీ తెలంగాణా ప్రాంతీయ మహాసభ జరిగింది. ఈ మహాసభ మూడు ప్రధాన నిర్ణయాలు తీసుకుంది - 1. ప్రజలలో పార్టీ పునాదిని విస్తరించడం 2. పెద్ద ఎత్తున వస్తున్న నూతన కేడర్‌కు శిక్షణనివ్వడానికి వరుస రాజకీయ తరగతులు నిర్వహించడం 3. సాయుధ పోరాటం ప్రారంభించడానికి అడవిలోకి దళాలు పంపడం. అంతిమంగా తెలంగాణాలో హైదరాబాద్ మినహా ఎనిమిది జిల్లాలను రెండు రీజియన్‌లుగా విభజించి రెండు రీజినల్ కమిటీలను ఎన్నుకున్నారు.

**ఎత్తుగడలలో మార్పు - 1977 ఆగస్టు తీర్మానం**

1977 మార్చిలో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఫాసిస్టు ఇందిర ఘోర పరాజయం పాలయింది. జనతా పార్టీ అధికారంలోకి వచ్చింది. ఎమర్జెన్సీని ఎత్తేసింది. జనతా పార్టీ ఎమర్జెన్సీని వ్యతిరేకిస్తూ, ప్రజాస్వామిక హక్కుల కోసం ఎన్నికల్లో ప్రచారం చేస్తూ అధికారంలోకి వచ్చింది. అనేకమంది విప్లవకారులను బెయిల్ మీద విడుదల చేసింది. పార్టీ మీద నిషేధం ఎత్తేసింది. మారిన పరిస్థితిని సద్వినియోగపరచుకోవడానికీ, 1977 జనవరిలో జరిగిన తెలంగాణా మొదటి మహాసభ తీర్మానాల అమలు కోసం, ఎత్తుగడలను మారుస్తూ ***ప్రస్తుత రాజకీయ పరిస్థితి, మన కర్తవ్యాలు*** అనే డాక్యుమెంటును తయారు చేసాం. ***ఆగస్టు తీర్మానం***గా పేరొందిన ఈ డాక్యుమెంటును వివిధ జిల్లాలలో విస్తృత చర్చల తరువాత ఆమోదించాం. అది పార్టీ కార్యకలాపాలకు మార్గదర్శకత్వం అందించింది.

అయితే ఆగస్టు తీర్మానంలో సాయుధ పోరాట తాత్కాలిక నిలిపివేత అన్న మాట వాడడం పొరపాటు. ఇది పార్టీలోనూ మాలె శిబిరంలోనూ అనవసరపు భయాలనూ గందరగోళాన్నీ సృష్టించింది.

మారిన ఎత్తుగడలకు అనుగుణంగా రాష్ట్ర కమిటీ ***క్రాంతి*** అనే పక్ష పత్రికను తన అధికార పత్రికగా ఆరంభించి, విప్లవ సాహిత్యాన్ని బహిరంగంగా ప్రచురించనారంభించింది. *రాడికల్ మార్చ్* పత్రికను, ఆర్ఎస్‌యూ, ఆర్‌వైఎల్‌ల అధికార మాసపత్రికగా లీగల్‌గా ప్రచురించింది. ఈ పత్రికలు పార్టీ శ్రేణులు, విద్యార్థి యువజనులను రాజకీయంగా ఎడ్యుకేట్ చేయడంలో ఒక కీలక పాత్ర పోషించాయి.

రాడికల్ అన్న పదం విప్లవకారులకు మరో పేరయింది. ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్, గ్రామాలకు తరలండి క్యాంపెయిన్ లను ఆర్ఎస్‌యూ, ఆర్‌వైఎల్‌లు విస్తృతంగా చేపట్టాయి.

ఇవి గ్రామీణ పేదలతో సమైక్యం కావడానికీ నూతన ప్రజాస్వామిక విప్లవం, దాని ఇరుసైన సాయుధ వ్యవసాయ విప్లవ రాజకీయాలను ప్రచారం చేయడానికీ దోహదం చేసాయి. 1978లో మొదటి క్యాంపెయిన్‌లో 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. 1984 నాటికి ఈ సంఖ్య 1100కు పెరిగింది. ఈ విద్యార్థులూ కార్మికులూ 150 ప్రచార బృందాలుగా 2419 గ్రామాలలో వ్యవసాయ విప్లవ రాజకీయాలను ప్రచారం చేసారు.

ఆంధ్రప్రదేశ్ విప్లవ విద్యార్థి ఉద్యమం వేగంగా పెరగడం, విద్యార్థులూ యువతా రాడికలీకరణ చెందడం, గ్రామీణ రైతాంగ ప్రజలతో మమేకం కావడం పాలక వర్గాలను వణికించింది. ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఇరవై ఒక్క జిల్లాలలో పద్ధెనిమిది జిల్లాలకు ఆర్‌ఎస్‌యూ వ్యాపించింది. విద్యార్థుల వివిధ సమస్యల మీద రాష్ట్ర వ్యాప్త సమ్మెలు నిర్వహించింది. రాష్ట్రంలో అనేక కళాశాలలలో విద్యార్థి సంఘాలలో గెలిచింది. సామ్రాజ్యవాదానికీ యుద్ధానికీ మతోన్మాదానికీ కార్మికవర్గానికీ రైతాంగానికీ జాతుల ఉద్యమాలకూ మద్దతుగానూ రాజకీయ ఉద్యమాలు నిర్వహించింది. ఎన్నికల బహిష్కరణ క్యాంపెయిన్‌లలో చురుకుగా పాల్గొంది. ఏఐఆర్‌ఎస్‌ఎఫ్ ఏర్పాటుకు చొరవ చేసింది. 1985 ప్రారంభానికల్లా పాలక వర్గాలు విద్యార్థి, యువజన సంఘాల మీదనూ రైతాంగ కార్మికవర్గ ఉద్యమం మీదనూ పూర్తి స్థాయిలో దాడి ప్రారంభించాయి. ఆనాటి నుంచీ ప్రజా సంఘాలు పూర్తిగా రహస్యంగా పని చేయనారంభించాయి.

కార్మికవర్గం, రైతాంగం, విద్యార్థి, యువజన రంగాల పోరాటాల వెల్లువనూ సాంస్కృతిక సాహిత్య సంస్థల భారీ క్యాంపెయిన్‌లనూ రాష్ట్రమంతటా తీసుకువచ్చి పార్టీ ఎమర్జెన్సీ తరువాత కాలాన్ని వినియోగించుకుంది. ఎమర్జెన్సీకి ముందూ అది ఎత్తివేసిన వెంటనేనూ పౌరహక్కుల ఉద్యమం కూడా పుంజుకుంది. వివిధ సెక్షన్ ప్రజలలో విప్లవ ప్రజా పునాదిని సంఘటితం చేసి విస్తరించడం ద్వారా విప్లవోద్యమాన్ని పునరుద్ధరించడానికీ మరింత పై స్థాయిలో సాయుధ పోరాటానికి సన్నాహాలు చేయడానికీ ఈ కాలంలో పార్టీ చేపట్టిన ఎత్తుగడలు ఎంతగానో దోహదం చేసాయి. బహిరంగ, రహస్య పోరాట రూపాలనూ నిర్మాణాలనూ పార్టీ సమర్థవంతంగా జోడించింది. తన రహస్య స్వరూపాన్ని జాగ్రత్తగా కాపాడుకుంది. లీగల్ సెమీ లీగల్ రహస్య ప్రజా సంఘాల ద్వారానూ శత్రు ఎత్తుగడలను బట్టి వీటి జోడింపు ద్వారానూ పార్టీ బహిరంగ అజ్ఞాత ప్రజా కార్యకలాపాలను సంఘటితం చేసింది.

**కరీంనగర్, ఆదిలాబాద్ పోరాటాల విస్ఫోటనం**

1978 జూన్‌లో జగిత్యాల రైతాంగ పోరాటం పెను తుఫానులా పెల్లుబికింది. మూడు నెలల కాలంలోనే ప్రభుత్వం పాశవిక దమనకాండను చేపట్టి, జగిత్యాల, సిరిసిల్లా తాలూకాలను కల్లోల ప్రాంతాలుగా ప్రకటించింది. ఆంధ్ర రాష్ట్ర కమిటీ నిర్బంధకాండ నడుమనే ఈ పోరాటాలను విస్తరింపజేయడానికి సవివరమైన పథకం తయారు చేసింది. దాని ఫలితంగా స్వల్ప కాల వ్యవధిలోనే కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎల్లెడలా రైతాంగ పోరాటాలు చెలరేగాయి.

1979 చివరి నాటికి, విద్యార్థి, యువజన, కార్మిక, రైతాంగ, సాహిత్య రంగాలలో పార్టీ కృషి రాష్ట్రంలో నలుమూలలకూ పాకింది. 1972 ఫిబ్రవరి, మార్చి నెలల్లో జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశ తీర్మానాలు, 1974 నాటి ఆత్మ విమర్శనా నివేదిక, 1977 జనవరిలో జరిగిన తెలంగాణా మొదటి ప్రాంతీయ మహాసభ, ఆగస్టు 1977 తీర్మానాల ద్వారా పార్టీని అతివాద దుస్సాహసిక పంథా నుంచీ సరైన విప్లవ పంథాలోకి మార్చడానికి చేసిన సుదీర్ఘ ప్రయత్నాల ఫలితంగానే కరీంనగర్, ఆదిలాబాద్ రైతాంగ పోరాటాల వెల్లువ పెల్లుబికింది.

1979 చివరి నాటికి, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం జిల్లాలను బేస్ ఏరియాలు అభివృద్ధి చేసే లక్ష్యంతో గెరిల్లా జోన్‌గా అభివృద్ధి చేసి, దీర్ఘకాల ప్రజాయుద్ధానికి పునాదులు వేయడం ఒక తక్షణ కర్తవ్యంగా పార్టీ ముందుకు వచ్చింది. ఆంధ్రలో ఉద్యమం నాలుగు స్థాయిల్లో ఉన్నది - 1. పై నాలుగు జిల్లాలలో రైతాంగ పోరాటాలను ఆర్గనైజ్ చేసి, వాటిని గెరిల్లా జోన్‌గా మార్చాలి 2. తెలంగాణాలో మిగతా జిల్లాలు, రాయలసీమ ప్రాంతాల్లో భూస్వామ్య వ్యతిరేక పోరాటం అప్పటికే మొదలయింది 3. సామాజిక ఆర్థిక పరిస్థితులు భిన్నంగా ఉన్న దక్షిణ కోస్తా జిల్లాలలో లీగల్ అవకాశాలను ఉపయోగించుకుని ప్రచార కార్యక్రమాలూ, వ్యవసాయ కూలీలూ పేద రైతాంగంలో పనీ చేపట్టాయి. 4. దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథా వ్యూహానికి అనుగుణంగా పట్టణాలు నగరాలలో పని మొదలయింది.

**పీపుల్స్‌వార్ పార్టీ ఏర్పాటు**

భాకపా(మాలె)(పీపుల్స్‌వార్)ను, ఆంధ్ర రాష్ట్ర కమిటీని, తమిళనాడు రాష్ట్ర కమిటీని విలీనం చేయడం ద్వారా 1980 ఏప్రిల్ 22న ఏర్పాటయింది. ఆ తరువాత మే నెలలో మహారాష్ట్రలో ఒక నిజమైన విప్లవ శక్తుల గ్రూపు భాకపా(మాలె)(పీపుల్స్‌వార్)లో చేరింది. పార్టీకి అప్పుడు కర్నాటకలో కొద్దిమంది సభ్యులుండేవారు. ఈ రాష్ట్రాలలో ఆ సమయానికి పార్టీ స్థితి ఇలా ఉండింది.

తమిళనాడులో ఉద్యమం, తమిళనాడు రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా 1969 డిసెంబరులో ఎన్నికయిన కామ్రేడ్ అప్పు ఆ తరువాత ఒక సంవత్సర కాలానికే అమరుడయాడు. ఆ తరువాత (కా.అప్పు 8వ కాంగ్రెస్‌లో సీసీఎంగా కూడా ఎన్నికయాడు) పలువురు నాయకులు అరెస్టవడం నష్టపోవడం వల్ల అక్కడి ఉద్యమం అభివృద్ధి కాలేదు. తమిళనాడు రాష్ట్ర కమిటీ 1969 డిసెంబరులో జరిగిన రాష్ట్ర మహాసభ నుంచీ 1980 వరకూ, ఈ మధ్య కాలానికి సంబంధించిన ఉద్యమ సమీక్ష ఏదీ చేయలేదు.

1970 దశకం కాలంలో తమిళనాడులో పార్టీ నాలుగు గ్రూపులుగా చీలిపోయింది. ఒక ముఠా వినోద్ మిశ్రా గ్రూపులో చేరింది. మరొకటి ఎస్.ఎన్.ఎస్. పంథాననుసరించింది. మూడో గ్రూపు సీఎం పంథాను అనుసరించింది. ఈ గ్రూపు 1979 నాటికి ప్రజాసంఘాల ఆవశ్యకతను కొంత మేరకు గుర్తించింది. అయితే అది ప్రధానంగా ఒంటెత్తు పోకడ దృక్పథాన్నే

అనుసరించింది. ఈ గ్రూపు 1977లో మరోసారి చీలింది. ఒక ముఠా కా.కన్నమణిని అనుసరించగా, రెండోది కా.మాణిక్యం నాయకత్వం కింద సమీకృతమయింది. ఈ రెండో గ్రూపు 1980 ఏప్రిల్‌లో పీపుల్స్‌వార్ పార్టీని ఏర్పరుస్తూ ఆంధ్ర రాష్ట్ర కమిటీతో ఏకమయింది. పీపుల్స్‌వార్ పార్టీ ఏర్పాటైన సమయంలో తమిళనాడులో పార్టీ శ్రేణుల, ప్రజల విశ్వాసాన్ని చూరగొనగలిగిన నాయకత్వమేదీ లేదు.

మహారాష్ట్రలో నక్సల్బరీ, శ్రీకాకుళం పోరాటాల పట్ల ఆకర్షితులయిన కొందరు కామ్రేడ్స్ ఏకం కావడంతో 1972లో కొన్ని పార్టీ యూనిట్‌లు ఏర్పడ్డాయి. 1975లో మహారాష్ట్ర నాయకత్వం ఎస్ఎన్ఎస్-సీపీఆర్ విలీనంలో పాల్గొనడంతో దాన్ని వ్యతిరేకించిన కొందరు కామ్రేడ్స్ ఒక విడి యూనిట్‌ను ఏర్పరచుకున్నారు. కరీంనగర్-ఆదిలాబాద్ పోరాటాల వల్ల ప్రభావితమైన ఈ యూనిట్‌కు ఆంధ్ర రాష్ట్ర కమిటీతో సంబంధాలు ఏర్పడి పీపుల్స్‌వార్‌లో చేరింది. 1980 జూన్‌లో బాంబే నగర మహాసభ జరుపుకుంది. ఈ సభ పార్టీ మౌలిక డాక్యుమెంటులను ఆమోదించింది. 1980లో పీపుల్స్‌వార్ ఏర్పాటు తరువాత ఉద్యమం తెలంగాణా అంతటానూ, ఉత్తరాంధ్రలోనూ, దండకారణ్యానికి విస్తరించింది.

**విముక్తి ప్రాంతాలలో భాగంగా గెరిల్లా జోన్‌ల నిర్మాణానికి పర్స్‌పెక్టివ్**

మునుపటి పీపుల్స్‌వార్, గ్రామీణ ప్రాంతాల్లో తన పనిని, వెనుకబడిన ప్రాంతమైన ఉత్తర తెలంగాణాను గెరిల్లా జోన్‌గా పరివర్తన చెందించడం, దాని సరసనే ఉన్న దండకారణ్య ప్రాంతాన్ని సాయుధ పోరాటాన్ని ఉధృతం చేసే క్రమంలో విముక్తి ప్రాంతంగా పరివర్తన చెందించే లక్ష్యంతో, ఆ ప్రాంతాన్ని వెనుకతట్టు ప్రాంతంగా అభివృద్ధి చేయడం అనే నిర్దిష్ట ప్రణాళికతోనే మొదలుపెట్టింది. అటువంటి పర్స్‌పెక్టివ్‌ను కా.కేఎస్ నాయకత్వంలో ఆంధ్ర రాష్ట్ర కమిటీ పెరుగుతున్న నిర్బంధాన్ని దృష్టిలో ఉంచుకుని 1980లోనే రూపొందించింది.

వాస్తవానికి, రైతాంగ పోరాటాలు ప్రారంభమయిన కొద్ది నెలల కాలంలోనే, అంటే 1978 సెప్టెంబరులోనే రాజ్య నిర్బంధం మొదలయింది. జగిత్యాల, సిరిసిల్ల తాలూకాలను కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించారు. పెద్ద ఎత్తున పోలీసు క్యాంపులు పెట్టసాగారు. శత్రు సాయుధ బలగాలు పెద్ద ఎత్తున దాడికి పూనుకునే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని, పార్టీ మొదట జగిత్యాల పర్స్‌పెక్టివ్‌ను రూపొందించింది. ఎన్‌టీనీ డీకేనీ బేస్ ఏరియాలు నెలకొల్పే లక్ష్యంతో గెరిల్లాజోన్‌లుగా మార్చడానికి ఒక నిర్దిష్ట పథకాన్ని తీసుకువచ్చింది. పార్టీ గెరిల్లా జోన్ పర్స్‌పెక్టివ్ రూపొందించింది. దానిని నిజమైన చిత్తశుద్ధితో అమలు చేయసాగింది. తదనుగుణంగానే, ఉత్తర తెలంగాణా, ఆంధ్రలో తూర్పు కనుమలు, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్ సరిహద్దు (ఇప్పుడు ఈ ప్రాంతం చత్తీస్‌ఘడ్ అయింది)లకు సాయుధ రైతాంగ దళాలను పంపాం. క్రమంగా ఒక ప్రణాళికకు అనుగుణంగానే దండకారణ్యంలో విశాలమైన ప్రజా పునాది నిర్మితమయింది. 1987 ఫిబ్రవరిలో ఆంధ్రలో ఆదిలాబాద్, ఈస్ట్ డివిజన్ (విశాఖపట్నం, తూర్పు గోదావరి

జిల్లాలు), మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలలో భాగాలను కలిపి ఒక ప్రత్యేక ఫారెస్టు కమిటీ ఏర్పాటయింది.

ఈ పర్స్పెక్టివ్, పై కమిటీల నిర్దిష్ట ప్రణాళిక, నిరంతర కృషి, ప్రత్యక్ష నాయకత్వ పాత్రల వల్లనే మనం సాయుధ పోరాటాన్ని విశాలమైన కంటిగ్యుయస్ ప్రాంతానికి విస్తరింపజేయగలిగాం. ఉత్తర తెలంగాణా, దండకారణ్యం, ఏఓబీ ప్రాంతంలో ఒక క్రమంలోనే మూడు గెరిల్లా జోన్లను నిర్మించగలిగాం. ఇది ఇతర రీజియన్లలో రాష్ట్రాలలో పోరాటాల పై అపార ప్రభావాన్ని చూపింది. సాయుధ పోరాటం దక్షిణ తెలంగాణా ప్రాంతానికి, రాయలసీమకు, అటు తరువాత దక్షిణ కోస్తా జిల్లాలలో కొన్ని వెనుకబడిన పాకెట్లకు పాకింది. 2001లో తొమ్మిదో కాంగ్రెస్ నాటికి ఆంధ్రలో దక్షిణ తెలంగాణా, నల్లమల రీజియన్లలో కూడా గెరిల్లా జోన్లు ఉనికిలోకి వచ్చాయి. బేస్ ఏరియాలు నెలకొల్పే లక్ష్యంతో ఎన్టీ, డీకేల కోసం అభివృద్ధి పరిచిన గెరిల్లా జోన్ ప్రణాళిక మునుపటి పీపుల్స్వార్ నాయకత్వంలో భారత విప్లవోద్యమంలో ఒక మూలమలుపుగా నిలిచింది.

**పార్టీలో రెండు ప్రధాన ఆంతరంగిక సంక్షోభాలు**

పీపుల్స్వార్ ఏర్పడిన నాలుగేళ్ల అనంతరం కేంద్ర కమిటీలో ఒక సంక్షోభం మొదలయింది. వాస్తవానికి 1980 ఏప్రిల్లో కేంద్ర కమిటీ ఏర్పాటు తరువాత ఒక సంవత్సర కాలం లోపునే 9వ కాంగ్రెస్ నిర్వహించాలని నిర్ణయించుకున్నాం. అయితే టీఎన్ నుంచీ కేంద్ర కమిటీ సభ్యులయిన వీరాస్వామి, మాణిక్యంలు రాష్ట్ర పీఓఆర్ను రాసి ఆ రాష్ట్ర మహాసభను నిర్వహించడంలో ఉద్దేశపూర్వకంగానే జాగు చేయడంతో కాంగ్రెస్ వాయిదా పడింది. 1984 మేలో జరిగిన సీసీ సమావేశంలో అంతర్జాతీయ పరిస్థితులలో మార్పుల కారణంగా ఒక రాజకీయ తీర్మానాన్ని ఆమోదించిన తరువాత, 1985 సంవత్సరం మొదటి మూడు నెలల్లో కాంగ్రెస్ జరపాలని నిర్ణయమయింది. అయితే 1985 తొలినాళ్లల్లో సత్యమూర్తి, (ఎస్ఎం) వీరాస్వామిల నాయకత్వంలో అవకాశవాద ముఠా పార్టీలో సంక్షోభం సృష్టించడంతో, కాంగ్రెస్ జరగలేదు. తద్వారా, 1980 ఏప్రిల్లో ఏర్పాటయిన 1985 వరకూ పని చేసిన మునుపటి పీపుల్స్వార్ మొదటి కేంద్ర కమిటీ 1985-87 కాలంలో సంక్షోభ సమయంలో కాళ్లు చేతులు ఆడని స్థితిలో ఉన్నది. చివరకి 1987లో తనను తాను రద్దు చేసుకుంది.

ఈ సంక్షోభానికి ప్రధాన కారణాలను, ఉద్యమం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంతో ముడిపెట్టి చూడవలసి ఉంటుంది. ఉద్యమం ఆనాడు సాయుధ పోరాటాన్ని ఇంకా పురోగమింపజేయడానికి చేపట్టవలసిన ఎత్తుగడలకు సంబంధించిన పలు ప్రశ్నలను ఎదుర్కొంటోంది. పార్టీ నాయకత్వం ఈ ప్రశ్నలకు సరైన పరిష్కారాలను కనుగొనగలిగే స్థితిలో లేదు. కేంద్ర నాయకత్వంలో ఒక సెక్షన్ ఈ సమస్యల పరిష్కారాన్ని శ్రద్ధగా చేపట్టడం కాక, కుట్రపద్ధతుల ద్వారా 1985లో పార్టీలో సంక్షోభం సృష్టించారు. ఉద్యమాన్ని పురోగమింపజేయడంలో

తమ లోపాలను కప్పి పుచ్చుకోవడానికి, తమ వైఫల్యాల పై ఆత్మవిమర్శ చేసుకోవడానికీ తమని సిద్ధం చేసుకోక సీసీలో సత్యమూర్తి - వీరాస్వామి ముఠా, అతివాద పదజాలం ముసుగులో వాస్తవానికి మితవాద సారాంశం ఉన్న ప్రత్యామ్నాయ పంథాను ప్రవేశపెట్టారు. అయితే ఈ లిక్విడేషనిస్టు అవకాశవాద ముఠా అనుసరించిన పార్టీ వ్యతిరేక పద్ధతులు, వారి పంథాకు వ్యతిరేకంగా సమగ్రమైన రెండు పంథాల మధ్య పోరాటం జరగకుండా అడ్డుకున్నాయి. మూడు సంవత్సరాల పాటు ఏపీ, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్రలలో నాలుగు రాష్ట్ర యూనిట్‌లూ కేంద్ర నాయకత్వం లేకుండా విడిగా పని చేసిన తరువాత 1990 ఆగస్టు కేంద్ర ప్లీనంలో నూతన కేంద్రంగా సీఓసీ ఎన్నికయింది.

అయితే, అవకాశవాద కేఎస్, బండయ్య ముఠా మూలంగా పార్టీలో 1991 మధ్య కాలంలో మళ్లీ సంక్షోభం మొదలయింది. ఈ ముఠా తగు ఎత్తుగడలను చేపట్టడం ద్వారా ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్లలేకపోయింది. కేఎస్, బండయ్య ముఠా తమ వైఫల్యాలను కప్పిపుచ్చి, కొన్ని సమస్యల పై తమ స్వీయాత్మక అంచనాను, మితవాద అవకాశవాద ఎత్తుగడలను పార్టీ పై రుద్దడానికై అరాచకవాద, అతి ప్రజాస్వామిక పద్ధతులకు దిగింది. పార్టీని చీల్చడానికి శాయశక్తులా కృషి చేసింది. ఈ ముఠాకు వ్యతిరేకంగా సూత్రబద్ధ పోరాటం జరపడం కోసం, వేళ్ల మీద లెక్కించగలిగిన అవకాశవాదులు మినహా యావత్తు పార్టీ సమైక్యంగా నిలబడింది. ఆ ముఠా పన్నిన విచ్ఛిన్నకర పన్నాగాలను ఓడించింది. ఈ సంక్షోభం ఇంచుమించుగా ఒక సంవత్సర కాలం, ఈ ముఠాను 1992 జూన్‌లో పార్టీ నుంచీ బహిష్కరించే వరకూ కొనసాగింది.

పార్టీలో రెండో ఆంతరంగిక సంక్షోభం, దానితో పోరాడడానికి చేపట్టిన పద్ధతులు గొప్ప ఎడ్యుకేషన్ క్యాంపెయిన్‌లా ఉపకరించాయి. పార్టీ పని శైలిని సరిదిద్దాయి. కేంద్ర కమిటీలో సమిష్టి నాయకత్వాన్ని టీం ఫంక్షనింగునూ అభివృద్ధి చేసాయి. అన్ని పార్టీ కమిటీల కార్యకలాపాలు కేంద్రీకృత ప్రజాస్వామ్యం పై ఆధారపడి నడిచేలా, ఫంక్షనింగును బలపరిచాయి. అది మొత్తం పార్టీ సిద్ధాంత రాజకీయ స్థాయిని పెంపు చేసింది, కొత్త కర్తవ్యాలను రూపొందించింది.

ఒక్క మాటలో చెప్పాలంటే, మునుపటి పీపుల్స్‌వార్ రెండు ప్రధాన అంతర్గత సంక్షోభాలను చవి చూసింది. ఒకటి 1985-87లో, రెండోది 1991-92లో. రెండు సమయాల్లోనూ పార్టీ శ్రేణులు అప్పటి సీసీ కార్యదర్శుల నాయకత్వంలో అవకాశవాద ముఠాలకు వ్యతిరేకంగా పోరాడారు. ఆ ముఠాల విచ్ఛిన్నకర పన్నాగాలను ఓడించారు. దృఢంగా సమైక్యంగా నిలబడ్డారు. రెండు సందర్భాలలోనూ, పార్టీ తీవ్ర శత్రు దమనకాండలను ఎదుర్కోవడంలో విజయం సాధించింది. అంతకు ముందు కంటే మరింత బలం పుంజుకుంది. పార్టీ కేడర్‌లకు అందజేసిన రాజకీయ బోధనా, బలహీనతలకూ పెడ ధోరణులకూ వ్యతిరేకంగా పార్టీలో చేపట్టిన దిద్దుబాటు క్యాంపెయిన్‌లు, పార్టీ శ్రేణుల ఉన్నత స్థాయి విప్లవ విధేయత, సాయుధ పోరాటానికి వారు దృఢంగా కట్టుబడి ఉండడం, వీటి వల్లనే ఇది సాధ్యమయింది.

ఉదాహరణకు, అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా ఎడతెగని పోరాటం సాగుతూనే ఉంది. 1981లో పెత్తందారీతత్వానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం, 1984లో అవకాశవాద కూటములు, పెత్తందారీతత్వం, లీగలిజం, టెక్ నియమాల ఉల్లంఘనలు, విచ్చలవిడి ఖర్చులు, మహిళా కామ్రేడ్స్ పట్ల తప్పుగా ప్రవర్తించడం అనే ఆరు చెడులకు వ్యతిరేక పోరాటం వంటి పోరాటాలు ఇందుకు నిదర్శనలు. ఆంధ్ర రాష్ట్రంలో 1984-87 మధ్య కాలంలో ఆరు చెడులకు వ్యతిరేకంగా దిద్దుబాటు ఉద్యమం నడిచింది. ఈ దిద్దుబాటు ఉద్యమంలో భాగంగా మొత్తం పార్టీ కేడర్‌లకు పార్టీ చరిత్ర నుంచీ నేర్చుకుని, ఆరు చెడులను దిద్దుబాటు చేసుకోవడం కోసం చరిత్ర పై రాజకీయ తరగతులు, చర్చా గోష్టులు నిర్వహించారు. పార్టీ చరిత్రకు సంబంధించి డాక్యుమెంటులను ఐదు సంపుటాలుగా ప్రచురించారు. ఆంధ్రలోనూ డీకేలోనూ మొత్తం పార్టీ అంతటా ఈ ఎడ్యుకేషన్‌ను అందించారు.

**పార్టీ రాజకీయ సైనిక పంథా అభివృద్ధి**

సీపీఐ, సీపీఎం పార్టీల రివిజనిస్టు పంథాలో ఒక నిరంతర రాజీ లేని వివాదం (పొలిమికల్ స్ట్రగుల్) ఫలితంగానూ నక్సల్బరీ శ్రీకాకుళం మొదలయిన సాయుధ తిరుగుబాటుల రూపం తీసుకున్న నిర్దిష్ట వర్గ పోరాటం నుంచీనూ భాకపా(మాలె) రాజకీయ సైనిక పంథా రూపొందించింది. పాత రివిజనిస్టు పంథాతో పూర్తిగా తెగతెంపులు చేసుకోవడం ద్వారా మాత్రమే నూతన విప్లవ పంథా ఆవిర్భవించింది. దేశంలో వివిధ ప్రాంతాలలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధం పెంపొందే సుదీర్ఘ క్రమంలో ఈ పంథా మరింత సుసంపన్నమయింది. వర్గ పోరాటం, సాయుధ పోరాటం, వివిధ రకాల రివిజనిజంతోనూ విప్లవోద్యమంలో మితవాదం, అతివాద ధోరణులతో చేసిన రాజకీయ వివాదాలు, ఆటుపోటులూ వెనకడుగులూ ముందడుగుల అనుభవాల సంశ్లేషణతో ఈ పంథా రూపొందింది. ఒక్క మాటలో చెప్పాలంటే తొమ్మిదో కాంగ్రెస్‌తో సుసంపన్నమయిన మన పార్టీ ప్రస్తుత పంథా మౌలికంగా 1970లో పార్టీ ఎనిమిదో కాంగ్రెస్ అవలంబించినదే. దేశంలో మూడున్నర దశాబ్దాల పాటు జరిగిన సాయుధ పోరాటం ద్వారా ఇది నిరంతరం పెంపొందింది. విప్లవంలో మూడు అద్భుత ఆయుధాలయిన కార్మికవర్గ పార్టీ, ప్రజా సైన్యం, విప్లవకర ఐక్య సంఘటనలను మలచడంతో ఇది ముడిపడి ఉంది.

ఎప్పటికప్పుడు వివిధ మహాసభలూ ప్లీనాలూ ప్రత్యేక సమావేశాలూ కమిటీ సమావేశాలూ అనుభవాలను నిరంతరం క్రోడీకరిస్తూ వచ్చాయి. ఉద్యమంలో అనుకూల అంశాలను కలుపుకుంటూ ప్రతికూల అంశాలను నిరాకరిస్తూ వచ్చింది. తగిన పాఠాలు తీసుకుంటూ వచ్చింది. వీటిల్లో ముఖ్యమైనవి - 1977లో మొదటి తెలంగాణా రీజినల్ మహాసభ, 1980లో ఆంధ్రప్రదేశ్ పన్నెండో రాష్ట్ర మహాసభ, 1987లో పదమూడో రాష్ట్ర మహాసభ, 1995లో మునుపటి పీపుల్స్‌వార్ అఖిల భారత ప్రత్యేక మహాసభ, 1987, 1993, 1997లలో మునుపటి పీయూ కేంద్ర మహాసభలు.

సుదీర్ఘ విప్లవాచరణ క్రమంలో నూతన పరిస్థితి ఎదురైనప్పుడల్లా మనం నూతన ఎత్తుగడలు రూపొందించుకున్నాం. ఎప్పటికప్పుడు మన ఆచరణ నుంచీ క్రోడీకరించుకుంటున్నాం. పార్టీ మహాసభలూ కాంగ్రెస్‌లలో మన మౌలిక డాక్యుమెంటులను సుసంపన్నం చేసుకుంటున్నాం. ఎనిమిదో కాంగ్రెస్ తరువాత మనం అనేక ముఖ్యమైన డాక్యుమెంటులు తయారు చేసాం. అవి - ప్రస్తుత పరిస్థితి మన ఎత్తుగడలు (1977 ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ ఆగస్టు తీర్మానం), 1980 నాటి ఆత్మవిమర్శనా రిపోర్టు, 1980 నాటి ఓటీఎల్, 1978 నాటి జగిత్యాల పర్స్‌పెక్టివ్, 1980 నాటి గెరిల్లా జోన్ పర్స్‌పెక్టివ్, 1980 నాటి ఏపీపీఓఆర్, 1983నాటి సీపీసీ మీద సీసీ తీర్మానం, 1980, 84, 92ల నాటి రాజకీయ తీర్మానాలు, 1995 నాటి ఏఐఎస్‌సీ డాక్యుమెంటులూ, 1985లో సీసీలో రెండు పంథాల మధ్య పోరాటం గురించిన డాక్యుమెంటులూ, సీసీ, రాష్ట్ర కమిటీలూ ఎప్పటికప్పుడు జారీ చేస్తున్న అనేక సర్క్యులర్‌లూ. ఇవి కాక, దిద్దుబాటు, బోధనా క్యాంపెయిన్‌లో భాగంగా ఐదు సంపుటాలలో పార్టీ డాక్యుమెంటులూ తీసుకువచ్చాం. పీపుల్స్‌వార్ మొదలయిన పత్రికలలో అనేక వాదోపవాదాలూ ముఖ్యమైన దాడులూ ప్రచురించాం. వీటన్నింటితో మన పార్టీ పంథాను పెంపొందించాం. సైద్ధాంతిక రాజకీయ నిర్మాణ సైనిక స్థాయిని మెరుగుపరచడానికి కృషి చేసాం.

కామ్రేడ్ సీఎం ఎనిమిది డాక్యుమెంటులలో రాజకీయ పంథా సారాన్ని అభివృద్ధి చేసాడు. దీనిని ఎనిమిదో కాంగ్రెస్ అవలంబించింది. అయితే పార్టీ కార్యక్రమం, వ్యూహం సరిగా ఉన్నప్పటికీ ఎత్తుగడలకు సంబంధించిన తీవ్ర పెడధోరణులు ఉన్నాయి. వివిధ ప్రజా పోరాట రూపాలనూ ప్రజా సంఘాలనూ నిరాకరించడం, వర్గ శత్రు నిర్మూలన ఏకైన పోరాట రూపంగా భావించడం, కార్మిక సంఘాల బహిష్కరణ, పట్టణ గెరిల్లా యుద్ధాన్ని అతిగా నొక్కి చెప్పడం, అతివాద దుస్సాహసిక ఎత్తుగడలతో బూర్జువా విద్యా సంస్థల మీద దాడి చేయడం, బూర్జువా కోర్టులను బహిష్కరించడం మొదలయిన వాటికి సంబంధించి పెడధోరణులు ఉన్నాయి. ఎనిమిదో కాంగ్రెస్‌లో వర్గ శత్రు నిర్మూలనా ఎత్తుగడల పంథా స్థాయికి ఎదిగింది. 1974 నాటి ఆత్మవిమర్శనా రిపోర్టులో పార్టీ రాజకీయ పంథాలో పొరపాటులను సరిదిద్దుకున్నాం. ఆంధ్రప్రదేశ్‌లో వెనుకంజ తరువాత ఆచరణలో ఈ నూతన అవగాహన ప్రతిబింబించింది. అనేక ప్రజాసంఘాలు నిర్మించాం. విప్లవ ప్రజా పంథా పునాదిగా పెద్ద ఎత్తున వర్గ పోరాటాలు ప్రారంభమయాయి.

1970లలో కానూ సన్యాల్, టీఎన్ డీవీ సీపీఆర్, ఎస్ఎన్ఎస్ పీసీసీ మొదలయిన కొన్ని గత ఎంఎల్ గ్రూపులు ఎనిమిదో కాంగ్రెస్ పంథా అతివాద దుస్సాహసికం అనీ అతివాద ఒంటెత్తుపోకడ అనీ ప్రజా వ్యతిరేకం కూడాననీ ముద్ర వేసి విమర్శించారు. ప్రజా పంథా గురించీ కామ్రేడ్ సీఎం నాయకత్వంలో భాకపా(మాలె) ప్రజా పంథా నుంచీ ఏ విధంగా పెడదోవ పట్టిందన్న దాని గురించి వీళ్లు అంతు లేకుండా మాట్లాడారు. నిజానికి ఈ గ్రూపులన్నీ రివిజనిస్టు పంథాను, మితవాద అవకాశవాద పంథానూ ముందుకు తెచ్చాయి. దీర్ఘకాలిక

ప్రజాయుద్ధ పంథా స్థానంలో ప్రజాపంథాను ముందుకు తీసుకువచ్చారు. సెకండ్ సీసీ, వినోద్ మిశ్రా లిబరేషన్ వంటి కొన్ని ఎంఎల్ సంస్థలు మరో అంచుకు వెళ్లాయి. కామ్రేడ్ సీఎం పొరపాటుల గురించి ఎటువంటి విమర్శా చేయలేదు. ఆయన విప్లవ అధికారం గురించి పిడివాదంగా పట్టుబట్టాయి. ప్రజాసంఘం, ప్రజా పోరాటాల గురించిన ఏ ఒక్క రూపాన్నీ కూడా అంగీకరించలేదు. వర్గ శత్రు నిర్మూలనే ఏకైక పోరాట రూపంగా ఎత్తిపట్టాయి (లిబరేషన్ గ్రూపు మరో అంచుకు వెళ్లి 1980ల ప్రారంభం నాటికి రివిజనిస్టులతో చేతులు కలిపింది).

వివిధ ఎంఎల్ గ్రూపుల ఈ తప్పుడు వైఖరులకు వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్, ఆ తరువాత భాకపా(మాలె)(పీపుల్స్‌వార్) కామ్రేడ్ సీఎం, ఎనిమిదో కాంగ్రెస్ అవలంబించిన పంథాను సమర్థించాయి. వాటి లోపాలను గుర్తించి ధైర్యంతో దిద్దసాగాయి. ఈ మార్క్సిస్టు లెనినిస్టు గతితార్కిక పద్ధతి, వైఖరీ మూలంగానే ఈ పంథా మరింత సుసంపన్నమై ఆచరణలో నిగ్గు తేలింది.

పీపుల్స్‌వార్, పీయూలు భారత సమాజాన్ని మరింతగా నిర్దిష్టంగా విశ్లేషించాయి. భారతదేశ విప్లవ యుద్ధ ప్రత్యేక లక్షణాలూ విప్లవ పూర్వ చైనా పరిస్థితులతో దానికి ఉన్న పోలికలూ తేడాలూ అధ్యయనం చేసాయి. ఇది రాజకీయ సైనిక వ్యూహం, ఎత్తుగడల అభివృద్ధికి దోహదం చేసింది. కుల సమస్య, జాతుల సమస్య, ఆదివాసీ సమస్య, మహిళా సమస్య, మతపర అల్పసంఖ్యాకుల సమస్య మొదలుగా భారతదేశ ప్రత్యేకతలూ ప్రత్యేక లక్షణాలను అధ్యయనం చేసాయి. వారిని నూతన ప్రజాస్వామిక విప్లవంలోకి సమీకరించడానికి నిర్దిష్ట ఎత్తుగడలు అవలంబించడానికి ఇది సహాయం చేసింది.

### దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథా నిర్దిష్ట అన్వయం

దీర్ఘకాలిక ప్రజాయుద్ధ పంథాను మన దేశ నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ కరీంనగర్ ఆదిలాబాద్‌లలో విస్తరిస్తున్న రైతాంగ పోరాటాలను ఉన్నత దశకు తీసుకువెళ్లాలని నిర్ణయించుకుంది. కరీంనగర్ ఆదిలాబాద్ రైతాంగ పోరాటాలను నూతన దశకు తీసుకువెళ్లడానికి సంసిద్ధులు కండి అన్న పిలుపిచ్చింది. కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం (ఉత్తర తెలంగాణా) జిల్లాలను గెరిల్లా జోన్‌గా నిర్మించే పథకాన్ని అమలు పరిచే దానిలో భాగంగా 1980లో ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ సరిహద్దులలో ఉన్న వ్యూహాత్మక దండకారణ్యం ప్రాంతానికి ఏడు సాయుధ రైతాంగ గెరిల్లా దళాలను పంపించారు. 1980-84 ప్రాంతంలో ఉత్తర తెలంగాణా దండకారణ్యాలలో వివిధ సెక్షన్ ప్రజల అనేక అంశాలను తీసుకుని రైతాంగ పోరాటాలనూ రాజకీయ ఉద్యమాలనూ మిలిటెంటుగా నిర్మించాం.

1985లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మన మీద అప్రకటిత యుద్ధం ప్రారంభించారు. ఈ అప్రకటిత యుద్ధాన్ని తిప్పికొట్టడానికి మనం 1985 మే నెలలో ఆత్మరక్షణా ఎత్తుగడలను

రూపొందించుకున్నాం. 1985-87 మధ్య మనకు చీకటి కాలంగా గడిచింది. ఆ కాలంలో మనం ఎన్నో నష్టాలు ఎదుర్కొన్నాం. శత్రువు పై చేయిలో ఉన్నాడు. 1987-88 మధ్య కాలంలో ప్రజా సంఘాలు పునర్నిర్మించాం. ప్రజా పునాదిని సంఘటితం చేసుకున్నాం. మైదానాలలో అడవులలో నూతన దళాలు నిర్మించాం. వివిధ రూపాలలో ఆయుధాలతో దాడి చేయడం ద్వారా మనం శత్రువును నిలువరించగలిగాం. 1988 మధ్య నుంచీ ప్రారంభమై 1989 చివరి నాటికి ప్రజా ప్రతిఘటనా సాయుధ ప్రతిఘటనా ఉద్యమం పై చేయి సాధించింది. ప్రభుత్వ అప్రకటిత యద్ధాన్ని ఓడించాం. ఈ కాలంలో సాయుధ పోరాటం తీవ్రంగా ఉన్నది. ప్రభుత్వ బలగాలనూ వారి ఏజెంటులనూ ప్రతిదాడి చేయడం ప్రధాన కార్యక్రమంగా గడిచింది.

శత్రు మొట్టమొదటి ముఖ్య దాడిని 1985-87 మధ్య బద్దలుగొట్టాం. 1987లో ఈస్ట్ డివిజన్‌లో దారగడ్డ ఆంబుష్, ఆదిలాబాద్‌లో ఆలంపల్లిలలో ఆంబుష్ చేసాం. ఈ ఆంబుష్‌లలో మొత్తంగా పద్ధెనిమిది మంది పోలీసులు తుడిచిపెట్టుకుపోయారు. అనేక రైఫిళ్లు గుంజుకున్నాం. ఈ సాహసోపేతమైన ఆంబుష్‌లు శత్రు మనోస్థైర్యాన్ని దెబ్బ తీసి కొంత కాలం పాటు నిలువరించాయి. ప్రజల మనోస్థైర్యాన్ని పెంచాయి. 1988 నుంచీ మిలిటెంటు ప్రజా పోరాటాల, ప్రజల సాయుధ చర్యల వెల్లువను తీసుకువచ్చాయి.

1990లో పాలక వర్గాల మధ్య వైరుధ్యాలను వినియోగించుకుని మనం ఎత్తుగడలు మార్చుకున్నాం. ప్రజా పునాదిని సంఘటితం చేసాం. ప్రజా పోరాటాలను విస్తృతంగా నిర్మించాం. సాయుధ యూనిట్‌లను విస్తరించి సంఘటితం చేసాం. ఉద్యమాన్ని విస్తరించాం.

కేంద్ర ప్రభుత్వ ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో ప్రారంభించిన మరో అప్రకటిత యుద్ధాన్ని 1990 చివరి నుంచీ ఆత్మరక్షణా ఎత్తుగడలతో ఎదుర్కొన్నాం. ఈ కాలంలో ఆంధ్రప్రదేశ్ నాయకత్వంలో తీవ్ర నష్టాలను ఎదుర్కొన్నాం. 1985లో ప్రారంభించి, ఆంధ్రప్రదేశ్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సాలలో పోలీసు యంత్రాంగాన్ని గతంలో లేనంతగా ఆధునికమూ ఫాసిస్టుమయమూ చేసారు. మరో పక్క, ప్రజల సాయుధ ప్రతిఘటన కూడా పెరిగింది.

1990 చివరి నుంచీ ఆంధ్రప్రదేశ్‌లో శత్రు సాయుధ దాడి పెరిగింది. 1992 మే నెలలో భాకపా(మాలె) మీదనూ ప్రజా సంఘాల మీదనూ నిషేధం విధించారు. బూటకపు ఎదురుకాల్పులు సర్వసాధారణమయాయి. ఉత్తర, దక్షిణ తెలంగాణా ప్రాంతాలలోనూ ఈస్ట్ డివిజన్‌లోనూ తెల్ల భీభత్సం రాజ్యం ఏలింది. ఈ క్రూర దాడిని పార్టీ ఆత్మరక్షణా యుద్ధం ద్వారా ధైర్యంగా ఎదుర్కొంది. ఆపర్చునిటీ, డెలిబరేట్ ఆంబుష్‌లూ రెయిడ్‌లూ నిర్వహించింది. కొన్ని ప్రాంతాలలో పోలీసుల మీదనూ రాజ్య సంపదల మీదనూ సాయుధ చర్యలకు ప్రజా మిలీషియా యూనిట్‌లను సమీకరించింది. పోలీసులతోనూ పారా మిలిటరీ బలగాలతోనూ సాయుధ ఘర్షణలు మరింత తీవ్రమయాయి. ఇవి ఒక ప్రధాన రూపంగా ముందుకు రాగా, స్థానిక శత్రువులతో ఘర్షణలు సెకండరీ అంశాలయాయి.

1990ల కాలంలో పీపుల్స్‌వార్ గెరిల్లా దళాలు పథకం ప్రకారం ప్రతీ చర్యా ప్రతిఘటనా చేపట్టాయి. అనేక పోలీసు స్టేషన్‌ల మీదనూ క్యాంపుల మీదనూ దాడులు చేసి ఆయుధాలు గుంజుకున్నాయి. 1996లో కరకగూడెం, సిర్‌పూర్(యూ), పోలీసు స్టేషన్ ఏపీఎస్‌పీ, సీఆర్‌పీఎఫ్ క్యాంపుల మీదనూ వరుస దాడులు జరగడంతో లోతట్టు ప్రాంతాలలో ప్రభుత్వం అనేక క్యాంపులూ పోలీసు స్టేషన్‌లూ ఉపసంహరించుకుంది. పోలీసులూ పారా మిలిటరీ బలగాలూ లోతట్టు ప్రాంతాలకు రాకుండా ఆంబుష్‌లు నిలువరించాయి. ఇతర రాష్ట్రాల నుంచీ వచ్చిన పంజాబ్ కమాండోల వంటి బలగాలు తీవ్ర దెబ్బలు తిన్నాయి. 1994 డిసెంబరులో లెంకలగడ్డ ఆంబుష్ ఇందుకు ఉదాహరణ. 1995 తరువాత గెరిల్లాలు చేపట్టిన వీరోచిత సాయుధ ప్రతిఘటన ప్రజా ఉద్యమాలకు ఊపునిచ్చింది. వివిధ అంశాల మీద వర్గ పోరాటాలూ భూ ఆక్రమణ పోరాటాలూ సాధారణమయాయి. ఉత్తర తెలంగాణాలో వివిధ ప్రజా కమిటీలతో పాటు జనతా ప్రజాస్వామిక అధికార అంగాలు ముందుకు వచ్చాయి. పోలీసులకు వ్యతిరేకంగా మనం కొన్ని విజయాలు సాధించడంతో పీడిత ప్రజల చొరవ ముందుకు వచ్చింది.

గెరిల్లా యుద్ధం గురించి మావో తీసుకువచ్చిన సూత్రాల ఆధారంగా మనం స్థానిక పరిస్థితులను బట్టి వివిధ రూపాలను తీసుకువచ్చాం. చైనాలో మాదిరిగా భారతదేశ విప్లవ యుద్ధంలో ప్రజా సైన్యం లేదు. ఇది ఇక్కడి ప్రత్యేక లక్షణం. చిన్న గెరిల్లా దళాల నుంచీ ప్రారంభించి ఉన్నత సైనిక నిర్మాణాలకు క్రమేపీ విస్తరిస్తూ ప్రజా సైన్యాన్ని నిర్మించాలి. ప్రత్యేక ప్రజా సైన్యం లేకపోవడంతో చాలా కాలం పాటు సాయుధ గెరిల్లా దళాలే నిర్మాణ, సైనిక కర్తవ్యాలూ బాధ్యతలూ చేపట్టవలసి వచ్చింది. అలాగే ఒక బలమైన ప్రజాసైన్యం లేకపోవడం, కేంద్రీకృత భారత రాజ్యం ఆధిక్యతల కారణంగా బేస్ ఏరియాలు నెలకొల్పడానికి ఎక్కువ సమయం తీసుకుంటుంది. గెరిల్లా జోన్‌లు ఎక్కువ కాలం పాటు కొనసాగుతాయి.

*గెరిల్లా జోన్‌లు - మన పర్స్‌పెక్టివ్, వ్యూహం - ఎత్తుగడలు* డాక్యుమెంటులలో మనం దేశంలో వివిధ ప్రాంతాలలో పరిస్థితులను విశ్లేషించాం. వ్యూహాత్మక ప్రాంతాలను మూడు రకాలుగా వర్గీకరించాం. ఈ మూడు రకాల ప్రాంతాలలోనూ అవలంబించవలసిన ఎత్తుగడలను రూపొందించాం. ఈ నిర్దిష్ట విశ్లేషణతో గెరిల్లా జోన్‌లూ బేస్ ఏరియాల గురించి మన అవగాహన సుసంపన్నమయింది. బేస్ ఏరియాలు నెలకొల్పే లక్ష్యంతో గెరిల్లా జోన్‌లను పెంపొందించేందుకు పర్స్‌పెక్టివ్ ఏరియాలను ఎంపిక చేసుకోవడానికి ఈ అవగాహన వివిధ రాష్ట్ర కమిటీలకు ఉపయోగపడింది.

ఈ కాలంలో మన ఉద్యమం ఉత్తర తెలంగాణా, దండకారణ్యం గెరిల్లా జోన్‌లతో పాటుగా ఆంధ్రప్రదేశ్ అంతటా పెరిగింది. వివిధ ప్రాంతాలలో సామాజిక, భౌగోళిక పరిస్థితులూ వర్గ పోరాట తీవ్రతా ప్రజల చైతన్యాలలో తేడాలున్నాయి. సాయుధ పద్ధతులతో ఉద్యమాన్ని అణిచివేయడం కోసం శత్రువు అన్ని ప్రాంతాలలో నిర్బంధం తీవ్రంగా పెంచాడు. 1980ల

చివరి నాటికి ఉత్తర తెలంగాణా దండకారణ్యాలలోనే కాక ఆంధ్రప్రదేశ్‌లో ఇతర ప్రాంతాలలో కూడా సాయుధ దళాలు ఏర్పడ్డాయి.

మన పార్టీ నాయకత్వంలో జరిగిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ క్రమంలో మనం పోరాట, నిర్మాణ రూపాలలో సంపన్నమైన అనుభవాలు పొందాం. గెరిల్లా యుద్ధం, ప్రజా సైన్యం, ప్రజల రాజకీయాధికారం, గెరిల్లా జోన్‌లూ గెరిల్లా బేస్‌లూ బేస్ ఏరియాల గురించిన మనకు ఆచరణాత్మక, సూత్రబద్ధ అవగాహన పెరిగింది. గెరిల్లా జోన్‌లలో గెరిల్లా సైన్యం, గెరిల్లా యుద్ధం ప్రధాన నిర్మాణ, పోరాట రూపాలుగా ఉంటాయి. ప్రజా గెరిల్లా సైన్యం సంఘటితం అవుతున్న కొద్దీ గెరిల్లా యుద్ధం తీవ్రతరమవుతుంది.

సాయుధ పోరాటం గురించి మన గొప్ప అనుభవాలను సంశ్లేషించి, గెరిల్లా జోన్‌లలో ప్రధానంగా శత్రువుకూ మనకూ రాజకీయాధికారం కోసం పోటీ ఉంటుందని నిర్ధారించుకున్నాం. శత్రు రాజకీయాధికారాన్ని ధ్వంసం చేస్తాం. ప్రజల రాజకీయాధికారాన్ని నిర్మిస్తాం. విధ్వంసం ప్రధానంగా ఉంటుంది. నిర్మాణం ద్వితీయంగా (సెకండరీగా) ఉంటుంది. గెరిల్లా బలగాలు గట్టి పోరాటం చేసి శత్రు బలగాల మీద పై చేయి సాధించినప్పుడు ప్రజల అధికారం నెలకొల్పడం సాధ్యమవుతుంది. మరో పక్క తీవ్ర శత్రు అణిచివేత వల్ల గెరిల్లా బలగాలు రిట్రీట్ కావలసి వచ్చినప్పుడు శత్రువు తన పాలనను పునరుద్ధరించుకుంటాడు. అందుకని గెరిల్లా జోన్‌లలో అధికారం కోసం తీవ్ర పోటీ ఉంటుంది. మరో మాటలో చెప్పాలంటే గెరిల్లా జోన్‌లో గెరిల్లాల సాయుధ బలం, ప్రజల మద్దతులను బట్టీ, శత్రువును బట్టీ రాజకీయాధికారం తరచూ చేతులు మారుతూ ఉంటుంది. గెరిల్లాలు దాన్ని పూర్తిగా శత్రువు చేతులలో నుంచీ గుంజుకుని బేస్ ఏరియా ఏర్పరచే వరకూ సుదీర్ఘ కాలం పాటు, ఇలాగే కొనసాగుతుంది.

ఒక ప్రాంతంలో ద్వంద్వ పరిపాలన కొనసాగదు. గెరిల్లాలో శత్రు వర్గాలో అధికారంలో ఉంటారు. అధికారం తరచూ చేతులు మారవచ్చు. కానీ ఒకే చోట ఒకే సమయంలో అధికారం ఇరు వర్గాల చేతుల్లో ఉండదు. గెరిల్లా యుద్ధం పెంపొంది, ప్రజలు విస్తృతంగా యుద్ధ రంగానికి కదిలే క్రమంలో ప్రజా పునాదీ, టెర్రయిన్ మనకు అనూకూలంగానూ శత్రువుకు అననుకూలంగానూ ఉన్న వ్యూహాత్మక ప్రాంతాలలో బేస్ ఏరియాలలో భాగంగా గెరిల్లా బేస్‌లను పెంపొందించడం ఆరంభించాలి. తద్వారా గెరిల్లా జోన్‌లలో ప్రజల రాజకీయాధికారాన్ని సంఘటితం చేయగలుగుతాం.

మైదాన ప్రాంతాలలో గెరిల్లా యుద్ధం మరింత దీర్ఘకాలికంగా ఉంటుంది. అయితే, అనుకూల టెర్రయిన్‌లో రుతువులను అవకాశంగా తీసుకుని మైదాన ప్రాంతాలలో స్వల్ప కాలం పాటు రాజకీయాధికారం పెంపొందించగలుగుతాం. అనేక తాత్కాలిక గెరిల్లా బేస్‌లను ఏర్పాటు చేయగలుగుతాం. ఇదే సమయంలో వ్యవసాయ విప్లవ కార్యక్రమాన్ని కొనసాగించడం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేసి, పెద్ద ఎత్తున రిక్రూట్‌మెంటు పెంచి, ప్రజా విముక్తి గెరిల్లా

సైన్యాన్ని పెంపొందించి గెరిల్లా యుద్ధాన్ని అభివృద్ధి చేయవచ్చు. మైదాన ప్రాంతాలలో అధికారం నెలకొల్పడం చాలా అస్థిరంగా, కెరటాల మాదిరిగా ఉంటుంది. ప్రజల చైతన్యం పెంపొందిన కొన్ని గ్రామాలలో రాజకీయాధికార అంగాలు ఏర్పడతాయి. అయితే, ప్రజా విముక్తి గెరిల్లా సైన్యం శత్రువును ఓడించి పెద్ద ఎత్తున రాజ్యం ఏర్పాటు చేస్తే మినహా ఈ రాజకీయాధికార అంగాలు పెంపొందించడం కానీ ప్రజా అధికారం నెలకొల్పడం కానీ సాధ్యం కాదని గుర్తు పెట్టుకోవాలి.

గెరిల్లా జోన్ ప్రాంతాలలో ఉండే పట్టణాలలో కార్మికులూ విద్యార్థులూ యువతా మేధావులను సంఘటితం చేయడాన్ని ముఖ్య కర్తవ్యంగా తీసుకున్నాం. పట్టణ ప్రాంతాలలో రహస్య పని పద్ధతులు పెంపొందించుకున్నాం. గ్రామీణ ప్రాంతాలలో ప్రజా యుద్ధ ప్రయోజనాలకు సేవచేసే విధంగానూ గ్రామీణ పనితో సన్నిహిత సమన్వయంతోనూ ఈ పనిని రూపొందించాం. పట్టణాలు సరఫరా కేంద్రాలుగానూ కేడర్‌ల రిక్రూటింగ్ కేంద్రాలుగానూ టెక్నికల్ స్టాఫ్, వైద్య సిబ్బందీ మొదలయిన వాళ్లకు కేంద్రంగానూ గ్రామాలలో జరిగే భూస్వామ్య వ్యతిరేక, సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమానికి సంఘీభావం తెలిపే కేంద్రాలుగానూ పని చేసాయి. ఒక మేరకు సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయ ఉద్యమాలు పెంపొందాయి. విప్లవోద్యమం పట్ల శత్రువు చేసే విషపూరిత ప్రచారాన్ని తిప్పికొట్టడానికి విస్తృతమైన క్యాంపెయిన్‌లను చేపట్టాం.

అయితే పట్టణ ప్రాంతాల పనిలో అనేక లోపాలు ఉన్నాయి. నాయకత్వ కేడర్‌ను తీవ్రంగా నష్టపోయాం. దీంతో 1990 దశకం మధ్య కాలంలో సాపేక్షికంగా బలంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ పట్టణ ఉద్యమం క్రమేపీ క్షీణించింది.

**అఖిల భారత ప్రత్యేక మహాసభ, పార్టీ పంథాను పెంపొందించడంలో దాని ప్రాముఖ్యత**

అఖిల భారత ప్రత్యేక మహాసభ ఎనిమిదో కాంగ్రెస్ జరిగిన నాటి నుంచీ జాతీయంగా అంతర్జాతీయంగా జరిగిన ముఖ్యమైన రాజకీయ ఆర్థిక, సామాజిక మార్పులను క్షుణ్ణంగా విశ్లేషించింది. గడచిన ఇరవై ఐదు సంవత్సరాల నుంచీ విప్లవోద్యమంలోనూ పార్టీలోనూ పొందిన అనుభవాలను కూడా విశ్లేషించింది. సవరించిన పార్టీ కార్యక్రమం, నిబంధనావళి, వ్యూహం ఎత్తుగడల మీద డాక్యుమెంటులూ, గెరిల్లా జోన్‌లు - మన పర్స్పెక్టివ్, నూతన రాజకీయ తీర్మానం (ప్రస్తుత రాజకీయ పరిస్థితీ మన కర్తవ్యాలు) ఆమోదించింది. అంతేకాక, గతానికి సంబంధించి 1980 ఆత్మ విమర్శనా సమీక్షను ఆమోదించి, దానిని ఒక మౌలిక డాక్యుమెంటుగా తీసుకుంది. గడచిన పదిహేను సంవత్సరాల ఆచరణను రాజకీయ నిర్మాణ సమీక్షల ద్వారా సమీక్షించి, ఒక కేంద్ర రాజకీయ నిర్మాణ నివేదికను తీసుకువచ్చింది. మౌలిక పంథాను ఎత్తిపట్టడం ద్వారా అఖిల భారత ప్రత్యేక మహాసభ పార్టీ రాజకీయ, నిర్మాణ సైనిక పంథాను సుసంపన్నం చేసింది. అదే సమయంలో వివిధ రంగాలలోనూ మన సుదీర్ఘ ఆచరణలోనూ పరిణామాలను విశ్లేషించింది. మార్క్సిజం లెనినిజం మావోయిజం వెలుగులోనే

ఇదంతా జరిగింది. ఎనిమిదో కాంగ్రెస్ తరువాత ఈ మహాసభ విజయం మొట్టమొదటిదీ ప్రముఖమైనదీ.

ఎనిమిదో కాంగ్రెస్ తరువాత సుదీర్ఘ రెండున్నర దశాబ్దాల కాలం తరువాత అపారమైన కష్టాలూ అనేక ఎగుడు దిగుడులూ, విజయాలూ ఓటములూ, 1978 తరువాత ఒక నూతన పునరుద్ధరణా చవి చూసిన తరువాత పార్టీ పునర్నిర్మాణం, కన్సాలిడేషన్, అభివృద్ధుల క్రమంలో అన్ని స్థాయిలలోనూ నాయకత్వం ఆవిర్భవించింది. అఖిల భారత ప్రత్యేక మహాసభ నిర్వహించే క్రమంలో ఈ నాయకత్వం జిల్లా, రాష్ట్ర, కేంద్ర మహాసభలలో ఎన్నికయింది. ఎనిమిదో కాంగ్రెస్ తరువాత పార్టీ అంతటా ఒక క్యాంపెయిన్ మాదిరిగా ప్రజాస్వామికంగా ఒక నాయకత్వం ఎన్నిక కావడం ఇదే మొదటిసారి. ఇది మహాసభ సాధించిన రెండో ముఖ్య విజయం.

ఏఐఎస్‌సీ పార్టీకి ముఖ్యమైన కర్తవ్యాలను కూడా రూపొందించింది. వీటిల్లో ముఖ్యమైనది ప్రజాసైన్యం, బేస్ ఏరియాలు నిర్మించి విజయవంతంగా ముందుకు సాగే లక్ష్యంతో మూడు అద్భుత ఆయుధాలను పటిష్టం చేయడం. భాకపా(మాలె)(పీపుల్స్‌వార్) చరిత్రలో ఏఐఎస్‌సీ ఒక ముఖ్యమైన మూల మలుపుగా ఉండిపోతుంది.

**మునుపటి పీయూ ఏర్పాటూ అభివృద్ధీ**

జైలు నుంచీ బయటకు వచ్చిన కొద్దిమంది కామ్రేడ్‌లు కలిసి 1978 నవంబరులో భాకపా(మాలె)(పీయూ) ఏర్పాటు చేసారు. జైలులో ఉన్నప్పుడు వాళ్ళు విడిగానూ సమిష్టిగానూ గతానికి సంబంధించిన కొన్ని మౌలిక అంశాల గురించి ఒకే రకమైన ఆలోచనలు కలిగి ఉన్నారు. వీళ్లందరూ సీఎం నాయకత్వంలో భాకపా(మాలె)లో చురుకుగా ఉన్నవాళ్ళు. తరువాత వాళ్లల్లో కొందరు మహదేవ్ ముఖర్జీ నాయకత్వంలో సెకండ్ సీసీలో చేరారు. జైలు నుంచీ విడుదల అయిన తరువాత, వాళ్ళు గత సమీక్ష పునాదిగా ఏ విప్లవ గ్రూపులతోనైనా ఐక్యం కావడానికి ప్రయత్నించారు. కానీ ఆ కృషి విఫలమయింది. గత సమీక్ష పునాదిగా విప్లవ పోరాటాలను పెంపొందించకుండా తమ కృషి వాస్తవ రూపం తీసుకోదని వాళ్ళు గుర్తించారు. ఈ గుర్తింపుతో వాళ్ళు ఒక సంస్థను ఏర్పాటు చేసి మహాసభ నిర్వహించారు. 1978లో జరిగిన ఈ మహాసభ మూడు డాక్యుమెంటులను ఆమోదించింది - భాకపా(మాలె) చారిత్రక ప్రాముఖ్యత గురించీ, ఐక్యత గురించీ నిర్మూలనా పంథా గురించీ. ఏక రూప విప్లవకారులతో ఐక్యం కావడానికి కృషి జరుగుతున్నది. ఈ మహాసభలో ఈ పోరాటాలకు నాయకత్వం వహించడానికి ఒక సంస్థను నిర్మించాలని నిర్ణయించారు. దీని ప్రకారం ఒక నాయకత్వ కమిటీ ఏర్పడింది. వ్యూహాత్మక ప్రయోజనం కోసం ఎంపిక చేసుకున్న ఆనాటి దక్షిణ కేంద్ర బీహార్‌లో విప్లవ రైతాంగ ఉద్యమాన్ని నిర్మించాలని నిర్ణయమయింది. బీహార్‌లో ఇతర ప్రాంతాలలోనూ పశ్చిమ బెంగాల్‌లో నాడియా, ముర్షీదాబాద్ ప్రాంతాలలోనూ కూడా పని ప్రారంభమయింది.

1978లో పీయూ ఏర్పడినప్పుడు మూడు తీర్మానాలు చేపట్టింది. ఒకటి, భాకపా(మాలె) మీద. 1970 నాటి పార్టీ కాంగ్రెస్ అవలంబించిన పార్టీ సైద్ధాంతిక, రాజకీయ పంథా, పార్టీ ఏర్పాటు, పార్టీ కార్యక్రమం చేపట్టిన మౌలిక పంథాలను ఈ తీర్మానం ఎత్తిపట్టింది. రివిజనిజం మీదా నయా రివిజనిజం మీదా పోరాడడంలోనూ భారత విప్లవానికీ సాయుధ పోరాటానికీ సైద్ధాంతిక రాజకీయ పునాదిని నెలకొల్పడంలోనూ నక్సల్బరీ పోరాటానికి నాయకత్వం వహించడంలోనూ పార్టీ ఏర్పాటులోనూ కామ్రేడ్ చారు మజుందార్ వహించిన పాత్రను కూడా ఇది ఎత్తిపట్టింది. పార్టీ కార్యక్రమం మౌలికంగా సరైనదే అయినప్పటికీ యుగం గురించీ ప్రపంచ యుద్ధం గురించీ తప్పుడు అంచనా వేయడం, ఆనాటి అంతర్జాతీయ, జాతీయ పరిస్థితులను అతిగా అంచనా వేయడం, త్వరిత విజయం గురించిన సూత్రం, ప్రజా సంఘాలలో, అంటే కార్మిక సంఘాల కార్యకలాపాలలో, విద్యార్థి సంఘాలలో ఉద్యోగ సంఘాలలో, ఇతర ప్రజా సంఘాలలో, ప్రజా ఉద్యమంలో పాలు పంచుకోవడాన్ని నిరాకరించడం, మొదలయిన కొన్ని లోపాలు ఉన్నాయి. మరో తీర్మానం నిర్మూలనా పంథా గురించి ఆమోదించింది. 1970 కాంగ్రెస్ అవలంబించిన నిర్మూలనా పంథాను ఈ తీర్మానం వ్యతిరేకించింది. విప్లవం ఎదుర్కొంటున్న అన్ని సమస్యలనూ పరిష్కరించే ఒక సాధారణ ఎత్తుగడల పంథాగా దీనిని పరిగణించారు. నిర్మూలనా పంథాను వ్యతిరేకిస్తూనే ఈ తీర్మానం వర్గ శత్రువుల నిర్మూలనను ఒక పోరాట రూపంగా అవలంబించింది. ఇక మూడో తీర్మానం ఐక్యతా పంథా గురించినది. ఇది ఆనాటి మాలె ఉద్యమ పరిస్థితిని అంచనా వేసింది. మాలెమా ఉద్యమంలో ప్రధానంగా మూడు ధోరణులు ఉన్నాయంది. మొదటిది మితవాద పెడధోరణి-లిక్విడేషనిస్టు పంథా. గత అతివాద తప్పులను సరిదిద్దుకునే పేరు మీద ఈ తీర్మానం నక్సల్బరీ, భాకపా(మాలె)ల విప్లవ సారాన్ని వదిలివేసింది. ఈ పూర్తి రివిజనిస్టు పంథాను ఎస్ఎన్ఎస్, కానూ సన్యాల్, అసిం ఛటర్జీ మొదలయిన వాళ్లు చేపట్టారు. రెండో విషయం ఏమంటే, గత తప్పులను గుర్తించకుండా పాత తప్పుడు విధానాలను కొనసాగించడం. సెకండ్ సీసీ నాయకత్వంలో అతివాద అవకాశవాద పంథాను పెంపొందించారు. ఈ తీర్మానం గత తప్పులను గుర్తించి వాటిని సరిదిద్దుకోవడానికి చొరవ చేసి తీవ్ర ఆచరణ ద్వారా పంథాను పెంపొందించింది.

ఐక్యత మీద డాక్యుమెంటు ఈ మూడో ధోరణిని ఏపీఎస్సీ, సీఓసీ, ఎంసీసీ మొదలయిన కమ్యూనిస్టు విప్లవ శిబిరంగా గుర్తించి, వారితో ఐక్యం కావాలన్నది. అంతే కాకుండా, మితవాద అవకాశవాదమూ లిక్విడేటర్‌లూ నేటి ఉద్యమానికి అతి తీవ్రమైన ప్రధాన ప్రమాదంగా పరిణమిస్తారని గుర్తించింది. మితవాద, అతివాద, అవకాశవాదానికీ పిడివాదానికీ వ్యతిరేకంగా పోరాడింది. ఆత్మ విమర్శనా రిపోర్టునూ ఏపీఎస్సీ తయారు చేసిన ఎత్తుగడల పంథా డాక్యుమెంటునూ సుసంపన్నం చేయడంలో దోహదం చేసింది. 1979 చివరి నాటికి ఏపీఎస్సీ పీయూల ఉమ్మడి డాక్యుమెంటులుగా ఇవి తయారైనప్పుడు వాటిలో కొన్ని అంశాలను ఈ డాక్యుమెంటులలో చేర్చారు.

పార్టీ యూనిటీ మొదటగా కమ్యూనిస్టు క్రాంతికారీ సంఘటనతో ఐక్యమయింది. ఈ క్రాంతికారీ సంఘటన ఏఐసీసీసీఆర్ బీహార్ శాఖలో సభ్యత్వం ఉన్న ఒక చిన్న నిర్మాణం. సీకేఎస్‌కీ ఆనాటి బీహార్ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్న ఎస్ఎన్ఎస్‌కూ ఉన్న విభేదాల వల్ల సీకేఎస్ భాకపా(మాలె)లో చేరలేదు. ఈ క్రాంతికారీ సంఘటన చీలి, అందులో ఔరంగాబాద్, పలాము జిల్లాల సరిహద్దుల్లో పని చేస్తున్న ఒక సెక్షన్ భాకపా(మాలె)(పీయూ)తో విలీనమై 1980లో భాకపా(మాలె)(యూఒ) ఏర్పడింది.

1982 జనవరిలో యూవో, కా.శర్మ, అప్పలసూరి నాయకత్వంలో ఉన్న మునుపటి భాకపా(మాలె)(సీఓసీ) విలీనమై పార్టీ యూనిటీని ఏర్పరిచాయి. ఈ రెండు సంస్థలకు చైనా రాజ్య స్వభావం వంటి కొన్ని ముఖ్య సమస్యల పై కొన్ని భేదాభిప్రాయాలున్నప్పటికీ మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానానికి సంబంధించిన సిద్ధాంత విషయాల పైనా, భారత విప్లవ వ్యూహం, ఎత్తుగడల పైనా దేశీయ అంతర్జాతీయ రాజకీయ పరిస్థితి వంటి అనేక మౌలిక సమస్యల పైన విస్తృత అంగీకారం ఉంది. సీఓసీ చైనాను సోషలిస్టు దేశంగా భావిస్తుండగా, పార్టీ యూనిటీ, 80లోనే చైనాను రివిజనిస్టుగా ప్రకటించింది. నిర్మాణం పై, చైనా సమస్య పై అంతిమ నిర్ణయాన్ని అధ్యయనం తరువాత ఐక్య నిర్మాణం తీసుకుంటుందని నిర్ణయించారు. రెండు నిర్మాణాలు గత పంథాలో కొన్ని ప్రధాన లోపాల పట్ల నిర్మాణాత్మకమైన ఆత్మ విమర్శనా వైఖరితో ఉన్నాయి.

మరి కొన్ని చిన్న నిర్మాణాలు కూడా పార్టీ యూనిటీలో విలీనమయాయి. పంజాబులో కో ఆర్డినేషన్ సెంటర్ (లేదా సంగ్రామ్ గ్రూపు)గా పేరు పొందిన భాకపా(మాలె)(సీటీ)లో ఒక ఫ్రాక్షన్ 1990లో పార్టీ యూనిటీతో ఏకమయింది. సీసీఆర్ఐ (ఎంఎల్) బీహార్‌కు చెందిన ఒక సెక్షన్ 1988లో పార్టీ యూనిటీతో ఏకమయింది. ఇది పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఒక చిన్న నిర్మాణం.

**పార్టీ యూనిటీ 1987లో ఒక కేంద్ర మహాసభను నిర్వహించింది. రెండు అంశాల వల్ల అది విశేషమైనది. ఒకటి, అప్పటి ప్రధాన కార్యదర్శి ప్రతిపాదించిన మితవాద పెడ ధోరణికి వ్యతిరేకంగా పోరాడింది, అది పార్టీ కొత్త కార్యక్రమాన్ని, నియమ నిబంధనావళినీ ఆమోదించింది. ఈ కొత్త కార్యక్రమం, 1970 నాటి కార్యక్రమంలో ముఖ్య లక్షణాలను కొనసాగిస్తూనే కొన్ని ముఖ్యమైన కొత్త అంశాలను అందులో చేర్చింది. అది 1970 మౌలిక పంథాను సమర్థిస్తూనే 1978 తీర్మానాల్లో అంశాలను, కొన్ని కొత్త భౌతిక పరిస్థితులను కూడా అందులో చేర్చింది. 1987 కార్యక్రమం ముఖ్య అంశాలు - (అ) భారత సమాజ అర్ధవలస, అర్ధ భూస్వామ్య స్వభావం (ఆ) భారత బడా బూర్జువాలది దళారీ స్వభావం (ఇ) బడా దళారీ బూర్జువాలు, బడా భూస్వామ్య వర్గమే భారత పాలకవర్గం (ఈ) విప్లవ టార్గెట్‌లు - సోషల్ సామ్రాజ్యవాదంతో కలుపుకుని సామ్రాజ్యవాదం, దళారీ బడా బూర్జువా, బడా భూస్వామ్య వర్గం. (ఉ) మార్క్సిజం లెనినిజం మావో ఆలోచనా విధానమే సిద్ధాంత ప్రాతిపదిక (ఊ) దీర్ఘకాల ప్రజాయుద్ధం**

ద్వారా అధికారాన్ని చేజిక్కించుకోవడం, గెరిల్లా జోన్‌లను విముక్తి ప్రాంతాలనూ ప్రజా సైన్యాన్నీ నిర్మించడం. అది అర్ధవలస, అర్ధ భూస్వామ్య దేశం మొత్తం మీద నిర్మాణ చట్రాలలో వ్యవసాయ రంగంలో కొన్ని మార్పులు, ప్రత్యేకించి పాత జమీందారీ వ్యవస్థ రద్దు, హరిత విప్లవం అనే వాటి ద్వారా కొన్ని మార్పులు వచ్చాయి. సరిగా ఈ అర్ధ భూస్వామ్య నిర్మాణ చట్రం లోపలనే పెట్టుబడిదారీ శక్తుల చొరబాటు ఉంది. దీని ఫలితంగా ఒక రకం పెట్టుబడిదారీ విధానం వక్రీకరించిన స్తబ్దతకు గురయిన, భూస్వామ్య అవశేషాలు కలిగిన పంజాబ్ వంటి కొన్ని ప్రాంతాలలో అభివృద్ధి చెందింది. ఈ మార్పు గ్రామీణ ప్రాంతాలలో కొన్ని కొత్త వర్గాల పుట్టుకకు దారి తీసింది. ఆ. దళారీ నిరంకుశాధికార బూర్జువా వర్గమే పాలకవర్గం, మన దేశం, విప్లవం అభివృద్ధి చెందే మార్గంలో అడ్డంకులలో ఒకటి. సామ్రాజ్యవాదానికి అదే ప్రధాన వాహకం. విప్లవ లక్ష్యాలలో ఒకటి. అందువల్లనే అది దళారీ నిరంకుశాధికార బూర్జువాకు విశాల ప్రజారాశులకు మధ్య వైరుధ్యాన్ని భారత సమాజంలో ప్రధాన మౌలిక వైరుధ్యాలలో ఒకటిగా చేర్చింది. భారత దళారీ నిరంకుశ బూర్జువాని సామ్రాజ్యవాద గులాముగా మనం స్వాభావీకరించాం. అయితే దానికి ఒక ప్రత్యేక ప్రతిపత్తి ఉంది. అది సామ్రాజ్యవాదానికి కేవలం ఒక యాంత్రిక కీలుబొమ్మ కాదు. అది మౌలిక పరాధీన చట్రం లోపలనే పెరగాలని వెంపర్లాడుతూ సామ్రాజ్యవాదం, సోషల్ సామ్రాజ్యవాదాలతో బేరసారాలాడగల శక్తి, పట్టు విడుపులతో నడుచుకోగలగడం అనే సాపేక్షిక స్వాతంత్ర్యం ఉంది. ఈ దళారీ గుత్త బూర్జువా తనకు ప్రయోజనం చేకూర్చుకోవడం కోసమే సామ్రాజ్యవాదానికి ఊడిగం చేస్తుంది. దీనిని ప్రధాన వైరుధ్యంగా నిర్ణయిస్తూ పార్టీ యూనిటీ సీబీబీకి ఉన్న మెనోవరబిలిటీ (వెసులుబాటుతో వ్యవహరించడం)నీ బేరసారాలాడే శక్తినీ గురించి అతిగా అంచనా వేసింది. సీబీబీకి ఉన్న సాపేక్షిక స్వాతంత్ర్యం గురించి అతిగా నొక్కి చెప్పడంతో భారత రాజ్యం గురించి పీయూ అవగాహనకు సంబంధించి కమ్యూనిస్టు విప్లవకారుల శిబిరంలో చాలా అనుమానం సృష్టించింది. సీబీబీ చిత్రీకరణ అది ఒక స్వతంత్ర వర్గమన్న భావం కలుగజేసింది. పీయూ, పీడబ్ల్యూ, ఎంసీసీల మధ్య ఒక ప్రధాన రాజకీయ విభేదం అయింది. అందుకని ఐక్యత కోసం ఈ విషయంలో పట్టు విడుపులు కలిగి ఉంటానని అది నిర్ణయించుకుంది. అందుకని 1998లో పీడబ్ల్యూతో ఐక్యతలో అది ఈ వైరుధ్యాన్ని వదులుకోవడానికి చేసిన ప్రతిపాదనను అంగీకరించింది. (ఇ) చిన్న, మధ్య స్థాయి బూర్జువాలలో అత్యధికులు జాతీయ బూర్జువాలే అని కూడా అది గుర్తించింది. అయితే వారు కొంత మేరకు సామ్రాజ్యవాదం పైనా, దళారీ బూర్జువా వర్గం పైనా ఆధారపడి ఉంటారని చెప్పింది. (ఈ) భారత కార్మికవర్గ అభివృద్ధి, దాని పరిమాణం చెప్పుకోతగ్గంత పెద్దదిగా ఉంది కాబట్టి, అది చైనాలో కంటే మన విప్లవంలో మరింత ఎక్కువ ప్రాధాన్యత కలిగిన పాత్రను పోషిస్తుందని గుర్తించింది.

పార్టీ యూనిటీ, 1980వ దశకం మధ్య కాలం నాటికల్లా బీహార్‌లో మగధ్ ప్రాంతంలో చెప్పుకోతగ్గ భూస్వామ్య వ్యతిరేక పోరాటాన్ని నిర్మించి, కోయిల్-కైమూర్ (పలాము జిల్లా)

ప్రాంతానికి విస్తరించనారంభించింది. మగధ్ రీజియన్‌లో నాలుగు జిల్లాలలో వేలాది గ్రామాలకు ఉద్యమ ప్రత్యక్ష ప్రభావం వ్యాప్తి చెందింది. సగం గ్రామాలలో ఎంకేఎస్ఎస్, గ్రామ రక్షక దళాలు ప్రజా సంఘాలుగా ఉన్నాయి. రెండు వందలకు పైగా గ్రామాలలో గ్రామ రక్షణ దళాలు ఏర్పాటయాయి. ఫుల్ టైమర్‌లు, పార్ట్ టైమర్‌లతో కూడిన నాలుగైదు గెరిల్లా దళాలు పని చేస్తుండేవి. భూమి సేన వంటి కుఖ్యాత భూస్వామ్య ప్రైవేటు సేనలను సాయుధ దళాల సాయంతో సాయుధ ప్రజా ప్రతిఘటన ద్వారా ఓడించారు. దళం అడపా దడపా పోలీసు బలగాల నుంచీ ఆయుధాలను గుంజుకునేది. ఇది మొత్తం మగధ్ రీజియన్‌లోనూ చారిత్రాత్మక ప్రజా వెల్లువకు దారి తీసింది. 50కి మించిన ఆయుధాలను భూస్వాముల నుంచీ కూడా స్వాధీనం చేసుకున్నాం.

రాజ్యం 1983లోనే దమనకాండ మొదలుపెట్టింది. ఎంకేఎస్ఎస్ రాష్ట్ర మహాసభ మీద పోలీసులు సాయుధ దాడి చేసారు. పదుల మంది కామ్రేడ్స్ గాయాల పాలయారు. ఈ మహాసభకు కొద్ది రోజుల ముందు పోలీసులు ఒక ఎంకేఎస్ఎస్ ఆక్టివిస్టును కాల్చి చంపారు. ఇదే మొట్టమొదటి బూటకపు ఎన్‌కౌంటర్. 1985లో బీహార్ ప్రభుత్వం ఉద్యమాన్ని అణిచివేయడం కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్‌ను మోహరించింది. అయితే, ఎస్‌టీఎఫ్ దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఎల్లెడలా లక్షలాది మంది ప్రజలు కదలడంతో ఈ దమనకాండ ప్రజల నుంచీ మరింత పెద్ద ఎత్తున ప్రతిఘటనకు దారి తీసింది. రీజియన్ అంతటా వేలాది మంది పాల్గొన్న పెద్ద ఎత్తున ఊరేగింపులు, సభలు జరిగాయి. ఇతర ఎంఎల్ పార్టీలతో కలిసి సంయుక్తంగా నిర్వహించిన ఇటువంటి ఒక సభలో 50 వేల మంది ప్రజలు పాలు పంచుకున్నారు. దీని తరువాత ఎస్‌టీఎఫ్‌కు గత్యంతరం లేక తాత్కాలికంగా వెనక్కి పోవలసి వచ్చింది. అయితే 1986 ఏప్రిల్ 19వ తేదీన రాజ్యం ఆర్వాల్ సభ పై పాశవికంగా దాడి చేసి 23 మందిని ఊచకోత కోసి మరో 70 మందిని గాయపరచడం ద్వారా మరో చిన్న జలియన్‌వాలాబాగ్‌ను సృష్టించింది. ఈ ఊచకోతకు నిరసనగా వివిధ విప్లవ, ప్రజాస్వామిక సంస్థలు ఇచ్చిన పిలుపుకు ప్రతిస్పందిస్తూ వేలాదిమంది రాష్ట్ర అసెంబ్లీకి నిరసన ఊరేగింపులో కదిలారు. బీహార్ వ్యాప్తంగా 40 వేల మందిని అరెస్టు చేసారు. ఈ ఊరేగింపుకు కొద్ది రోజుల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఎంకేఎస్ఎస్‌ను నిషేధించింది.

1985 నాటికల్లా ఎంకేఎస్ఎస్‌కు గ్రామ స్థాయిలో 2000 ఆక్టివిస్టు, ఇంచుమించు 20 వేల సభ్యత్వం ఉండింది. భూస్వాముల సాంఘిక బహిష్కరణ, పంటల స్వాధీనం, సమ్మెలు, ప్రజా పంచాయితీల నిర్వహణ, గూండాలను ఖతం చేయడం మొదలయినవి అప్పుడు చేపట్టిన సామాన్య పోరాట రూపాలు. ప్రైవేటు సేనల ఓటమి, రాజ్య దమనకాండల వల్ల, 90వ దశకం ప్రాంతాల్లో ప్రజా ఉద్యమం రాజ్య వ్యతిరేక స్వభావం సంతరించుకోసాగింది. కోయిల్ కైమూర్ ప్రాంతంలో ప్రజా సైన్యాన్నీ బేస్ ఏరియాలనూ నిర్మించే పర్స్‌పెక్టివ్‌తో మగధ్ రీజియన్‌లో గెరిల్లా జోన్‌ను నిర్మించి, ప్రజా అధికార అంగాలను నెలకొల్పాలన్న నినాదం ఇవ్వడానికి కాలం పరిపక్వమయింది. కానీ 87 కేంద్ర మహాసభ కేవలం ఈ విధంగానే

సమీక్షించింది - దక్షిణ-మధ్య బీహార్‌లో రైతాంగ పోరాటాల అభివృద్ధి పై పార్టీ దృష్టి పెట్టాలి. నినాదాలను సకాలంలో ఇచ్చి పోరాటావసరాలకు అనుగుణంగా ఉండే నిర్దిష్ట ప్రణాళికలను రూపొందించడంలో వైఫల్యం ఉద్యమం స్తబ్దతకు గురయి, ఆ తరువాత క్షీణించడానికి దారి తీసింది.

పార్టీ 1978లోనే పలాము జిల్లా వ్యూహాత్మక ప్రాధాన్యతను గుర్తించి, ఆ జిల్లాలోకి అడుగిడినప్పటికీ 1985లోనే పలాములో మూడు బ్లాకులకు, కోయిల్-కైమూర్ రీజియన్‌లో రోహతాస్ జిల్లాలో ఒక బ్లాక్‌కూ కార్యకలాపాలు వ్యాపించాయి. రెండు దళాలు పని చేస్తున్నాయి. 1998-90 నాటికి కేకే రీజియన్‌లో కూడా ప్రజా వెల్లువ వచ్చింది. ఈ కాలంలో కొన్ని దళాలు ఏర్పడ్డాయి. అయితే, కోయల్ కైమూర్ రీజియన్‌లో గెరిల్లా జోన్‌ను నిర్మించడానికి నిర్దిష్ట ప్రణాళిక లేకపోవడం, నాయకత్వంలో మేజర్ సెక్షన్ అరెస్టు కావడంతో ఆ ఉద్యమం 1991 తరువాత ప్రతిష్టంభన కాలంలోకి అడుగిడింది.

పార్టీ యూనిటీ చరిత్రలో రెండు ప్రధాన పార్టీ ఆంతరంగిక పోరాటాలు జరిగాయి. మొదటిది 1987లో, రెండోది 1997లో. 1987లో ముందుకు వచ్చిన ప్రత్యామ్నాయ పంథా, భాకపా(మాలె) మౌలిక పంథానే సవాలు చేసింది. ఈ పంథా ప్రబోధకులు స్వీయాత్మక అంచనాలు వేసి, వ్యవసాయ రంగంలో పెట్టుబడిదారీ సంబంధాలు అభివృద్ధి చెందిన కారణంగా అర్ధ భూస్వామ్య సంబంధాలలో మౌలిక మార్పులు వచ్చాయని, వ్యవసాయిక విప్లవానికి కాలం చెల్లిందనీ వాదించారు. ఇలా వాదించిన వారు నిర్దిష్ట ఎత్తుగడలను ప్రతిపాదించలేదు.

అయితే సాయుధ సార్వత్రిక తిరుగుబాటే దాని తార్కిక నిర్ధారణ అయి ఉండేది. అయితే ఈ వాదనను పీయూ 1987 సెంట్రల్ కాన్ఫరెన్స్‌లో ఓడించారు. వ్యవసాయ విప్లవం ఇరుసుగా ఉండే నూతన ప్రజాస్వామిక విప్లవం ఉన్న దీర్ఘకాల ప్రజాయుద్ధ పంథాను పునరుద్ఘాటించారు. తద్వారా పార్టీ మరింత ఉన్నత ప్రాతిపదిక పైన సమైక్యమయింది.

ఒక సీఓసీ సభ్యుడు 1993లో పార్టీ పంథా పై కొన్ని కీలక ప్రశ్నలను లేవదీసాడు. దాన్ని 1993 కాన్ఫరెన్స్‌లో ప్రవేశపెట్టినప్పటికీ, దాన్ని శ్రద్ధగా పట్టించుకోలేదు. 1996లో జరిగిన బీహార్ రాష్ట్ర మహాసభ మగధ్ రీజియన్‌లో 1985-86లో పోరాటాన్ని పురోగమింపజేయడంలో వైఫల్యాలను బేరీజు వేసింది. అయితే సీఓసీ దాన్ని కూడా తిరస్కరించింది. అది పీపుల్స్‌వార్‌తో ఐక్యతా క్రమంలో భాగంగా 1997 సెంట్రల్ కాన్ఫరెన్స్‌లో 18 సంవత్సరాల సమీక్షను చేపట్టినప్పుడు ఒక పూర్తి స్థాయి పోరాటంగా ముందుకు వచ్చింది. బీహార్ రాష్ట్ర మహాసభలో మెజారిటీ ఆమోదించినప్పటికీ క్రిటిక్ డాక్యుమెంట్‌ను సెంట్రల్ కాన్ఫరెన్స్ ఆమోదించలేదు. క్రిటిక్ డాక్యుమెంటు చేసిన కొన్ని విలువైన, సరైన విమర్శలను సెంట్రల్ కాన్ఫరెన్స్ రాజకీయ నిర్మాణ సమీక్షలో చేర్చింది. 1997లో రెండు పంథాల మధ్య పోరాటం పార్టీ యూనిటీ పంథా సుసంపన్నం కావడానికి దారి తీసింది. పార్టీ యూనిటీ, పీపుల్స్‌వార్ మధ్య ఐక్యతా

క్రమం మీద అనుకూల ప్రభావం వేసింది.

ఉద్యమాభివృద్ధి క్రమంలో కీలక మలుపుల వద్ద నాయకత్వం తీసుకున్న నిర్ణయాలు, ఎత్తుగడలలోనూ అవే పాత పోరాట, నిర్మాణ రూపాలను కొనసాగించడంలోనూ మునుపటి పార్టీ యూనిటీలో అన్యవర్గ ధోరణుల ప్రభావం ప్రతిఫలించింది. మగధ్, కోయిల్ కైమూర్ ప్రాంతంలో గెరిల్లా జోన్ నిర్మించమనే నినాదాన్ని సకాలంలో ఇవ్వకపోవడంలోనూ, ఆ కర్తవ్యాన్ని చేపట్టిన తరువాత దాన్ని నెరవేర్చడానికి నిర్దిష్ట ప్రణాళికలను తయారు చేయకపోవడంలోనూ పార్టీలో స్వీయాత్మకత, మితవాద ధోరణి ప్రత్యేకించి కనబడతాయి. అదే విధంగా 1980వ దశకం మధ్య భాగంలో పశ్చిమ బెంగాల్‌లో నాడియా జిల్లాలో రైతాంగాన్ని పెద్ద ఎత్తున పోరాటాలలోకి సమీకరించినప్పటికీ ఆ పోరాటాన్ని మరో ఉన్నత దశకు పురోగమింపజేయకపోవడం అనే అంశం కూడా పార్టీ నాయకత్వంలో స్వీయాత్మకత, మితవాద ధోరణిని ప్రతిబింబిస్తుంది. చైనా కమ్యూనిస్టు పార్టీని, లిబరేషన్ గ్రూపును రివిజనిస్టులుగా ప్రకటించడంలో జరిగిన అసాధారణ జాప్యం వంటి రాజకీయ సమస్యల విషయాలలో సైతం నాయకత్వంలో ఉదారవాదం కనపడింది. లీగలిజాన్ని అదుపు చేయకపోవడం, నాన్ ప్రొఫెషనలిజం, కొన్ని ప్రాంతాలలో అతి ప్రజాస్వామ్యాలలో కూడా ఉదారవాదం కనపడుతుంది. కొన్ని ప్రాంతాలలో ఉద్యమం పురోగమించడానికి, గిడసబారిపోవడానికీ ఈ అన్యవర్గ ధోరణులు దారి తీసాయి.

స్వీయాత్మకత, పెత్తందారీతత్వం, పురుషాధిపత్యం వంటి అన్యవర్గ ధోరణులు 1997లో కేంద్ర మహాసభ నాటికే చాలా బలంగా ఉన్నాయి. కానీ కేవలం స్పాంటేనిటీ, ఉదారవాదం, లీగలిజాలనే గుర్తించాం. ఈ తప్పుడు ధోరణులను సరిదిద్దడానికి గట్టి ప్రయత్నాలంటూ జరగలేదు. దాంతో ఉద్యమం మీద ప్రతికూల ప్రభావం పడింది.

### పీపుల్స్‌వార్‌కు, పార్టీ యూనిటీకి మధ్య ఐక్యత

భాకపా(మాలె)(పీపుల్స్‌వార్), భాకపా(మాలె)(పీయూ) రెండూ మొదటి నుంచీ ఐక్యతకు అత్యధిక ప్రాధాన్యతని ఇస్తూ వచ్చాయి. భాకపా(మాలె)లో భాగంగా ఉన్నా లేకపోయినా నిజమైన కమ్యూనిస్టు విప్లవ సంస్థల మధ్య ఐక్యత గురించి రెండూ నొక్కి చెప్పాయి.

70వ దశకంలో పీపుల్స్‌వార్ నిజమైన ఎంఎల్. నిర్మాణాల మధ్య ఐక్యతను ఒక సత్వర కర్తవ్యంగా గుర్తిస్తూ 1980లో ఒక గీటురాయిని రూపొందించింది. ఈ గీటురాయి ప్రకారం, ఎంఎల్ శక్తులలో ఎన్నికలలో పాల్గొనేవారు, వాటిని బహిష్కరించేవారుగా విభజన ఏర్పాటయింది.

పై వర్గీకరణకు అనుగుణంగా భాకపా(మాలె) ఆంధ్ర రాష్ట్ర కమిటీకి, భాకపా(మాలె)(పీయూ)కీ మధ్య 1979-80ల మధ్య ఐక్యతా చర్చలు జరిగాయి. గతాన్ని అంచనా వేయడం, ఎత్తుగడల పంథాల పై అవి ఉమ్మడి అవగాహనకు వచ్చాయి. కానీ పార్టీ అనే భావన, కేంద్ర కమిటీ ఏర్పాటు, కాంగ్రెస్ నిర్వహణ విషయాలలో భేదాభిప్రాయాల వల్ల ఐక్యత సాధ్యం కాలేదు. కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని ఆచరించినప్పటికీ వివిధ భాకపా(మాలె) సంస్థలు కేవలం గ్రూపులనీ

మూల భాకపా(మాలె)లో భాగమనీ అందువల్ల వాటిని పార్టీలుగా భావించకూడదని పార్టీ యూనిటీ పట్టుబట్టింది. భాకపా(మాలె)కు చెందిన ప్రధాన విప్లవ గ్రూపులను ఐక్యం చేసిన తరువాతనే పార్టీనీ సీసీనీ ఏర్పరచాలనీ అది భావించింది.

విలీనం మొదట జరగవచ్చునని, అటు తరువాత ఏకమైన పార్టీలో కేంద్రీకృత ప్రజాస్వామ్యం ప్రాతిపదికన ఈ సమస్య పై చర్చలు జరపవచ్చునని పార్టీ యూనిటీ ప్రతిపాదించింది. ఇక ఐక్య పార్టీనీ, కేంద్ర కమిటీని ఏర్పరచడం అనేది ఒక ముఖ్య సమస్య అనీ, కాబట్టి, కేంద్ర కమిటీ ఏర్పాటు, కాంగ్రెస్ నిర్వహణ అనే సమస్య పైనే తీవ్ర భేదాభిప్రాయం ఉన్నప్పుడు అది రెండు పార్టీల నిజమైన ఐక్యతకు తోడ్పడదని పీపుల్స్‌వార్ భావించింది. 1970వ దశకంలో భాకపా(మాలె) గ్రూపుల మధ్య ఐక్యతా ఆ తరువాత చీలికలూ జరిగిన నేపథ్యంలో, విలీనానికి ముందుగానే ఈ అంశం పై విభేదాలను పరిష్కరించుకోవాలనీ అప్పుడే కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని నిజంగా అమలు చేయగలమనీ పీపుల్స్‌వార్ పట్టుబట్టింది.

ఏపీఎస్‌సీ, టీఎన్ఎస్‌సీ, పీయూల ఐక్యతా క్రమంలో పీయూతో విభేదాలు రావడంతో ఆంధ్ర రాష్ట్ర కమిటీ, తమిళనాడు రాష్ట్ర కమిటీలు 1980లో ఏప్రిల్ పీడబ్ల్యూని ఏర్పరిచాయి. ఆ తరువాత పార్టీ యూనిటీ కూడా పంజాబ్‌కు చెందిన కా.శర్మ సీఓసీతో విలీనమయింది. పీడబ్ల్యూ, పీయూల మధ్య ఐక్యతా చర్చలు విఫలం అయిన తరువాత ఈ రెండింటి మధ్యనూ క్రమమైన సంబంధం లేదు. ఆ తరువాత 80ల చివరిలో పీయూ చైనా పట్ల స్థిరమైన వైఖరి తీసుకున్నప్పుడు తిరిగి సంబంధాలు ఏర్పడ్డాయి. పీయూను కలిసి వివిధ సైద్ధాంతిక రాజకీయ అంశాల గురించి అభిప్రాయాలు ఇచ్చి పుచ్చుకోవాలని 1991లో పీడబ్ల్యూ నిర్ణయించింది.

పీపుల్స్‌వార్, ఎంసీసీలు మొట్టమొదటగా 1981లో కలిసాయి. అప్పటి నుంచీ రెండు పార్టీల మధ్యా సుహృద్భావ సంబంధాలే ఉన్నాయి. క్రమంగా ఈ రెండు పార్టీలూ ఐక్యతకు ప్రాతిపదిక ఉందని భావించాయి. కా.కేఎస్, కేసీలు ఐక్యతా చర్చలను మొదలుపెట్టారు. అందుకని సహజంగానే రెండు పార్టీలూ చర్చల కొనసాగింపుకు ప్రాధాన్యత ఇచ్చాయి.

నాలుగు పార్టీల మధ్య (పీపుల్స్‌వార్, ఎంసీసీ, పార్టీ యూనిటీ, మహారాష్ట్ర పీపుల్స్‌వార్) సమిష్టి కార్యకలాపాలు 1992-93లో మొదలయిన తరువాత ఈ నాలుగింటి మధ్య కొంత అనుకూల అవగాహన వచ్చింది. ఈ తరుణంలో మునుపటి పీపుల్స్‌వార్, ఎంసీసీల మధ్య ఐక్యతా చర్చలు ముందుకు సాగుతున్నాయి. అయితే ఈ చర్చలు 1995లో విఫలమయాయి. దాని తరువాత దేశీయ, అంతర్జాతీయ పరిస్థితి పై పీపుల్స్‌వార్, పార్టీ యూనిటీ ప్రతినిధుల మధ్య అభిప్రాయాల పరస్పర మార్పిడి క్రమంలో అనేక రాజకీయ అంశాల పై రెండు పార్టీల మధ్య ఉమ్మడి అవగాహన ఉందన్న అభిప్రాయానికి వచ్చాయి. దాంతో 1996లో ఐక్యతా చర్చలు మొదలయాయి.

దానికి అనుగుణంగానే రెండు పార్టీల మధ్య చర్చలు జరిగాయి. ఐక్యతకు ముందు

షరతుగా రెండు పార్టీలు రాజకీయ, నిర్మాణ సమీక్షలను ఆమోదింప జేసుకుని తీరాలని పీపుల్స్‌వార్ పట్టుబట్టింది. పీపుల్స్‌వార్ ఈ పనిని 1995 ప్రత్యేక మహాసభలో పూర్తి చేసింది. కాగా పార్టీ యూనిటీ 1997లో జరిగిన ప్రత్యేక మహాసభలో తన రాజకీయ నిర్మాణ సమీక్షను ఆమోదించింది. అన్ని మౌలిక డాక్యుమెంటుల పై ఐక్యత సాధించిన తరువాత అవి ఒక సూత్రబద్ధమైన సిద్ధాంత-రాజకీయ-నిర్మాణ ప్రాతిపదిక పైన విలీనమయాయి. తద్వారా ఒక ఐక్య భారత కమ్యూనిస్టు పార్టీ (మాలె)(పీపుల్స్‌వార్) కేంద్రంగా కేంద్ర కమిటీ (ప్రొవిజనల్)ను ఏర్పాటు చేసి, ఐక్యతా క్రమాన్ని పూర్తి చేసాయి. ఈ క్రమంలోనే 9వ కాంగ్రెస్‌కు సన్నాహాలు ప్రారంభమయాయి. 1972లో పార్టీ క్షీణించిన తరువాత జరిగిన విలీనాలన్నింటిలోకీ ఈ రెండు పార్టీల మధ్య జరిగిన విలీనం భారత విప్లవంలో అత్యంత ప్రముఖమైనది. ఈ విలీనం దేశంలోనూ బయటా కూడా విప్లవ శిబిరంలో ఉత్సాహం కలిగించింది. ఈ ఐక్యతతో భాకపా(మాలె) విప్లవ వారసత్వాన్ని కొనసాగిస్తున్న నిజమైన విప్లవకారులలో చాలా మంది ఇప్పుడు మన పార్టీలో ఐక్యమయారు.

అయితే, భాకపా(మాలె) స్రవంతిలో ఒక ముఖ్య శక్తి ఎంసీసీ బయటనే ఉండిపోవడం వల్ల నిజమైన కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యతా క్రమం పూర్తి కానట్టేనని నూతన పార్టీ గుర్తించింది. అలాగే సైద్ధాంతిక రాజకీయ అంశాల మీద మార్క్సిస్టు లెనినిస్టు శిబిరంలో వివిధ సంస్థలతో మనం చర్చలు నిర్వహించాలనీ ఉమ్మడి శత్రువుకు వ్యతిరేకంగా ఐక్య కార్యక్రమం కొనసాగించాలనీ నిర్ణయమయింది.

**విప్లవంలో మూడు అద్భుతమైన ఆయుధాలను మలచడం**

పార్టీ రాజకీయ సైనిక పంథాలో సరైనదీ తప్పుడుదీ ఈ మూడు అద్భుతమైన ఆయుధాలను నిర్మించడంలోనూ దేశంలో మొత్తం మీద ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకువెళ్లడంలోనూ ఉన్న అభివృద్ధిలో ప్రతిబింబిస్తాయి. మునుపటి ఐక్య పీడబ్ల్యూ నాయకత్వంలో విప్లవోద్యమం దేశంలో అనేక రాష్ట్రాలకు వ్యాపించింది. భారత రాజకీయ రంగంలో చెప్పుకోతగ్గ శక్తి అయింది.

**ఒక నిజమైన కార్మికవర్గ పార్టీని నిర్మించడం**

1972 జులైలో కామ్రేడ్ సీఎం అమరత్వం తరువాత కేంద్ర నాయకత్వం, అంటే సీసీ లేదు. పై నుంచీ కింది వరకూ చాలా పార్టీ కమిటీలు నాశనమాయయి. ప్రతీ రాష్ట్రంలోనూ పార్టీ అనేక చీలికలయింది. విప్లవ వెల్లువ తగ్గింది. రైతాంగ పోరాటాలన్నీ వెనుకంజ వేసాయి. ఈ అతి క్లిష్టమైన కాలంలో దాని నుంచీ బయటకు రావడం, పార్టీని ఆరంభం నుంచీ నిర్మించడం మన మొట్టమొదటి కర్తవ్యం.

అమరవీరుల అపార త్యాగాలతో పొందిన గత పాఠాల నుంచీ మనం పార్టీని పునర్నిర్మించసాగాం. పునర్సంఘటితీకరణా పునరుజ్జీవనాలు పార్టీలోకి వివిధ రంగాలకు చెందిన నూతన తరం ప్రజలను తీసుకువచ్చాయి. ఈ పునరుజ్జీవనం ఉద్యమాన్ని నిర్మించడంలోనూ

నాయకత్వం వహించడంలోనూ గొప్ప పాత్ర వహించిన అనేక మంది పాత కేడర్‌ను కూడా మలిచింది. కొద్ది సంవత్సరాల పోరాట క్రమంలో వందలాది మంది పార్టీ సభ్యులు శిక్షితులయారు. పార్టీ కమిటీలు ఏర్పాటయాయి. ఒక నూతన నాయకత్వం, ముఖ్యంగా రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ఆవిర్భవించింది.

1969లో మునుపటి భాకపా(మాలె) పార్టీ పుట్టినప్పటి నుంచీ అది రహస్యంగా ఉంది. దోపిడీ పాలక వర్గాలను కూలదోసి రాజకీయాధికారం గుంజుకోవడానికి ప్రజాయుద్ధం చేస్తూ ఉంది. దశాబ్దాల పాటు తీవ్రమైన సాయుధ పోరాట క్రమంలో క్రూర అణిచివేత క్యాంపెయిన్‌లను ఎదుర్కొంటూ మన పార్టీ అభివృద్ధి చెందింది. ప్రకాశవంతమైన ఎర్రని విప్లవ పంథాను మలుస్తూ అనేక మంది గొప్ప నాయకులతో సహా వేలాది మంది అమరులయారు. రహస్య పని విధానంలో మనం గొప్ప అనుభవం సంపాదించినప్పటికీ కచ్చితమైన అజ్ఞాత పని విధానంలో అనేక పొరపాటులకు పాల్పడ్డాం. అనేక పెద్ద నష్టాలు ఎదుర్కొన్నాం. మనం మరింత శాస్త్రీయమైన పద్ధతులను పెంపొందించుకోవాలి. రహస్య పని విధాన సూత్రాలకు కచ్చితంగా కట్టుబడి ఉండాలి. బహిరంగ, లీగల్ పనికీ రహస్య, ఇల్లీగల్ పనికీ మధ్య సమర్థవంతంగా సమన్వయం సాధించడంలో ఇంకా సమస్యలు ఉన్నాయి.

రెండు ప్రధాన అంతర్గత పార్టీ సంక్షోభాలతో మునుపటి పీపుల్స్‌వార్ పార్టీ రాటు దేలింది. మరింతగా అంతర్గత ఐక్యత సాధించింది. విమర్శ ఆత్మవిమర్శ పద్ధతి మన పార్టీ జీవితంలో ఒక అంతర్భాగమయింది. అఖిల భారత ప్రత్యేక మహాసభ సమయంలోనూ ఆ తరువాత తొమ్మిదో కాంగ్రెస్‌లోనూ మనం తప్పుడు ధోరణులను గుర్తించాం. ముఖ్యంగా పీడబ్ల్యూ 9వ కాంగ్రెస్ తరువాత దిద్దుబాటు క్యాంపెయిన్‌ల ద్వారా పార్టీలో ఉన్న వివిధ పెటీ బూర్జువా ధోరణులను పారదోలడానికి గట్టి ప్రయత్నాలు జరిగాయి.

అఖిల భారత ప్రత్యేక మహాసభను విజయవంతంగా నిర్వహించడం, నూతనంగా విస్తరించిన రాష్ట్రాలలో పార్టీని సంఘటితం చేయడంతో మునుపటి పీపుల్స్‌వార్‌కు అఖిల భారత హోదా ఏర్పడింది. ఆంధ్రప్రదేశ్, చత్తీస్‌గఢ్ (అప్పుడు మధ్యప్రదేశ్), మహారాష్ట్ర, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్, బీహార్ (ప్రస్తుత జార్ఖండ్), హర్యానా మొదలయిన రాష్ట్రాలలో పార్టీ యూనిట్‌లు ఉన్నాయి. పీపుల్స్‌వార్ పీయూల విలీనం ఐక్య పార్టీ హోదాను మరింతగా పెంచింది. ఆ సమయంలో ఎంసీసీతో చర్చలు విఫలం కావడం కచ్చితంగా ఒక ప్రతికూల పరిణామమే. మనం ఐక్యం అవుతున్నామని దశాబ్దానికి పైగా ప్రచారం జరిగిన తరువాత చర్చలు విఫలం కావడం విప్లవ శక్తులకు నిజంగా నిరాశాజనకమైన విషయం.

మూడున్నర దశాబ్దాల పార్టీ నిర్మాణ చరిత్ర అనేక అనుకూల విజయాలను తెలియజేస్తుంది. అలాగే అర్ధ వలస, అర్ధ భూస్వామ్య భారతదేశంలో ఒక నిజమైన, కార్మికవర్గ పార్టీని నిర్మించడంలో మనం ఎదుర్కొన్న తీవ్ర సమస్యలను కూడా వెలుగులోకి తెస్తుంది.

మొదటిది, భాకపా(మాలె) ఏర్పాటు భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో ఒక పెద్ద ఆవిష్కరణే. అది ఒక విప్లవ పార్టీ అంటే ఎలా ఉండాలనే విషయాన్ని దేశ పీడిత ప్రజలకు చాటి చెప్పింది. కచ్చితంగా రహస్యంగా ఉండే పార్టీ, ఇందులో అత్యంత అంకిత భావంతో పని చేసే పురోగామి వ్యక్తులు కేంద్రకంగా లేదా కోర్‌గా ఉంటారు. నిజమైన అర్థంలో కేంద్రీకృత ప్రజాస్వామ్య ప్రాతిపదిక పై పని చేస్తుంది. వర్గ పోరాటాన్ని ఉధృతం చేసే క్రమంలో తన్ను తాను సరిదిద్దుకుంటుంది. వేలాది మంది పీఆర్‌లు కోర్‌గా ఉన్న విప్లవ పార్టీని నిర్మించడంలో మనం విజయం సాధించినప్పటికీ, ప్రజలలో వివిధ సెక్షన్‌లలో విస్తరించి ఉండే పార్ట్ టైమర్ యంత్రాంగాన్ని నిర్మించడంలో మనం విఫలమయాం. ఆ కాలంలో అది పార్ట్ టైమర్‌లకు సంబంధించిన భావన, అవగాహనలతో ముడిపడి ఉన్న సమస్య. విప్లవం కోసం పూర్తి కాలం పని చేయడానికి వచ్చిన వారికే పార్టీ సభ్యత్వం ఇచ్చాం.

తరువాత కాలంలో ఈ తప్పుడు అవగాహన సరిదిద్దుకుని, పార్ట్ టైమర్‌లకు సభ్యత్వం ఇచ్చినప్పటికీ పార్టీలో పార్ట్ టైమర్‌ల పాత్ర ఇప్పటికీ అంత చెప్పుకోతగ్గ విధంగా లేదు. దేశంలో పీడిత ప్రజల పై పార్టీ ప్రభావంతో పోల్చి చూసినప్పుడు పార్ట్ టైమర్ సెల్లులు చాలా కొద్దిగానే ఉన్నాయి. ఆ విధంగా స్థానిక పార్టీ నాయకత్వం ఇంకా బలహీనంగానే ఉంది. తమ సమస్యల సాధనకు లేదా శత్రువును ప్రతిఘటించడానికి ప్రజారాశులు ఇప్పటికీ పీఆర్‌ల పైనో దళాల పైనో ఆధారపడుతూనే ఉన్నారు. ఇది పార్టీలో పెత్తందారీతత్వం, వ్యక్తితత్వవాదం, స్వీయాత్మకత వంటి పలు కార్మికవర్గేతర ధోరణులు తల ఎత్తడానికి కూడా దారి తీసింది.

రెండోది, భారత విప్లవానికి ఒకే ఒక దిశా నిర్దేశ కేంద్రం ఏర్పాటు సమస్య. ఇది 1972లో వెనుకంజ, కా.సీఎం అమరత్వం తరువాత సీసీ విచ్ఛిన్నం అయినప్పటి నుంచీ మనలను వేధిస్తున్న సమస్య. ఒక కేంద్రం ఏర్పాటు కావడానికి 1998లో పీడబ్ల్యూ, పీయూల విలీనం ఒక పెద్ద అడుగు. పీడబ్ల్యూ ఎంసీసీఐల విలీనం తరువాత ఇది మౌలికంగా పూర్తయింది.

మూడోది, పార్టీ తొలి కాలంలో మాదిరిగా కాక, వివిధ స్థాయిలలో సాపేక్షికంగా బలమైన, సమర్థవంతమైన పార్టీ కమిటీలను నిర్మించడంలో కొంత మేరకు విజయం సాధించింది. కేంద్ర నాయకత్వం పటిష్టపడి, బలాన్ని సంతరించుకోవడం ఒక దీర్ఘకాల పోరాట పార్టీలో ఆంతరంగిక పోరాటం, వర్గ శత్రువులు, వారి ప్రతినిధి అయిన రాజ్య యంత్రాంగానికి వ్యతిరేక సాయుధ పోరాట క్రమంలో సాధ్యపడింది. మనం పార్టీని నిర్మించడంలో, నాయకత్వ కొనసాగింపు లోపించడం అన్నది ఎల్లవేళలా ఒక తీవ్ర సమస్యగానే ఉంది.

నాలుగోది, వివిధ కార్మికవర్గేతర ధోరణులు, సిద్ధాంత రాజకీయ బలహీనతలను వదిలించుకోవడానికి దిద్దుబాటు క్యాంపెయిన్‌ల నిర్వహణ ద్వారా పార్టీని బలోపేతం చేయడానికి సాగిన ప్రయత్నాలు కొన్ని రాష్ట్రాలు, స్పెషన్ జోన్‌లలో అనుకూల ఫలితాలనిచ్చాయి. పార్టీ నాయకత్వం, కేడర్‌లూ పెడ ధోరణులనూ బలహీనతలనూ మరింత లోతుగా గ్రహించి కొంత

మేరకు బయటపడగలిగారు. కానీ కొన్ని రాష్ట్రాల్లో నాయకత్వ కమిటీలలో ఒక సెక్షన్‌లో ఈ సమస్య తీవ్రంగానే కొనసాగుతోంది. గత కొన్ని సంవత్సరాలలో కొంత మెరుగుదల ఉన్నప్పటికీ స్వీయాత్మకత, ఉదారవాదం, స్పాంటేనిటీ, ఒంటెత్తుపోకడ, పెత్తందారీతత్వం, లీగలిజం మొదలయిన సమస్యలు వివిధ స్థాయిల్లో పార్టీని ఇంకా వెంటాడుతూనే ఉన్నాయి. ప్రొఫెషనలిజం లోపించడం అనే సమస్య కూడా ఉంది.

చివరిగా, పార్టీ వర్గ పునాది మొదట్లో పెటీ బూర్జువా స్వభావం కలదిగా ఉండేది. అది క్రమంగా మౌలిక వర్గాల స్వభావానికి చేరుకుంది.

కేడర్‌లలో అత్యధిక సంఖ్యాకులు అత్యంత పీడిత సెక్షన్‌లయిన భూమి లేని రైతులు, పేద రైతుల నుంచీ వచ్చిన వారే కాగా, మధ్య తరగతి రైతులు, పట్టణ పెటీ బూర్జువా వర్గం గణనీయమైన సెక్షన్‌గా ఉంది. ప్రత్యేక సామాజిక సెక్షన్‌ల నుంచీ కేడ్‌లను రిక్రూటు చేసుకుని ప్రమోట్ చేయడం మీద ప్రత్యేక శ్రద్ధ పెట్టిన ఫలితంగా, ప్రత్యేకించి 1995 తరువాత, పార్టీలో ఇప్పుడు దళితులు, మహిళలు, ఆదివాసీల నుంచీ వచ్చిన సభ్యులు మంచి సంఖ్యలోనే ఉన్నారు. అయినా, ఈ పీడిత సెక్షన్‌ల పై ప్రత్యేకించి వారిని నాయకత్వ స్థానాలకు ప్రమోట్ చేయడం మీద ఇతోధిక కేంద్రీకరణ అవసరం ఉంది.

కార్మికవర్గం పై కేంద్రీకరణ లోపించడం మన పార్టీ నిర్మాణ కృషిలో ప్రధాన బలహీనత. దాని ఫలితంగా కార్మికవర్గ నేపథ్యం నుంచీ వచ్చిన కేడర్‌లు బహుకొద్ది మందే ఉన్నారు. మనం ఉన్న అర్ధ వలస సమాజంలో రైతాంగమే రిక్రూట్‌మెంటుకు ప్రధాన వనరు అయినప్పటికీ, ఈ మౌలిక చోదకశక్తి పై కేంద్రీకరించి వారిని నాయకత్వ స్థానాలకు ప్రమోట్ చేయవలసిన అవసరం ఉన్నదని సంఘటిత, అసంఘటిత కార్మికవర్గపు అపార సంఖ్య చాటి చెబుతున్నది. అలా చేయడం ద్వారా వారు విప్లవంలో తమ నాయకత్వ పాత్రను పోషించగలుగుతారు.

### ప్రజా సైన్యాన్ని నిర్మించడం

ప్రజా సైన్యాన్ని నిర్మించడం అన్నది భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో నిరంతరంగా ఎదురవుతున్న సమస్య. రివిజనిస్టులు పెత్తనం చెలాయించిన నక్సల్బరీ పూర్వకాలం సంగతి అటుంచి, మాగుర్‌జాన్‌లో ప్రజా గెరిల్లాలు శత్రు బలగాల నుంచీ ఆయుధాలు గుంజుకున్న తరువాతనే మనం బీజ రూపంలో ప్రజా విముక్తి సైన్యం ఏర్పడిందని మొట్టమొదటిసారిగా ప్రకటించాం. 1972లో తీవ్ర వెనుకంజ కారణంగా దీన్ని అభివృద్ధి చేయలేకపోయాం.

మనం సైన్యాన్ని ఏమీ లేని స్థితి నుంచీ నిర్మిస్తున్నాం కనక ప్రజాసైన్యాన్ని నిర్మించే పనిలో చాలా సంక్లిష్టతను ఎదుర్కొంటున్నాం. సాయుధ పోరాటం ద్వారా రాజకీయాధికారాన్ని స్వాధీనం చేసుకోవడం, యుద్ధం ద్వారా సమస్యలను పరిష్కరించడం అనే వ్యూహాత్మక భావనతోనే మన పార్టీ మొట్టమొదటి నుండీ పని చేస్తూ వస్తోంది. నక్సల్బరీ, శ్రీకాకుళ పోరాటాలు వెనుకంజ వేసిన తరువాత తెలంగాణాలోనూ డీకేలోనూ మనం దళాలు నిర్మించడానికి

ప్రయత్నించాం. ఈ దళాలు నిర్మాణ, సైనిక కర్తవ్యాలు రెంటినీ నిర్వర్తించాయి. అప్పటి నుంచీ మన పార్టీ గెరిల్లా దళాలను, గెరిల్లా యుద్ధాన్నీ అభివృద్ధి చేస్తోంది.

బీహార్‌లో మగధ్ రీజియన్‌లో 1981లో సాయుధ దళాలు ఏర్పాటయాయి. ఇవి భూస్వాములను, వారి ప్రైవేటు సేనలను ఎదుర్కోవడానికి ఏర్పాటు చేసిన సాయుధ రైతాంగ దళాలు. వాటిలో గెరిల్లాలు, మిలీషియా సభ్యులు ఇరువురూ ఉన్నారు. ఈ దళాలతో పాటు నిర్మాణపరమైన నిర్బంధపరమైన విషయాలను దృష్టిలో ఉంచుకుని ఆర్గనైజర్‌లను కలగలపడం ద్వారా తాత్కాలిక దళాలను కూడా అడపా దడపా ఏర్పాటు చేసాం.

కొన్ని ప్రాంతాలలో మనం 1993 నాటికే స్పెషల్ మిలిటరీ స్క్వాడ్స్ ఏర్పాటు చేసాం. అయితే చాలా కాలం వరకూ ఇవి సాధారణ రూపం తీసుకోలేదు. 1994-95 నుంచీ రాజ్యానికి వ్యతిరేకంగా యుద్ధం చేయడానికి స్పెషల్ గెరిల్లా స్క్వాడ్స్‌ను ఏర్పరిచాం. అయితే అప్పుడు వాటికి సాధారణ రూపం ఇవ్వలేదు. ఇలా స్పెషలైజేషన్ చేపట్టి, సైనిక, నిర్మాణ కర్తవ్యాల కోసం విడి విడి దళాలు ఏర్పరిచాం. అయితే ఎల్‌జీఎస్‌లూ సీజీఎస్‌లూ ప్లాటూన్‌లను ప్రత్యేక సైనిక కమాండ్ కిందకు తీసుకురాలేదు.

సైనికం మీద ప్రత్యేకంగా కృషి చేయడానికీ కేంద్రీకరించడానికీ 1996లో ఒక ప్రత్యేక సబ్ కమిటీ, కేంద్ర స్థాయిలోనూ కొన్ని రాష్ట్రాలలోనూ స్కోమానూ ఏర్పాటు చేసాం. దీంతో సైనిక రంగంలో స్పెషలైజేషన్ ఏర్పడింది. మన సాయుధ ప్రతిఘటన మెరుగుపడింది. అప్పటికీ పీజీఏనూ ప్రత్యేక కమాండ్ స్వరూపాలనూ ఏర్పరచడం పట్ల మనకు స్పష్టత లేదు. అందుకని 1995 ప్రత్యేక మహాసభ నాటికే పరిస్థితి పరిపక్వం అయినప్పటికీ సీసీలో స్వీయాత్మకతా స్పాంటేనిటీ వల్ల పీజీఏ ఏర్పాటు చేసే కర్తవ్యాన్ని చేపట్టలేదు. 2000 ఆగస్టులో సీసీ పీజీఏను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం 2000 డిసెంబరు 2వ తేదీన అమలులోకి వచ్చింది.

బీహార్‌లో, మునుపటి పార్టీ యూనిటీ ప్రాంతాలలో 1987లో ఆర్‌సీల నాయకత్వం కింద *కమాండర్ కమిటీలు* ఏర్పరచబడ్డాయి. వీటిని ఆ తరువాత 1993లో *సైనిక సంచాలన్ టీములు* గా పరివర్తన చెందించాం. అవి దళాల సైనిక, తదితర అవసరాలను తీర్చాయి. ఇవి సాయుధ దాడులను సమన్వయించాయి. ఇది మొదటి మగధ్ రీజియన్‌లోనూ, అటు తరువాత కోయిల్-కైమూర్‌లోనూ ఏర్పరిచాం. అయితే వాటిని కమాండ్ అవగాహనతో ఏర్పరచినప్పటికీ, నిర్దిష్ట ప్లానింగు లేకపోవడంతో అవి కమాండ్ దిశలో అభివృద్ధి చెందలేదు. 1997లో మునుపటి పార్టీ యూనిటీ బీహార్‌లో ఒక మిలటరీ ఎఫైర్స్ కమిటీని ఏర్పాటు చేసింది.

అభివృద్ధి క్రమంలో మనం ప్రత్యక్ష, పరోక్ష జ్ఞానం, అనుభవాలతో జ్ఞానాన్ని సంపాదించుకున్నాం. అది పీజీఏ ఏర్పాటుకూ, ప్రజాసైన్యానికి నేరుగా గైడ్ చేసే నాయకత్వాన్నిందించేందుకు ఒక పూర్తి స్థాయి సీఎంసీని విడిగా ఏర్పాటు చేసేందుకు దారి

తీసింది.

1995లో మనం ఎన్‌టీ, డీకే, గెరిల్లా జోన్‌లలోనూ, ఈస్ట్ డివిజన్‌లోనూ ప్రజల రాజకీయాధికార అంగాలను నిర్మించే కర్తవ్యాన్ని చేపట్టాం. ప్రజలను సమస్త అధికారమూ విప్లవ ప్రజా కమిటీలకే అనే నినాదంతో ఎడ్యుకేట్ చేసే కర్తవ్యం పై మొదటి నుంచీ వక్కాణింపునిచ్చాం.

ప్రజా పోరాటాల పలితంగా భూస్వామ్య శక్తుల కుల, తెగ పెద్దల అధికారం దెబ్బతిని ప్రజల రాజకీయాధికారం బీజ రూపంలో నెలకొల్పుతున్న సమయంలో ప్రజలకు రాజకీయాధికార అంగాలుగా ఈ జీఆర్‌సీలు నాయకత్వాన్నందించాయి. జీఆర్‌సీలు కొన్ని గ్రామాలలోనే నెలకొల్పినప్పటికీ మనం వీటి ద్వారా ప్రజలకు నూతన రాజకీయాధికారాన్ని గురించి ఒక అవగాహనను పెంపొందింపజేయసాగాం. గెరిల్లా జోన్‌లలో ప్రజల చైతన్యం ఒక కొత్త దృక్పథంలో అభివృద్ధి చెందింది.

ఎన్‌టీ గెరిల్లా జోన్‌లో తీవ్ర శత్రు నిర్బంధం మూలంగా జీఆర్‌సీలు పని చేయకుండా పోయాయి. డీకేలో కూడా శత్రు నిర్బంధం తీవ్రంగా ఉన్నా గడ్‌చిరోలి లాంటి ప్రాంతాలలో జీఆర్‌సీలను నిర్మించడం కష్టమవుతోంది. జీఆర్‌సీలు సమర్థవంతంగా రాజ్య వ్యతిరేక పోరాటం చేయాలంటే ప్రజా రాశుల చైతన్యాన్ని పెంపొందింపజేయడం అవసరం. ప్రభుత్వ సంస్కరణలను ఓడించడానికి ప్రజల చైతన్యాన్ని పెంపొందించాలి. జీఆర్‌సీలు కొత్త రాజకీయ అధికారాన్ని నిలబెట్టుకుని, శత్రువును సమర్థవంతంగా ఎదుర్కోవాలీ అంటే ప్రజల సాయుధ బలగాల ఉనికి అనివార్యమవుతుంది. మనం కొత్త రాజకీయాధికారాన్ని పీజీఏతో జోడించకపోతే అది నిలదొక్కుకుని మరింత అభివృద్ధి కాలేదు. మనం ఈ అంశాన్ని స్పష్టంగా గ్రహించలేదు కాబట్టే జీఆర్‌సీలను నిలబెట్టుకోలేకపోయాం.

ప్రజా మిలీషియా పాత్రను గుర్తించినప్పటికీ ఒక విస్తృతమైన వ్యవస్థను నిర్మించడంలో పెద్దగా ఏమీ సాధించలేదు. అందువల్లనే మన ప్రతిఘటన కూడా విస్తృతం కాలేదు. గ్రామాలలో కొత్త రాజకీయాధికారాన్ని నెలకొల్పడానికి జీఆర్‌సీల నేతృత్వంలో శత్రువుపై యుద్ధం చేయాలంటే ప్రజలకు ప్రజా మిలీషియా అత్యంత అవసరం. గ్రామాలలో నూతన రాజకీయాధికారాన్ని నెలకొల్పడానికీ ప్రజలు జీఆర్‌సీ నాయకత్వంలో శత్రువుకు వ్యతిరేకంగా యుద్ధం చేయడానికీ ప్రజా మిలీషియా అవసరం. మిలీషియా బలహీనంగా ఉండడం వల్ల మనం స్థానిక వర్గ శత్రువులను అణిచిపెట్టలేకపోయాం. ఇన్‌ఫార్మర్‌లను అదుపు చేయలేకపోయాం. శత్రువుకు వ్యతిరేకంగా వేధింపు కార్యకలాపాలు చేపట్టలేకపోయాం. ప్రజలను సాయుధం చేయలేకపోయాం.

**ప్రజలను ప్రజాయుద్ధానికి సంసిద్ధం చేయడం**

1972 తరువాత ప్రజా సంఘాల పాత్రకు సంబంధించి లోపభూయిష్టమైన అవగాహనను సరిదిద్దుకున్నాం. ప్రజా సంఘాల ద్వారానే ప్రజలు సంఘటితం అవుతారనీ వర్గ పోరాటాలలోకి

వస్తారనీ ఈ పోరాటాల ద్వారానే, దోపిడీ వర్గాల అధికారాన్ని కూలదోసి తమ సొంత రాజకీయ అధికారాన్ని నెలకొల్పడం మినహా అన్ని రకాల పీడన నుంచీ దోపిడీ నుంచీ తమ్మి తాము రక్షించుకోవడానికి మరో ప్రత్యామ్నాయం లేదనీ గుర్తిస్తారు.

ప్రారంభం నుంచీ కూడా, ప్రజా సంఘాలు, ప్రజా పోరాటాల నిర్మాణ దృక్పథం, పర్స్‌పెక్టివ్, పద్ధతీ యుద్ధ సన్నాహానికి సేవ చేసే విధంగా ఉండాలనీ యుద్ధం తిరిగి ప్రజా ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లడానికి దోహదం చేస్తుందన్న మావోయిస్టు మార్గదర్శకానికి కట్టుబడి ప్రజా సంఘాలు నిర్మిస్తూ వచ్చాం. ప్రజా పోరాటానికీ సాయుధ పోరాటానికీ మధ్య ఈ గతితార్కిక అంతస్సంబంధం పునాదిగా మనం ప్రజలను లక్షల్లో సమీకరించడానికి ప్రయత్నించాం. మన విప్లవోద్యమ అభివృద్ధిలో ప్రజా సంఘాలు ప్రముఖ పాత్ర వహించాయి. యుద్ధం కోసం అనేక మంది కేడర్‌ను అందించాయి. అనేక వందల మంది నాయకులనూ సభ్యులనూ త్యాగం చేసాయి. రాజకీయ ప్రతిష్టనూ ప్రభావాన్నీ పేరునూ సంపాదించాయి.

మన ప్రజా సంఘాలన్నీ ప్రధానంగా సాయుధ పోరాటం నడుమ రాటుదేలాయి. ఈ గొప్ప పోరాటాలు భూస్వామ్యం పునాదిని కుదిపివేసాయి. వారి పాలక వర్గాలనూ సాయుధ శక్తులనూ వణికించాయి. వేలాది గ్రామాలోనూ అనేక నగరాలలోనూ జరిగిన పీడిత సెక్షన్‌ల పోరాటాలు పాలకవర్గాల ఆధిపత్యాన్నీ ఆర్థిక, రాజకీయ, సామాజిక పీడననూ దెబ్బ కొట్టాయి. భూస్వాముల సామాజిక ఆర్థిక రాజకీయ ఆధిపత్యాన్ని ధ్వంసం చేయడంలో ఇవి గొప్ప పాత్ర వహించాయి. ఆ తరువాత కాలంలో ప్రజల రాజకీయాధికార అంగాలకు పునాది అయాయి.

ఆంధ్ర, ఉత్తర తెలంగాణా, ఏఓబీలలో 1992-94లో పెద్ద ఎత్తున సాగిన శత్రు దాడి ప్రజలలో మన కృషికి తీవ్ర ఆటంకాలు సృష్టించడంతో ఏర్పడిన స్తబ్దతను బద్దలుకొట్టడంలో మనం విజయం సాధించాం. 1995 తదనంతర కాలంలో రాష్ట్రాలలో మన విప్లవ ప్రజా సంఘాలు, మన చొరవతో ఏర్పాటైన వివిధ కవర్ సంఘాల నాయకత్వం కింద ప్రజా ఉద్యమాలు తిరిగి వికసించాయి. పెద్ద ఎత్తున శత్రు దాడి సాగుతున్నప్పటికీ ఆంధ్ర, ఎన్‌టీ, ఏఓబీ, డీకే బీహార్, జార్ఖండ్‌లలోనూ, తమిళనాడులో ధర్మపురి సేలం, కర్నాటకలో రాయచూరు, బీహార్-బెంగాల్-ఒరిస్సా సరిహద్దు ప్రాంతం వంటి ఇతర ప్రాంతాలలోనూ పలు పోరాటాలు నడిచాయి. అందువల్లనే రాజ్యం ప్రత్యేక శిక్షణ పొందిన ప్రత్యేక పోలీసు బలగాలూ అర్ధ సైనిక బలగాలకు అత్యాధునిక ఆయుధాలు ఇచ్చి మోహరించింది. ఆంధ్ర, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, బీహార్ ఈ ఐదు రాష్ట్రాల మధ్య మరింత మెరుగైన సమన్వయం, సహకారం కోసం ఒక పథకాన్ని రూపొందించింది. 1998 జూన్‌లోలో కేంద్రం నేతృత్వంలో జాయింట్ కో ఆర్డినేషన్ కమిటీని, 2000 ఏప్రిల్‌లో జేటీసీనీ ఏర్పరిచింది. అదే సమయంలో రాజ్యం, ప్రజలను సమరశీల పోరాటాల నుంచీ దారి మళ్లించడానికి సంస్కరణలు, పందారాల కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతోంది.

ఆరంభంలో మన ప్రజా సంఘాలు కొద్ది కాలం పాటు ఆంధ్రప్రదేశ్‌లో కొన్ని ప్రాంతాలలో బహిరంగంగా పని చేసినప్పటికీ ప్రధానంగా అవి రహస్యంగానే పని చేసాయి. వర్గ పోరాటం బలహీనంగా ఉన్న కొన్ని ఇతర ప్రాంతాలలో రహస్యంగా పని చేసాయి. దండకారణ్యం వంటి ప్రాంతాలలో మన ప్రజా సంఘాలు అజ్ఞాతంలో ఉండి ప్రారంభం నుంచీ కూడా రహస్యంగానే పని చేసాయి. 1992లో మొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా సంఘాలను అధికారికంగా నిషేధించినప్పటికీ, 1900 నుంచీ ఉత్తర తెలంగాణాలోనూ, 1985 నుంచీ యావత్తు ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రారంభ రోజుల నుంచీ దండకారణ్యంలోనూ అప్రకటిత నిషేధం ఉన్నది. బీహార్‌లో ఎంకేఎస్ఎస్‌ను 1986లో నిషేధించారు. అయినప్పటికీ ఈ రాష్ట్రాలలో నిరంతరం భారీ ప్రదర్శలు జరుగుతున్నాయి.

మొత్తం మీద ప్రజా రంగంలో మన విజయాలు ప్రధానం, లోపాలు అప్రధానం. ఈ లోపాలు - ఈ పోరాటాలలోకి వచ్చిన శక్తులను సంఘటితం చేయడంలో వైఫల్యం, తక్కువ స్థాయి సభ్యత్వం, ప్రజా సంఘాలకు నిరంతర నాయకత్వాన్ని పెంపొందించడంలో వైఫల్యం, ఉన్నత, కింది స్థాయి నిర్మాణాల మధ్య సమన్వయంలో వైఫల్యాలూ, రహస్య, బహిరంగ పని మధ్య సమన్వయంలో వైఫల్యం, ప్రజా పోరాటాలలో ఒంటెత్తుపోకడలు, 1984కు ముందు బహిరంగ పనికి ఎక్కువ శ్రద్ధ పెట్టడం, ప్రజా సంఘాలనూ ప్రజా ఉద్యమాన్నీ నిర్మించడంలో స్పాంటేనిటీ, నూతన ప్రాంతాలకు విస్తరించడంలో పథకం లోపించడం. సాధారణంగా ఈ లోపాలు రాష్ట్ర, అఖిల భారత ప్రజా సంఘులకు వర్తిస్తాయి.

వివిధ స్థాయిలలో పార్టీ కమిటీలలో బలహీనతలు, ప్రత్యేక రంగంలో స్పష్టత, స్పెషలైజేషన్, అనుభవం లోపించడం, స్పాంటేనిటీ, కమిటీల మీద అపారమైన పని ఒత్తిడీ ఉండడం వల్ల సంబంధిత స్థాయిలలో ప్రజా సంఘ కమిటీలకు తగిన మార్గదర్శకత్వాన్ని అందించడంలో ఆటంకం అవుతున్నది. ప్రజా సంఘాలకు సన్నిహితంగా గైడెన్సు ఇవ్వడంలో ఒక ప్రధాన సమస్య ఏమంటే ఆ ప్రాంతాలలో శత్రు కేంద్రీకరణ, ప్రజా సంఘాల నాయకత్వాన్ని ఎదురుకాల్పులలో చంపడం ద్వారా తెల్ల భీభత్సం.

పోరాట, నిర్మాణ రూపాలకు సంబంధించి కొన్ని పార్టీ యూనిట్‌లలో యాంత్రిక అవగాహన ఉన్నది. పోరాట నిర్మాణ రూపాలు గిరిగీసినట్టు ఉండవు. మారుతున్న పరిస్థితులు, పోరాట దశలను బట్టి మారుతూ ఉంటాయి. ఒక ప్రాంతంలో రూపాలను యాంత్రికంగా మరో ప్రాంతంలో చేపట్టడం వ్యతిరేక ఫలితాలనిస్తుంది. ఒకే ప్రాంతంలో కూడా ఇవాళ అవలంబించిన రూపాలు రేపు ఉండకపోవచ్చు. మారుతున్న పరిస్థితులకు ఎత్తుగడలు సృజనాత్మకంగా అన్వయించడం, ఒక రూపం నుంచీ త్వరగా మరో రూపానికి మారడం వివిధ పార్టీ కమిటీలూ ప్రజా సంఘం నాయకత్వం నేర్చుకోవాలి. ప్రజలలో మన కృషిలో లీగలిజం ప్రధానంగా, సెక్షనల్ డిమాండ్‌లను సాధారణ ప్రజాస్వామిక స్వభావం కలిగిన ఇతర డిమాండ్‌లనూ పరిష్కరించడానికి లీగల్, బహిరంగ పని పద్ధతులూ లీగల్ బహిరంగపోరాటాల మీద ఆధారపడడంలో వ్యక్తం అవుతుంది.

దేశంలో ప్రజాయుద్ధానికి ఉన్న దీర్ఘకాలిక స్వభావాన్ని గురించి స్పష్టత లోపించడం వల్ల లీగల్, బహిరంగ ప్రజా ఉద్యమానికి ఉన్న అవకాశాల గురించి అతిగా అంచనా వేసుకోవడం నుంచీ లీగలిజం ముందుకు వస్తుంది.

ప్రజా సంఘాల నాయకత్వాలలో పెటీ బూర్జువా వ్యక్తివాదం, అహంకారం, అరాచక వైఖరులు, క్రమశిక్షణా రాహిత్యం, ఒంటెత్తు వైఖరి, నిరంకుశత్వం మొదలయినవి సాధారణంగా కనిపించే లక్షణాలు.

మన ప్రజా సంఘాలను బహిరంగంగా పని చేయనివ్వని చోట కవర్ సంఘాలు తప్పనిసరి. అవసరాన్ని బట్టి ఇతర ప్రాంతాలలో కూడా ఈ సంఘాలను ఏర్పాటు చేయవచ్చు. మన శక్తులను శత్రువుకు బహిర్గతం కాకుండా ఉంచడం కవర్ సంఘాలను ఏర్పాటు చేయడంలో ప్రధాన ఉద్దేశం. కవర్ సంఘాలు లీగల్ లేదా రహస్య ప్రజా సంఘాలకు బదులుగా ఏర్పాటు చేసేవి కాదన్న విషయం గుర్తుంచుకోవాలి. కవర్ సంఘాలలో పార్టీ యూనిట్‌లు ఏర్పాటు చేసి వాటికి మార్గదర్శకత్వం అందించాలి.

ఏపీ, ఎన్‌టీ, ఏఓబీలలో 1985లో కవర్ సంఘాలు ఏర్పాటు చేసే ప్రయత్నాలు ప్రారంభం అయినప్పటికీ 1995 తరువాత కాలంలోనే మనం కొద్దిపాటి ప్రగతి సాధించగలిగాం. కవర్ సంఘాల ద్వారా మనం ఒక పెద్ద సెక్షన్‌ను సమీకరించడంలో విజయవంతమయాం. తద్వారా, మన ప్రజా సంఘాలను నిషేధించి, ప్రజలకు నాయకత్వం లేకుండా చేయాలన్న పాలక వర్గాల ప్రయత్నాలను తిప్పికొట్టగలిగాం.

కవర్ సంఘాలు నడపడంలో కొన్ని లోపాలు - తేలికగా మాట్లాడడం, కవర్ సంఘాల కార్యక్రమాలకు పార్టీ భారీ ప్రజా సమీకరణలు చేయడం, తద్వారా వాటెని బహిర్గతం చేయడం, బహిర్గతమయిన ఉపన్యాసకులను కవర్ సంఘాల సభలకు పిలవడం, కవర్ సంఘాల నాయకత్వాలను మన ఏరియాలలో కలిసి వాళ్లను పార్టీకీ దళ సభ్యులకూ ఆ పరిసర గ్రామాల ప్రజలకూ బహిర్గతం చేయడం, పార్టీ దళాలూ కవర్ సంఘాలూ నిర్వహించే పోరాటాలలో పాలు పంచుకోవడం, పోరాటాలు విజయవంతం చేయడానికి శత్రువుకు హెచ్చరికలు చేయడం, కవర్ నిర్మాణాలకు ప్రగతిశీలమైన, రాడికల్‌గా అనిపించే పేరులు చూడడం, కవర్ సంఘాల వేదికల మీద మన నినాదాలు ఇచ్చి, మన పాటలు పాడడం, రాత్రికి రాత్రి కవర్ సంఘాలు ఏర్పరచడం, పోలీసుల దృష్టి మళ్లించడం, మొదలయిన లోపాలు ఉన్నాయి. కవర్ సంఘాలలో పని చేయడానికి సమర్థవంతమైన, అనుభవజ్ఞులైన పీఆర్‌లనూ ఆర్గనైజర్‌లనూ కేటాయించకపోవడం.

మనం ఐక్య సంఘటన పని మీద సరిగా కేంద్రీకరించలేదు. ఏ స్థాయిలోనూ స్పెషలైజేషన్ లేదు. ఇది ఐక్య సంఘటన కార్యకలాపాల మీద తీవ్రమైన ప్రతికూల ప్రభావం వేసింది. మనం స్పాంటేనియస్ ప్రజా ఉద్యమాలలో జోక్యం చేసుకోవడానికి లేదా ఇతర సంఘాలతో జాయింట్

ఫోరమ్‌లను నిర్మించడానికి శక్తులను కేటాయించడంలో విఫలమయాం. అందుకని మనం విప్లవ వర్గాలకు చెందిన శక్తులను మన వైపు తిప్పుకోవడంలో విజయం సాధించలేకపోయాం. ఉద్యమంలో, నాయకత్వంలో, పార్టీ కింది శ్రేణులలో ఒంటెత్తుపోకడ చాలా తీవ్రంగా నెలకొని ఉంది. దీన్ని రెండు రూపాలలో చూడవచ్చు. ఒకటి, ఉమ్మడి సమస్యల మీద ఇతర సంస్థలు ఆసక్తి చూపినప్పటికీ, వాటితో ఉమ్మడి కార్యాచరణకు కదలకపోవడం, ఒంటెత్తు పోకడ కార్యకలాపాలలో నిమగ్నులవడం వల్ల ఇది సంయుక్త కార్యాచరణ కమిటీల విచ్ఛిన్నానికి దారి తీసింది.

మునుపటి పీడబ్ల్యూ, ప్రజా సంఘాల నిషేధం కారణంగా ఐక్య సంఘటన పనిలో ఉన్న కామ్రేడ్స్ తీవ్ర పరిమితుల మధ్య పని చేయాలి. అందుకని సుదీర్ఘకాలం పాటు ఓపికతో, పట్టుదలతో పని చేయడం ద్వారానే మనం ఐక్య సంఘటన మీద మన నాయకత్వాన్ని నెలకొల్పగలుగుతాం.

**9వ కాంగ్రెస్, ఆ తరువాతా**

సిద్ధాంతపరంగా, రాజకీయపరంగా పరిణతి చెందిన పార్టీ ఆవిర్భావానికి దశాబ్దాల ఉధృత వర్గ పోరాటంలో రాటుదేలుతున్న ఒక కొత్త తరహా పార్టీకి 9వ కాంగ్రెస్ అద్దం పట్టింది. డజనుకు పైగా రాష్ట్రాలలో నిర్మాణాలతో ప్రజా గెరిల్లా సైన్యం పీజీఏ, అనేక శాఖలతో పార్టీ అఖిల భారత స్వభావాన్ని సంతరించుకుంది.

పార్టీ పంథా మరింత పటిష్టపడి మరింత సుసంపన్నం కావడాన్ని 9వ కాంగ్రెస్ చవి చూసింది. 1970లో 8వ కాంగ్రెస్ రూపొందించిన పార్టీ మౌలిక పంథాకు దృఢంగా కట్టుబడి ఉంటూనే 9వ కాంగ్రెస్ అవసరమైన మార్పులు చేసింది. పలు సంవత్సరాల కాలంలో సంపాదించుకున్న సుసంపన్న అనుభవం మీద ఆధారపడుతూ గత మూడు దశాబ్దాలలో రాజకీయ పరిణామాలను గమనంలోకి తీసుకుంటూ అనేక భావనలను సుసంపన్నం చేసింది. అది విప్లవం మూడు పని ముట్లయిన పార్టీ, సైన్యం, ఐక్య సంఘటనలను పోతపోసుకోవడంలోనూ ఎత్తుగడల రూపకల్పనలోనూ వ్యక్తమయిన మితవాద, అతివాద పెడ ధోరణులు రెంటితోనూ దృఢంగా పోరాడింది. ప్రజాసైన్యం, గెరిల్లాజోనులు, విముక్తి ప్రాంతాలు, విప్లవ ఐక్య సంఘటన భావనలకు సంబంధించి మరింత ఉన్నత స్థాయి అవగాహనను సాధించింది.

9వ కాంగ్రెస్ తద్వారా పై భావనలపై పీపుల్స్‌వార్ 1995 ఏఐఎస్‌సీ, పార్టీ యూనిటీ 1997 కేంద్ర మహాసభలలో అవగాహనలో లోపాలను సరిదిద్దింది. తద్వారా నేడు దేశంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధంలో కొత్త పుంతలు తొక్కడానికి నేపథ్యాన్ని సృష్టించింది. ప్రజాయుద్ధాన్ని ఉధృతం చేసి, దేశంలో ఇతర ప్రాంతాలకు దాన్ని విస్తరింపజేయాలని కాంగ్రెస్ దృఢంగా తీర్మానించింది. విముక్తి ప్రాంతాలను నెలకొల్పడానికి శాయశక్తులా కృషి చేయాలని యావత్తు పార్టీకి పిలుపునిచ్చింది. దాని సాధనకు నిర్దిష్ట ప్రణాళికలను రూపొందించింది.

దేశంలో నడుస్తున్న జాతి విముక్తి పోరాటాలతో సమన్వయ సాధనకు, చిత్తశుద్ధితో కమ్యూనిస్టు విప్లవకారుల ఏకీకరణ కర్తవ్యంతో ముందుకు పోవడానికి తన దృఢ సంకల్పాన్ని వ్యక్తం చేసింది. క్షుణ్ణమైన దిద్దుబాటు ఉద్యమం ద్వారా వివిధ కార్మికవర్గేతర ధోరణులను తుడిచివేసుకుని, తద్వారా పార్టీని శ్రామికవర్గీకరించి, చేపట్టిన బృహత్తర కర్తవ్యాల అమలుకు తగిన విధంగా చేసుకోవాలని పార్టీకి పిలుపునిచ్చింది.

9వ కాంగ్రెస్ గుర్తించిన లోపాలు

ప్రజా యుద్ధ స్థాయికి అనుగుణంగా జనతా ప్రజాస్వామిక అధికార అంగాలను నెలకొల్పలేకపోయామన్న లోపాన్ని కాంగ్రెస్ గుర్తించింది. వందలాది గ్రామాలలో భూస్వామ్య శక్తుల పాత అధికారాన్ని కూలదోసాం. రాజ్యాన్ని బలహీనపరిచాం. కానీ ఈ శూన్యాన్ని ప్రజల నూతన అధికారంతో నింపలేదు.

పార్టీ నిర్మాణంలో, పార్ట్‌టైం పీఎంల వ్యవస్థ బలహీనంగా ఉండడం, కొన్ని నాయకత్వ పార్టీ కమిటీలలో సయితం వృత్తిపరతత్వం లోపించడం వంటి కొన్ని అంశాల వల్ల ఉద్యమ వేగం కుంటుపడిందని కాంగ్రెస్ గుర్తించింది.

శత్రు ఎత్తుగడల దాడులను, వారి సంస్కరణ, సంక్షేమ కార్యక్రమాలను సకాలంలో ఎదుర్కోవడంలో తగిన ఎత్తుగడలను రూపొందించడంలో బలహీనతను అధిగమించాలనీ వాస్తవ పరిస్థితుల నిర్దిష్ట అధ్యయనాన్ని చేపట్టాలనీ బలగాల మొహరింపులో వెసులుబాటు అవలంబించాలనీ భారీ శత్రు దాడులకు గురవుతున్న కొన్ని ప్రాంతాల నుంచీ శక్తులను తాత్కాలికంగా రిట్రీట్ చేసే ఎత్తుగడలను చేపట్టాలనీ పట్టణ పనికి సంబంధించి పని పద్ధతులలో లోపాలను అధిగమించాలనీ, జరుగుతున్న ప్రజాయుద్ధానికి ప్రజా పోరాటాలను సమర్థవంతంగా ముడిపెట్టాలనీ కాంగ్రెస్ పిలుపు ఇచ్చింది.

9వ కాంగ్రెస్ అంచనా ఆధారంగా మునుపటి పీడబ్ల్యూ పార్టీ, సైన్య నిర్మాణం, వ్యూహాత్మక ప్రాంతాలలో జీబీల నిర్మాణం, జనతా ప్రజాస్వామిక అధికార అంగాలు, దిద్దుబాటు క్యాంపెయిన్‌లు, ఎత్తుగడల ఎదురుదాడులను పథకం ప్రకారం చేపట్టడానికి నిర్దిష్ట కర్తవ్యాలు రూపొందించింది. కొన్ని రాష్ట్రాలలో చెప్పుకోతగ్గ విజయాలు సాధించింది. భారీ నిర్బంధం, సంస్కరణలు మొదలయిన ఇతర రూపాల ద్వారా జరుగుతున్న ప్రజాయుద్ధాన్ని అణిచివేయడానికి శత్రు ప్రయత్నాలను తిప్పికొట్టగలిగింది.